ర్యాగింగ్, డ్రగ్స్ నియంత్రణకు
టోల్‌ఫ్రీ నంబర్
విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : విద్యాసంస్థల్లో ర్యాగింగ్, డ్రగ్స్‌ను నివారించేందుకు పది రోజుల్లోపు టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో తెస్తామని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం శనివారం ప్రకటించారు. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో శనివారం మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్‌ఏఎఫ్‌ఏయూ ఆడిటోరియంలో డ్రగ్, ర్యాగింగ్ నియంత్రణపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. యాంటి నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ డ్రగ్స్‌పై 871267111 1 నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీజీపీ డాక్టర్ జితేందర్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, నగర సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ప్రొఫెసర్ వెంకటరమణ, ప్రొఫెసర్ ఎస్కే మహమూద్, కార్యదర్శి శ్రీరాంవెంకటేశ్ పాల్గొన్నారు.

నేనూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థినే

విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యం ఏర్పాటుచేసుకొని.. ఆ దిశగా ముందుకుసాగాలని డీజీపీ జితేందర్ సూచించారు. తానూ ప్రభుత్వ పాఠశాలలోనే చదివి డీజీపీ స్థాయికి ఎదిగినట్టు తెలిపారు. గురుకులాల్లో ప్రవేశం పొందిన 68మంది నిరుపేద విద్యార్థులు, వారి తల్లిదండ్రులను శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో అక్షయ విద్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో డీజీపీ జితేందర్ సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థి దశ ఎంతో అమూల్యమైందని, ఈ సమయంలో చెడుఅలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అక్షయ విద్య స్థాపకుడు వరప్రసాద్, సలహాదారు, ఐజీ ఎం రమేశ్, ఇండియా సీఎస్‌ఆర్ హెడ్ మిచెల్లే డొమినికా, ఫౌండేషన్ స్థాపక ట్రస్టీ జనార్దన్, అకడమిక్ అడ్వైజర్ అరుంధతి, హైకోర్టు న్యాయవాది శ్రీనివాస్‌చౌహాన్ పాల్గొన్నారు.



సంగారెడ్డిలో ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న రైతులు, రైతు సంఘాల నాయకులు

ట్రిపుల్ ఆర్‌కు మా భూములియ్యం
అలైన్‌మెంట్ మార్చాల్సిందే..
తేల్చి చెప్పిన గిర్మాపూర్, పెద్దాపూర్ రైతులు
సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా

సంగారెడ్డి, ఆగస్టు17 : ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చే ప్రసక్తే లేదని రైతులు తేల్చి చెప్పారు. శనివారం సంగారెడ్డిలోని ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఏర్పాటు చేసిన సమావేశాన్ని కొండాపూర్ మండలం గిర్మాపూర్, సదాశివపేట మండలం పెద్దాపూర్ రైతులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. అంతకు ముందే ఆయా గ్రామాల్లో ట్రిపుల్ ఆర్‌కు భూములు ఇచ్చేది లేదంటూ గ్రామస్థులంతా ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఇప్పటికే ఆయా గ్రామాల మీదుగా జాతీయ రహదారి, పెద్దాపూర్ ఫిల్టర్‌బెడ్, మంజీర పైపులైన్, చెరువులు, కాల్వల నిర్మాణానికి భూములు తీసుకుని తమను కూలీలుగా మార్చారని మండిపడ్డారు. ఇప్పటికే నాందేడ్-అకోలా జాతీయ రహదారి శివ్వంపేట నుంచి కంది ఐఐటీ వరకు వెళ్తున్నదని చెప్పారు. ఈ రోడ్డును చింతల్‌పల్లికి జతచేయడంతో చింతల్‌పల్లి, తాళ్లపల్లి, కల్పగూర్, కులబ్‌గూర్, ఇరిగిపల్లి, గిర్మాపూర్, పెద్దాపూర్‌లో భూసేకరణ మిగిలిపోతుందన్నారు. ప్రభుత్వానికి బడ్జెట్ మిగులుతుందని, ఈ విషయాన్ని గుర్తించి గిర్మాపూర్-పెద్దాపూర్ నుంచి అలైన్‌మెంట్ మార్చాలని వారు కోరారు. వీరికి రైతు సంఘాల నాయకులు జయరాజు, పృథ్వీరాజ్, టీజేఎస్ తుల్జారెడ్డి మద్దతిచ్చారు.



కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనకు నిరసనగా గాంధీ దవాఖానలో నిరసన తెలుపుతున్న వైద్యులు

కదం తొక్కిన వైద్యులు

- కోల్‌కతాలో వైద్యురాలి హత్యాచార ఘటనపై పెల్లుబికిన నిరసనలు
- రాష్ట్రవ్యాప్తంగా వైద్యసేవలు బంద్
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలి అత్యాచారం, హత్య ఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా వైద్యులు కదం తొక్కారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) పిలుపు మేరకు ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో శనివారం ఓపీ సేవలు బంద్ చేశారు. వైద్య విద్యార్థులు, హౌస్‌సర్జన్లు భారీ ర్యాలీలు తీశారు. హైదరాబాద్ ధర్నాచౌక్‌లో ఐఎంఏ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఘటనకు బాధ్యులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కోల్‌కతాలోని ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో డ్యూటీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం, హత్య ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఘటనపై దేశవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ ఈ ఘటనను ఖండిస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, న్యాయవ్యవస్థ కఠినంగా వ్యవహరించి నిందితులను శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. వైద్యుల ధర్నాలకు వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు సంఘీభావం ప్రకటించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, కార్యదర్శి కుమార్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై నిర్లక్ష్యం వహిస్తూ హంతకులను కాపాడే ప్రయత్నం చేస్తున్న పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని పేర్కొన్నారు.

గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారి ఉండాలి
రైతు సంఘం రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): భూసంబంధిత వివరాల సేకరణకు, ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ అధికారిని నియమించాలని పలువురు వక్తలు కోరారు. గ్రామాలవారీగా రికార్డులు తయారు చేసి, డిజిటలైజ్‌తోపాటు మ్యానువల్ కూడా రూపొందించాలని సూచించారు. పహణీ, కాస్తు కాలం కొనసాగించాలని కోరారు. తెలంగాణ హక్కుల రికార్డు బిల్లు-2024పై తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని వైవీ కృష్ణారావు రైతుభవన్‌లో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడారు. సంఘం ప్రధాన కార్యదర్శి పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వ్యవసాయ రంగ నిపుణులు నరసింహారెడ్డి, హైకోర్టు న్యాయవాదులు వేణుగోపాల్, రాజ్‌రెడ్డి, గోకుల్, రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావు, సామాజిక కార్యకర్త సాధిక్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి రాజిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల రక్షణకు
జియో రిఫరెన్సింగ్
రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వంలోని వివిధ శాఖలకు చెందిన భూములు, ఇతర స్థిరాస్తులను జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ ద్వారా సంరక్షించనున్నట్టు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జీ చిన్నారెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ రాలేని పరిస్థితిని తీసుకొచ్చేందుకే ఈ విధానాన్ని అనుసరించనున్నట్టు తెలిపారు. ఖైరతాబాద్‌లోని తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్ (టీజీరాక్) సంస్థ కార్యకలాపాలపై శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయోగాత్మకంగా ఆర్టీసీ, హోంశాఖ భూముల కోసం జియో రిఫరెన్సింగ్ మ్యాపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. టీజీ రాక్ ఏడీజీ మనోహర్, అర్థ గణాంక శాఖ డైరెక్టర్ రుఫస్, నరసింహాచారి, శివప్రసాద్ పాల్గొన్నారు.

కులగణన చేయకుంటే సర్కారుపై యుద్ధమే

- సాధనే లక్ష్యంగా ఈ నెల 22 నుంచి ఉద్యమం
- వచ్చేనెల 6న హైదరాబాద్ దిగ్బంధం: జాజుల



మీడియా సమావేశంలో జాజుల

రవీంద్రభారతి,ఆగస్టు17: సమగ్ర కులగణన చేపట్టిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేకుంటే కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ స్పష్టంచేశారు. కులగణన సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని తెలిపారు. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందాల గణేశాచారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జాజుల మాట్లాడారు. ఈ నెల 22న అఖిలపక్ష పార్టీల సమావేశం, 26 జిల్లా కలెక్టరేట్ల ముట్టడి, సెప్టెంబర్ 6 లక్షలాది మంది బీసీలతో హైదరాబాద్ నగరాన్ని దిగ్బంధిస్తామని తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ విస్మరించి బీసీ కులగణన ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీ చెప్పిన కులగణన బూటకమని, ఆయన మాటకు ఆ పార్టీలో విలువలేదని పేర్కొన్నారు. ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని, ప్రాణత్యాగానికి వెనుకాడబోమని జాజుల స్పష్టం చేశారు. బాల్‌రాజ్ గౌడ్, వేముల వెంకటేశ్ పాల్గొన్నారు.

స్వచ్ఛ్ బయోకు ఎలాంటి హామీ ఇవ్వలేదు
మంత్రి శ్రీధర్ బాబు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): అమెరికా పర్యటనలో భాగంగా స్వచ్ఛ్ బయో సంస్థకు ప్రయోజనం కల్పించే ఎలాంటి హామీని తాము ఇవ్వలేదని పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. తాము సంతకం చేసింది జెనరిక్ ఎంవోయూ మాత్రమేనని చెప్పారు. శనివారం సచివాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తమ విదేశీ పర్యటన వివరాలను మంత్రి వెల్లడించారు. స్వచ్ఛ్ బయో సంస్థ ఇటీవల ఏర్పడి ఉండవచ్చు కానీ అది సుగనిత్ రెన్యూవబుల్స్‌తో అధికారిక భాగస్వామ్యంలోకి ప్రవేశించిందని తెలిపారు. 9 రోజుల తమ పర్యటన విజయవంతమైందని, 25కంపెనీలతో రూ. 36వేల కోట్ల పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని చెప్పారు.

ఐపీవో పేరుతో 5 కోట్లు లూటీ
సైబర్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు • ఇద్దరు నిందితుల అరెస్ట్



హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): బంగారం కంపెనీ ఐపీఓకి వచ్చిందని, పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ఆశచూపి.. ఓ వ్యక్తి నుంచి రూ.5.40 కోట్లను లూటీ చేసిన ఇద్దరు అన్నదమ్ములను తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) అధికారులు అరెస్టు చేసినట్లు శనివారం సీఎస్‌బీ డైరెక్టర్, డీజీ శిఖాగోయెల్ తెలిపారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లికి చెందిన ఓ వ్యక్తి కేరళలో రూ.8.5 కోట్లకు పైగా అప్పుతో రెండు చారిటబుల్ ట్రస్ట్‌లను నిర్వహిస్తున్నాడు. అతనికి ట్రేడింగ్‌పై అవగాహనతో 8918520578 నంబర్ నుంచి వాట్సాప్‌తో "B6/Stock Visionaries" ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులో జూన్ 8న యాడ్ చేయబడ్డాడు. అప్పటికే ఆ గ్రూప్‌లో కొందరు లాభాలు వస్తున్నాయని మెసేజ్‌లు చేస్తుండటంతో నిజమేనని నమ్మాడు. అనంతరం లిడియా శర్మ అనే మహిళ 'గోల్డ్‌మన్ సాక్స్' అనే ఇండియా కంపెనీ ఐపీవోకు సిద్ధంగా ఉందని, దాంట్లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయిని మెసేజ్ చేసింది. స్పందించిన ఫిర్యాదుదారుడు.. ఆమెకు మెసేజ్ చేశాడు. ఆమె సూచన మేరకు ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించి జూలై 10న రూ.30వేలతో ప్రారంభించి జూలై 25 నాటికి రూ.5,40,47,000 పెట్టాడు. వాటిని విత్‌డ్రా చేసుకునే ప్రయత్నంలో సైబర్ మోసగాళ్లు మరింత పెట్టాలని ఆదేశించడంతో.. మోసపోయానని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసులో కీలకంగా వ్యవహరించిన రాంపిల్ల కొండల్‌రావు, చంద్రశేఖర్ ఆజాద్‌ను విజయవాడలో అదుపులోకి తీసుకున్నారు.

ఆర్టీఐ యాక్ట్ ప్రత్యేకావసరాల పిల్లలకా?

- డీఎస్సీ ప్రాథమిక 'కీ'లో తప్పులు

హైదరాబాద్/జగిత్యాల, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : 'రైట్ టూ ఇన్ఫర్మేషన్ యాక్ట్' దీనినే తెలుగులో సమాచార హక్కు చట్టం అంటారు. కానీ ఈ యాక్ట్ ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యకు సంబంధించినదట. ఈ చట్టం వారి కోసం కూడా రూపొందించారట. ఇది ఇటీవల నిర్వహించిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఓ ప్రశ్నకు ఇచ్చిన సమాధానం. డీఎస్సీ రిక్రూట్‌మెంట్ పరీక్షలో ప్రత్యేకావసరాలు గల పిల్లల విద్యకు సంబంధించిన ఏ చట్టం అసంబద్ధం అన్న ప్రశ్ననిచ్చారు. ఆప్షన్లుగా ఆర్టీఐ యాక్ట్, ఆర్సీఐ యాక్ట్, ఆర్టీఈ యాక్ట్, ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్ అని ఇచ్చారు. వాస్తవానికి ఒక్క ఆర్టీఐ యాక్ట్ తప్ప మిగతా చట్టాలన్నింటిని ప్రత్యేకావసరాలు గల వారి కోసం రూపొందించారు. కానీ విద్యాశాఖ అధికారులు మాత్రం ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్ సరైన సమాధానమని ఇచ్చారు. ఇది తప్పు అని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. ADHD యొక్క పూర్తి రూపం 'అటెన్షన్ డెఫిసిట్ హైపర్యాక్టివిటీ డిజాస్టర్' కాగా, బదులుగా మాస్టర్ 'కీ'లో మాత్రం 'ఆటో డెఫిసిట్ హైపర్యాక్టివిటీ డిజాస్టర్' సరైన సమాధానంగా ప్రకటించారు. యూడీఎల్ యొక్క ప్రధాన సూత్రం ఏదీ అన్న ప్రశ్నకు ఇచ్చిన ఆన్సర్‌పైనా అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

18 వరకు తప్పులు..

డీఎస్సీ ప్రశ్నపత్రాల్లో ఒకే పేపర్‌లో 18 వరకు తప్పులున్నట్టు అభ్యర్థులు చెబుతున్నారు. ప్రధానంగా స్పెషల్ ఎడ్యుకేషన్(స్కూల్ అసిస్టెంట్) పరీక్ష మాస్టర్ 'కీ'లో 160 ప్రశ్నలకు ఇచ్చిన ప్రాథమిక కీలో అత్యధిక తప్పులున్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. ప్రశ్నపత్రం రూపకల్పనపైనా అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. జీవో-4 ప్రకారం ఒక్కో విభాగం నుంచి 20 ప్రశ్నలు మాత్రమే ఇవ్వాల్సి ఉండగా, అలా ఇవ్వలేదని, ఒక్క లర్నింగ్ డిసెబిలిటీలో 35 వరకు ప్రశ్నలిచ్చారని ఇది అత్యంత దారుణమని అభ్యర్థులు వాపోతున్నారు.

అంతా గందరగోళం..

తెలుగు గ్రేడ్-1 పరీక్ష ప్రశ్నపత్రంలో 52వ ప్రశ్నగా 'గౌరీశ్వరులు అనే పదాన్ని విడదీయగా' అని ఇచ్చారు. దీనికి 71505321007 క్వశ్చన్ ఐడీ నంబర్‌ను కేటాయించారు. ఆప్షన్‌గా 2వ నంబర్‌ను పేర్కొన్నారు. అయితే కీ పత్రంలోని జవాబులో మాత్రం సరైన సమాధానంగా 4వ నంబర్(గ్రీన్ కలర్)తో గౌరీ+ఈశ్వరులు అని పేర్కొన్నారు. అయితే ఈ ప్రశ్నలో సరైన సమాధానం 2వ నంబర్‌గా నిపుణులు పేర్కొంటున్నారు. 'కీ' లో తెలుగు పండిత పరీక్షకు సంబంధించి 5 ప్రశ్నలకు సమాధానాలు ఇలానే తప్పుగా ఇచ్చారు. కాగా డీఎస్సీ 'కీ' పత్రంపై అభ్యంతరాలు ఉంటే, ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయవచ్చునని, అవసరమైతే మెయిల్ లేదా ఫోన్ చేయవచ్చునంటూ మెయిల్ అడ్రస్‌లతో పాటు, ఫోన్ నంబర్లను సైతం ఇచ్చింది. ఫిర్యాదు చేసేందుకు యత్నిస్తే.. సరైన సమాధానం రావడం లేదని అభ్యర్థులు వాపోతున్నారు. 'కీ'లో వచ్చిన అంశాలపై ఆన్‌లైన్‌లో అభ్యంతరం వ్యక్తం చేయడానికి వీలు లేని పరిస్థితి ఉందని ఆందోళన చెందుతున్నారు.

ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీకి రోడ్డు మెట్రో కనెక్టివిటీ

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ అభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డి శనివారం అధికారులతో చర్చించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్‌సిటీకి రోడ్ కనెక్టివిటీపై రూట్‌మ్యాప్‌ను అధికారులు సీఎంకు వివరించారు. ఔటర్ రింగ్‌రోడ్ నుంచి రీజినల్ రింగ్ రోడ్ వరకు కనెక్టివిటీ ఉండేలా రోడ్‌మ్యాప్ తయారుచేయాలని ముఖ్యమంత్రి అధికారుల సూచించారు. ఫ్యూచర్ సిటీలో రేడియల్ రోడ్స్ అభివృద్ధికి వీలుగా ప్రణాళికలు సిద్ధంచేయాలని చెప్పారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రోమార్గం ఉండేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. రోడ్డు, మెట్రో మార్గాలకు సంబంధించి భూసేకరణ, ఇతర అంశాలపై అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వీలైనంత త్వరగా పూర్తిస్థాయి ప్రణాళికలు, రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని చెప్పారు. సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తాకట్టుకు ఐఎంజీ భూములు!

మొదటిపేజీ తరువాయి...

మామిడిపల్లి, రావిర్యాలలో 450 ఎకరాల భూమి ప్రభుత్వానికి అందుబాటులోకి వచ్చింది. ఇందులో టీజీఐఐసీ ఆధీనంలో ఉన్న 450 ఎకరాల భూమిని కూడా తాకట్టు పెట్టి అక్షరాలా రూ.20 వేల కోట్లను సమీకరించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. బాండ్ల రూపంలో రుణాలు సమీకరించేందుకు రంగం సిద్ధంచేసింది. ఇంత పెద్ద మొత్తంలో రుణాలు తీసుకోవాలంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఇలా తీసుకునే పక్షంలో ఎఫ్‌ఆర్‌బీఎం వంటి అంశాలు పరిగణనలోకి వస్తాయి. అందుకే, ఎఫ్‌ఆర్‌బీఎం పరిధిలోకి వెళ్లకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు ఇన్వెస్టర్లను, ప్రైవేటు బ్యాంకులను సంప్రదిస్తున్నది. 20-30 ఏండ్ల కాలానికి రుణాలను తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నది. ఈ సొమ్ము వస్తే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీల్లో కొన్నింటిని నెరవేర్చవచ్చన్నది ప్రభుత్వ పెద్దల ఆలోచనగా చెప్తున్నారు. అయితే, ఒక సంవత్సరంపాటు మాత్రమే ఆయా హామీలను నెరవేర్చేందుకు ఈ భూములు ఉపయోగపడతాయని, ఆ తరువాత పరిస్థితేమిటన్న ప్రశ్న తలెత్తుతున్నది.

ఆ 400 ఎకరాలను ఏం చేస్తారు?

ఐఎంజీ భారత్ నుంచి స్వాధీనం చేసుకున్న మరో 400 ఎకరాల భూమిని ప్రభుత్వం ఏం చేస్తుందనే అంశం ఆసక్తికరంగా మారింది. గచ్చిబౌలిలో ఉన్న ఈ స్థలాలు అత్యంత విలువైనవి. ఇక్కడ ఎకరం భూమి విలువ కనీసం రూ.70 కోట్ల నుంచి 80 కోట్లు పలుకుతుందని రియల్‌ఎస్టేట్ వర్గాలు చెప్తున్నాయి. వీటిలో ఇంకా కొన్ని ఆక్రమణలు ఉన్నాయి. వీటిని తొలగించే బాధ్యతను ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అప్పగించింది. వీటిని కూడా వేలం వేస్తే కనీసం రూ.30 వేల కోట్లకుపైగా వస్తుందని ప్రభుత్వ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంటే ఒక్క ఐఎంజీ భూముల ద్వారానే ప్రభుత్వానికి కనీసం రూ.50 వేల కోట్లు సమకూరే అవకాశం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో రియల్‌ఎస్టేట్ పుంజుకోకపోవడంతో ఈ భూములకు సంబంధించిన ఆక్రమణలను పూర్తిగా తొలగించి స్వాధీనం చేసుకున్న తర్వాత వీటిని కూడా అమ్మివేసే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. రానున్న ఏడాదిలోపే హైదరాబాద్‌లోని అత్యంత విలువైన రూ.50 వేల కోట్ల విలువైన భూములను తాకట్టుపెట్టి గానీ, అమ్మిగానీ ప్రభుత్వ ఖజానాను నింపాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్టు సమాచారం. ఒకవేళ ప్రభుత్వం ఐఎంజీ భూములన్నింటినీ అమ్మి రూ.50 వేల కోట్లను సమీకరించుకుంటే.. ఉమ్మడి రాష్ట్రం మొదలు ప్రత్యేక రాష్ట్రం వరకు ఎన్నడూలేని విధంగా భూముల ద్వారా అత్యధిక సొమ్మును సమీకరించుకున్నట్టవుతుంది.

స్కిల్ వర్సిటీ కోర్సులకు దసరా ముహూర్తం!

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా ముచ్చర్ల వద్ద నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో దసరా నుంచి కోర్సులను ప్రారంభించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వెల్లడించారు. వర్సిటీలో 20 కోర్సులు నిర్వహించాలని గుర్తించగా, తొలుత ఆరు కోర్సులను ప్రారంభిస్తామని తెలిపారు. వర్సిటీ ప్రారంభం, విధివిధానాల ఖరారు, కోర్సుపై శనివారం సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తొలుత స్కూల్ ఆఫ్ ఈ-కామర్స్, లాజిస్టిక్స్ రిటైల్ విభాగంలోనూ సర్టిఫికెట్ కోర్సులు, డిప్లొమా కోర్సులను ప్రారంభించనున్నట్టు చెప్పారు. యూనివర్సిటీ లోగో, వెబ్‌సైట్‌ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఆర్థిక, పరిశ్రమల శాఖల ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, జయేశ్‌రంజన్, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వెంకటేశం, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ వెంకటరమణ, శ్రీనిరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

జలమండలి ఈడీపై బదిలీ వేటు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం సత్యనారాయణపై రాష్ట్ర ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఈ మేరకు శనివారం పురపాలకశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 8 ఏండ్లుగా ఎక్స్‌టెన్షన్‌పై కొనసాగుతున్న సత్యనారాయణ పదవీకాలం జూలై 31తో ముగిసింది. ఆయన సేవలను కొనసాగించాలని నిర్ణయించి ప్రభుత్వం మరో ఏడాదిపాటు పదవీకాలాన్ని పొడిగించింది. ఇటీవల సుంకిశాలలో జరిగిన ప్రమాద ఘటనలో బాధ్యులైన నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు వేయడంతోపాటు ప్రాజెక్టు డైరెక్టర్‌పై బదిలీవేటు పడింది. సుంకిశాల ఘటనలో సత్యనారాయణ ప్రమేయం ఉన్నట్టు ప్రాథమిక అంచనాకు వచ్చిన ప్రభుత్వం ఎంతఆర్‌డీసీఎల్‌కు బదిలీ చేసింది.

నమస్తే తెలంగాణ

జిందగీ

హైదరాబాద్
ఆదివారం 18 ఆగస్టు 2024
www.ntnews.com



సోమవారం
రక్షాబంధన్

బ్రో! ఒక్కసారి ఆఫ్‌లైన్‌లోకి రా..!

‘హే.. చెర్రీ నీకేదో లెటర్!’ అనగానే..
‘నాకు లెటరేంట్రా! సరిగ్గా చూడు’ అన్నాడు చెర్రీ.
‘నీకే మామా! ఫ్రమ్ యువర్ సిస్టర్’ అన్నాడు లేఖ తీసుకున్న కొలీగ్. ఆత్రంగా లెటర్ అందుకున్నాడు చెర్రీ..

‘హాయ్.. అన్నయ్యా!! ఉభయ కుశలోపరి..’
ఉత్తరంలో మొదటి వాక్యం చదవగానే చెర్రీ ఆసక్తి రెండింతలైంది.
‘నీకు గుర్తుందా?
టెక్స్ట్ మేసేజ్‌లు, వాట్సాప్‌లు లేవప్పుడు..
ఇంటి వాకిటి అరుగుపై నువ్వూ, నేనూ ఎన్నిగంటలు తీరిగ్గా కూర్చునేవాళ్లమో!
అప్పుడు చెప్పుకొన్న విక్రమార్క-బేతాళ కథలు నాకింకా గుర్తు.
ఏ ఎమోజీలు పుట్టలేదింకా! ‘అబ్బా! చాల్లేవే రాక్షసీ’ అని అరిచినప్పుడు నీ ముఖంలో ఎక్స్‌ప్రెషన్ భలేగా ఉండేది. అదే నాకు ఇష్టమైన మొదటి ఎమోజీ!



అమెజాన్‌లు, ఆన్‌లైన్ డెలివరీలు మనకేం తెలుసు!
నీ చేతులతో చేసిన ‘తాటిముంజె బుర్రల బండి’.. మెరుపువేగంతో వచ్చి నాకు ఇచ్చావ్ చూడు... అదే నాకు ఫస్ట్ గిఫ్ట్!
‘నాకూ కొంచెం పెట్టవా!’ అని నేను తింటున్న పీచు మిఠాయిలో వాటా అడగడం, నేనివ్వడం నా బెస్ట్ షేరింగ్ మూమెంట్.
ఇవన్నీ నీకు గుర్తున్నాయా అన్నయ్యా! నాకు అలాంటి మూమెంట్స్ కావాలి! కనీసం ఏడాదికి ఒక్కరోజైనా! ఈ రాఖీ పండుగ పూటైనా! అందుకే ఇలా లెటర్ రాస్తున్నా. నువ్వు పెట్టిన అన్ని ఆన్‌లైన్ గిఫ్ట్స్ డెలివరీలు క్యాన్సిల్ చేసి ఇంటికి రా..! ఆ రోజంతా ఆఫ్‌లైన్‌లోనే కాలక్షేపం చేద్దాం!’



చెర్రీ కండ్లల్లో నీళ్లు. అవి బాధతోనో.. ఆనందంతోనో వచ్చినవి కాదు. సాసరంత పేపర్ మీద.. ఓ దోసెడన్ని అక్షరాలు.. చెర్రీని పాతికేండ్లు వెనక్కి లాక్కుపోయాయి. క్యాలెండర్ గడుల్లో బందీ అయిన జ్ఞాపకాలను తన చెల్లెలు ఇలా గుర్తుచేస్తుందని అనుకోలేదు. ఫోన్ టింగ్‌మన్నది. అమెజాన్ నోటిఫికేషన్. నవ్వుకొని.. మళ్లీ లెటర్ చదవసాగాడు..

‘లాస్ట్ ఇయర్.. నువ్వు అమెజాన్‌లో పంపిన ఫోన్‌తో నీ కోడలు ఆడుకుంటున్నది. హెడ్‌సెట్‌లో నీ బుజ్జి అల్లుడు వాడికి నచ్చిన పాటలు వింటున్నాడు. వీళ్ల వయసులో మనం ఎలా ఆడుకున్నామో గుర్తుందా... చెడుగుడు ఆటలో నా వల్ల నీ నుదురుకు పెద్ద గాయమైంది. అప్పుడు నాకెంత భయమేసిందో! ఇంట్లో తెలిస్తే నాన్న ఏం చేస్తారో అని ఏడ్చేశా!! అంత బాధలోనూ నన్ను ఓదార్చావ్! ఇంటికి వెళ్లాక ‘చెట్టు కొమ్మను చూసుకోలేదు.. తగిలింది’ అని చెబుతూ నావైపు చూసిన చూపు నాకింకా ఫ్రెష్‌గానే ఉంది. చెల్లిని భరించడం అన్నకుండే డీఫాల్ట్ ఫీచరేమో! అని నిన్ను చూస్తే తెలుస్తుంది. ఆ క్షణంలో మా అన్న సూపర్ అనిపించింది. ఈ మాట అప్పుడు చెప్పలేకపోయా కానీ, ఇప్పుడు చెబుతున్నా! మనమంతా కలిసి ఆడిన ఆటలు, అందులోని ఎమోషన్స్ అన్నీ నాతోనే ఉన్నాయి. ఏంట్రా ఇది ఇంత పెద్ద పెద్ద మాటలు మాట్లాడేస్తున్నది అనుకుంటున్నావేమో!!’ చెర్రీ ముఖంలో చిరునవ్వు.

చెర్రీ ఫోన్‌కు మరో నోటిఫికేషన్. మింత్రా నుంచి.. పక్కకు స్వైప్ చేసి ఆలోచనలో పడ్డాడు. చిన్నప్పుడు ఎంత పెంకిలా ఉండేది. ఇప్పుడు ఎలా మారిపోయింది. ఉద్యోగం, పిల్లలు, కుటుంబ బాధ్యతలు.. తన బిజీలో తానుంది అనుకున్నా. కానీ, ఈ అన్నతో జర్నీని ఇంత పదిలంగా దాచుకుందంటే... అది తోబుట్టువుకు మాత్రమే తెలిసిన ఎమోషన్ ఏమో!!’ అనుకుంటూ... మళ్లీ లెటర్ తడుముతూ.. చదవసాగాడు.
‘అఫ్‌కోర్స్ ఈ రోజుల్లో వర్చువల్‌గానే బహుమతులు ఇచ్చిపుచ్చుకుంటున్నారు అనుకో! ఆరేండ్లుగా మనమూ అదే చేస్తున్నాం. నేను నీకు కట్టే రాఖీలు అమెజాన్‌లో బుక్ చేస్తున్నా. నాకు ఇవ్వదలుచుకున్న గిఫ్ట్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ పెట్టేస్తున్నావ్! రెండు నిమిషాల వీడియో కాల్‌లో మూడు ముచ్చట్లు. ఈసారి అలా కుదరదు. అందుకే రాఖీలు కొన్నా పంపలేదు. వచ్చేయ్ అన్నయ్యా! మా ఇంటి వాకిట్లో అరుగు లేకపోవచ్చు. బేతాళ కథలు చెప్పుకోనవసరం లేదు. చిన్నప్పటి మన కబుర్లు గుర్తు చేసుకుందాం. నా పిల్లలకు చెబుదాం. మనం ఎలా ఆడుకున్నామో, ఎలా ఆటపట్టించుకున్నామో.. అన్నీ చెబుదాం. మనంత కాకపోయినా, కాస్తయినా వారి మధ్య రియల్ ఎమోషన్ డెవలప్ అవుతుంది. ఏమంటావ్? వచ్చేస్తావ్‌గా!! సర్లేగానీ, ఆల్రెడీ పెట్టిన ఆర్డర్లేమీ క్యాన్సిల్ చేయొద్దు! ఏదో ఎమోషన్‌లో అనేశా!!’

ఇట్లు..
నీ చెల్లి

> “నవ్వుకుంటూ.. లెటర్ జేబులో పెట్టుకున్నాడు చెర్రీ. చెల్లెలు ఊరికి టికెట్ బుక్ చేశాడు. ఇది చెర్రీ, అతని చెల్లి కథ మాత్రమే కాదు. చాలామంది ఇలాగే ఫీలవుతున్నారు. అందుకే సోదరీమణులారా వర్చువల్ అభినందనలు పక్కనపెట్టి.. అన్నదమ్ముల చేతికి స్వహస్తాలతో రాఖీ కట్టండి. వారు ఆప్యాయంగా అందించే కానుకలను అపురూపంగా అందుకోండి.”

వాళ్లు
కామెడీగా చూస్తే
ఓన్లీ నవ్వుల్స్!
సీరియస్‌గా చూస్తే
పొట్ట చెక్కలే!!
స్క్రీన్ మీద కనిపిస్తే చాలు...
ఈలలు, గోలలు!! కథ భారంగా
ఉన్నప్పుడు రిలీఫ్ ఇచ్చేవాడు,
రిలాక్స్‌డ్‌గా సాగిపోతున్న కథ వేగం
పెంచేవాడు కమెడియన్. కథకేమో గానీ,
కథనానికి మాత్రం కింగ్‌లాంటోడు. మిగతా భాషల
సంగతేమో కానీ, తెలుగు చిత్రసీమ మాత్రం ఆదినుంచీ
కమెడియన్లతో కళ కళ లాడింది. వీరిలో కొందరు
హీరోలయ్యారు, నిర్మాతలయ్యారు, దర్శకులుగా రాణించారు.
ఒక్కమాటలో చెప్పాలంటే.. వాళ్లందరూ కామెడీ కింగ్స్!

సినిమా బాగుండాలంటే.. కథ చక్కగా కుదరాలి. కానీ, కథనం ముదిరి పాకాన పడాలంటే, పక్కన పకపక నవ్వించేవాడు ఉండాలి. ప్రేక్షకులు పక్క చూపులు చూడకుండా తెరకు అంకితమయ్యేలా హాస్యం పండాలి. మంచి బిగువు ఉన్న కథ, స్క్రిప్టుకు ప్రత్యేకంగా కామెడీ ట్రాక్ అవసరం లేదు కానీ, అన్ని సినిమాలకూ అది వర్కవుట్ కాదు. ఒక్కోసారి ఎంత గొప్ప కథకైనా కథనంలో కుదుపులు తప్పవు. ఎప్పుడైతే స్క్రీన్‌ప్లే డౌన్ అవుతుందో థియేటర్ తలుపులు తెరుచుకుంటూ ఉంటాయి. ఆడియన్స్‌లో ఒక్కొక్కరూ లేచీ బయటికి నడుస్తూ ఉంటారు. ఇది సినిమాకు ప్రమాద ఘంటిక. అలాంటి సమయంలో డౌన్ అవుతున్న సినిమాని భుజం పట్టి పైకి లేపడానికి ఓ క్యారెక్టర్ కావాలి. అక్కడ ఏదో మాయ జరగాలి. మళ్లీ సినిమా ట్రాక్ ఎక్కాలి. వాడే ‘కమెడియన్’. తోలుబొమ్మలాట, బుర్రకథలు, హరికథలు, ఒగ్గు కథలు.. మొదలైన జానపద కళారూపాల్లోనూ జనం ఆవులిస్తున్నప్పుడల్లా వాళ్ల నిద్రమత్తు వదిలించేందుకు ఓ విదూషకుడుండేవాడు. అలాగే సినిమాకు కమెడియన్. ఓ విధంగా కథను బతికించడానికీ.. సమాంతరంగా నడిపించి, రక్తికట్టించడానికీ.. రచయితల మస్తిష్కంలోంచి పుట్టుకొచ్చిన సినిమా రక్షకుడు ‘కమెడియన్’. అసలు తెలుగు సినిమాలో కామెడీ శకం ఎప్పుడు మొదలైంది? ఎన్ని మలుపులు తిరిగింది? అది ఇంతింతై వటుడింతై అన్న చందాన సినిమాను ఎలా ఆక్రమించింది? ఎలా శాసించింది? ఈ అంశాల గురించి కాసేపు గుర్తుచేసుకుందాం.

కామెడీ కింగ్స్

తెలుగు తెరపై తొలి కమెడియన్ కస్తూరి శివరావ్. తొలి స్టార్ కమెడియన్ కూడా ఆయనే. తొలినాళ్లలో టెంటుహాళ్ల బయట టిక్కెట్లు చింపిన శివరావ్, తర్వాత ప్రొజెక్టర్ బాయ్‌గా ప్రమోటయ్యారు. ఆ తర్వాత నటుడై, స్టార్ కమెడియన్‌గా ఎదిగారు. స్వర్గసీమ, బాలరాజు, ముగ్గురు మరాఠీలు, మాయలమారి, రక్షరేఖ, లైలామజ్ను, మన దేశం.. ఇలా 40ల్లో వచ్చిన ప్రతి సినిమాలో కమెడియన్ అంటే శివరావే. విచిత్రమైన ఆకారం, విభిన్నమైన డైలాగ్ డెలివరీ.. వీటికి తోడు చక్కటి సంగీత జ్ఞానం. ఈ మూడూ శివరావ్‌ని తిరుగులేని కమెడియన్‌గా నిలబెట్టాయి. ‘గుణసుందరికథ’ చిత్రంతో ఆయన హీరోగా కూడా మారారు. ‘పరమానందయ్య శిష్యులు’(1950) అనే చిత్రాన్ని స్వీయ దర్శకత్వంలో నిర్మించి చేతులు కాల్చుకున్నారు. ‘నా జీవితంలో నేను చేసిన అతిపెద్ద తప్పు సినిమా తీయడమే’ అని పలు వేదికల్లో చెప్పేవారు శివరావ్.

అయితే శివరావ్ ప్రభ తెలుగుతెరపై ఎక్కువకాలం వెలగలేదు. తన సమకాలీన కమెడియన్ రేలంగి వెంకటరామయ్యకు ‘పాతాళభైరవి’ (1951) రూపంలో పెద్ద బ్రేక్ రావడంతో శివరావ్ కెరీర్ మసకబారింది. రేలంగి కామెడీ సూపర్‌స్టార్‌గా అవతరించారు. తెలుగు సినిమా హాస్యానికి స్వర్ణయుగం మొదలైంది. రేలంగి దశాబ్దాలపాటు సినీహాస్యాన్ని శాసించారు. అంతేకాదు, ‘పద్మశ్రీ’ పురస్కారం అందుకున్న తొలి హాస్యనటుడిగా రికార్డు సృష్టించారు. ఆయన ఉధృతంగా ఉన్నప్పుడే పద్మనాభం కూడా దీటుగా సినిమాలు చేస్తూ సత్తా చాటారు.
కస్తూరి శివరావు, రేలంగి, పద్మనాభం, రాజబాబు, సుత్తివేలు ఆ తర్వాత బ్రహ్మానందం.. వీళ్లని హీరోయిజంతో కూడిన హాస్యనటులు అనాలి. సినిమాల్లో ఈ స్టార్ కమెడియన్లకు ఓ సపరేట్ ట్రీట్‌మెంట్ ఉంటుంది, ఓ హీరోయిన్ ఉంటుంది. డ్యూయెట్లూ ఉంటాయి. ఇంకా మాట్లాడితే ఫైట్లు కూడా చేస్తారు. ఇదంతా ఓ రకం. వీరిలో సుత్తివేలు మినహా అందరూ సోలో హీరోలుగా నటించినవారే. రేలంగి.. పెద్దమనుషులు, పక్కయింటి అమ్మాయి చిత్రాల్లో హీరోగా చేశారు. రాజు-పేద, శభాష్‌రాజా చిత్రాల్లో హీరోతో సమానమైన పాత్రలు పోషించారు. కమెడియన్ పద్మనాభం హీరోగా సత్తాచాటాడు. ‘రేఖ-మురళీ ప్రొడక్షన్స్’ పతాకంపై ఎన్టీఆర్ అంతటి సూపర్‌స్టార్‌తో ‘దేవత’ లాంటి బ్లాక్ బస్టర్ నిర్మించాడు. శ్రీశ్రీశ్రీ మర్యాదరామన్న, జాతకరత్న మిడతంభొట్లు, పొట్టి ప్లీడర్ లాంటి చిత్రాలను నిర్మించి, తానే హీరోగా నటించాడు. ‘కథానాయిక మొల్ల’ సినిమాతో దర్శకుడిగా కూడా సత్తా చాటాడు. అలాగే రాజబాబు కూడా తాతామనవడు, పిచ్చోడి పెళ్లి, తిరుపతి, ఎవరికివారే యమునాతీరే, మనిషి రోడ్డునపడ్డాడు చిత్రాల్లో హీరోగా అలరించాడు. ‘బాబాయ్ హోటల్’తో బ్రహ్మానందం కూడా హీరోగా అదరహో అనిపించాడు.

> “రమణారెడ్డి, అల్లు రామలింగయ్య, సుత్తి వీరభద్రరావు.. ఈ ముగ్గురి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. వీరికి జనరేషన్‌తో ప్రమేయం ఉండదు. స్టార్ కమెడియన్ ఎవరైనా.. వారికి దీటుగా సమాధానమిచ్చే హాస్యనటులు ఈ ముగ్గురు.”

ఇదంతా ఒక చరిత్ర అయితే.. అసలు కామెడీ నుంచి హీరోయిజాన్ని ఆవిష్కరించిన చరిత్ర ఆంధ్రా దిలీప్‌గా ప్రఖ్యాతి గాంచిన ‘చలం’ది. ఇప్పటివరకూ మనం చెప్పుకొన్న కమెడియన్లందరూ హీరోలుగా అలా అప్పుడప్పుడు మెరిసి మాయమైన వారే. కానీ చలం మాత్రం కమెడియన్‌గా ఎంట్రీ ఇచ్చి నటుడిగా ఎదిగాడు. హీరోగా మారాడు. ‘రమణచిత్ర’ అనే సంస్థను స్థాపించి అద్భుతమైన చిత్రాలను నిర్మించాడు. హీరోగా ఓ వెలుగు వెలిగాడు. తెలుగు చిత్రసీమలో చలం కమెడియన్స్‌కి ఓ టార్చ్‌బేరర్. ఎందుకంటే.. కమెడియన్లు కూడా స్టార్ హీరోలు కావొచ్చని నిరూపించిన తొలి నటుడు చలం. మట్టిలోమాణిక్యం, సత్తెకాలపు సత్తెయ్య, సంబరాల రాంబాబు, బొమ్మా-బొరుసా, బుల్లెమ్మ బుల్లోడు, తోటరాముడు, లంబాడోళ్ల రాందాసు.. ఇలా హీరోగా ఎన్నో అద్భుతాలు సృష్టించాడు చలం. ఆయన సినిమాల్లో పాటలకు ఇప్పటికీ అభిమానులున్నారు. మాస్ హీరోలు రాజ్యమేలుతున్న తరుణంలో నరేశ్, రాజేంద్రప్రసాద్ లాంటి వాళ్లు చలం దారిలో పయనించే హీరోలుగా నిలబడ్డారు. అదే దారిలో పయనించి అలీ హీరోగా దాదాపు యాభై చిత్రాల్లో నవ్వులు పంచాడు. అల్లరి నరేశ్, సునీల్ లాంటి వాళ్లు కూడా సత్తా చాటుతున్నారు. ఇదంతా మన తెలుగు సినిమా నవ్వుల నక్షత్రాల జ్ఞాపకాల దొంతర. ఒక చిన్ననవ్వుతో ప్రపంచయుద్ధాలు ఆపొచ్చంటారు. అదే నవ్వుతో చెరగని చరిత్రనే సృష్టించవచ్చని రుజువుచేసిన మన కామెడీ స్టార్లకు ప్రేక్షకుడెప్పుడూ రుణగ్రస్తుడే.

... బుర్రా నరసింహా



ఆయన లేచేసరికి.. నేను పడుకుంటా!



అభిమానులను అలరించాలంటే హీరోలకు ఫిట్‌నెస్ చాలా అవసరం. వయసు పైబడుతున్న కొద్దీ.. బాడీని కంట్రోల్‌లో ఉంచుకోవడం చాలా కష్టం. అలాంటిది 58 ఏండ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తాడు బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్. వరుసగా జవాన్, పఠాన్ హిట్లు కొట్టి తన స్టామినాను మరోసారి నిరూపించుకున్నాడు. ఈ రెండు యాక్షన్ సినిమాల్లోనూ ఎనర్జిటిక్‌గా అలరించిన షారుఖ్ పవర్ సీక్రెట్ ఏంటో తెలుసుకోవాలని అభిమానులు ఆరాటపడుతుంటారు. వారందరినీ ఆశ్చర్యపరుస్తూ తన ఫిట్‌నెస్ రహస్యాలను బయటపెట్టాడు షారుఖ్. ‘అమెరికన్ నటుడు మార్క్ వాల్‌బర్గ్ నిద్ర నుంచి లేచే సమయానికి నేను నిద్రపోతాను. షూటింగులు పూర్తి చేసుకుని అర్ధరాత్రి 2 గంటలకు ఇంటికి చేరుకుంటా. స్నానం చేసి, కాసేపు వర్కవుట్లు చేసి.. తెల్లవారుజామున 5 గంటలకు నిద్రపోతా. పది గంటలకల్లా లేచి... మళ్లీ రెడీ అయ్యి షూటింగ్‌కు వెళ్లిపోతాను. తక్కువ ఆహారం తీసుకుంటాను. పోషక విలువలు ఉండేలా చూసుకుంటాను’ అని చెప్పుకొచ్చాడు కింగ్ ఖాన్.

ఆ పాత్రలు బోర్ కొట్టేశాయ్

మీర్జాపూర్ వెబ్‌సిరీస్‌లో బీనా త్రిపాఠి పాత్ర పోషించిన రసికా దుగ్గల్ ఇప్పుడు అందరికీ హాట్ ఫేవరేట్. 2007 నుంచి ఇండస్ట్రీలో కొనసాగుతున్న ఆమె.. మీర్జాపూర్ తర్వాత సెలెబ్రిటీ అయ్యింది. ఆమె నటించిన వెబ్‌సిరీస్ ‘లిటిల్ థామస్’ను మెల్‌బోర్న్‌లో జరుగుతున్న ఇండియన్ ఫిలిం ఫెస్టివల్‌లో ఈ నెల 19న ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా రసికా దుగ్గల్ మాట్లాడుతూ.. ‘ఎంత మంచి క్యారెక్టర్లు చేసినా చివర్లో ఏడుపు సీన్లు ఉండాల్సిందే. అలాంటి పాత్రలు చేసి చేసి నాకు బోర్ కొట్టేసింది.



దర్శక నిర్మాతలు కూడా ఈ మధ్య కాస్త భిన్నంగా ఆలోచిస్తున్నారు. బహుశా వాళ్లకు కూడా నా ఏడుపు చూసి బోర్ కొట్టేసిందేమో! నాకంటూ కొత్త రోల్స్ ఇస్తున్నారు. అందుకు ఆనందంగా ఉంది. ఓటీటీ వల్లే అది సాధ్యమైందని అనుకుంటున్నాను. ఎన్నో సినిమాల్లో నటించాను. మీర్జాపూర్ సిరీస్‌కు వచ్చినంత పేరు దేనికీ రాలేదు. ఈ సిరీస్‌తో బాగా పాపులారిటీ వచ్చింది. అప్పటినుంచి అవకాశాలు కూడా ఎక్కువయ్యాయి’ అని చెప్పుకొచ్చింది రసికా దుగ్గల్.

ఏడుస్తూ ఇంటికి వెళ్లేదాన్ని

చిన్న సినిమాలతో ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన రష్మిక అనతి కాలంలోనే టాప్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. ‘పుష్ప’తో నేషనల్ క్రష్‌గా ఎదిగింది. అయితే ఈ స్టేజీకి అంత ఈజీగా రాలేదని చెబుతున్నది ఈ కన్నడ సౌందర్యం. ‘హీరోయిన్ అవకాశం కోసం ఎన్నో ఆడిషన్స్ ఇచ్చాను. సుమారు 25 వరకు ఆడిషన్స్‌కు వెళ్లానేమో! అన్నిటిలోనూ రిజెక్ట్ చేసేవారు. నా నటనపై వాళ్లకు ఎప్పుడూ అనుమానం ఉండేది. దాన్నే నేను తట్టుకోలేక పోయేదాన్ని. సెలెక్ట్ కాలేదని తెలిసిన తర్వాత కన్నీళ్లు ఆగేవి కాదు. ఏడుస్తూ ఇంటికి వెళ్లేదాన్ని. ఓ సినిమా కోసం చాలాసార్లు ఆడిషన్ చేశారు. చివరికి సెలెక్ట్ అయ్యాను. మూడు నెలలపాటు ఆ సినిమాకు సంబంధించిన వర్క్‌షాప్స్ జరిగాయి. ఇంత కష్టపడ్డ తర్వాత ఆ ప్రాజెక్ట్ క్యాన్సిల్ అయింది. ఇలా ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నా. నన్ను నేను మెరుగుపర్చుకుంటూ ఈ స్థాయికి చేరుకున్నా’ అని చెప్పుకొచ్చింది రష్మిక. ప్రస్తుతం ఈ బ్యూటీ ‘పుష్ప: ది రూల్’, విక్కీ కౌశల్ నటిస్తున్న ‘చవ్వా’, సల్మాన్ ఖాన్ ‘సికిందర్’, శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘కుబేర’ సినిమాల్లో నటిస్తున్నది.



ఇదిగో సాక్ష్యం.. ఏదీ రుణ మోక్షం?

• కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో..



తమకు రుణమాఫీ వర్తింపజేయాలంటూ కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి నిరసన ధర్నా చేస్తున్న రైతులు

• జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లో..



జగిత్యాల జిల్లా మల్లాపూర్ రైతువేదికలో డీఏవో వాణి, ఎల్‌డీఎం రాము ఎదుట రైతు ఏలేటి రాజరెడ్డి పురుగుల మందు డబ్బాతో నిరసన తెలిపాడు. తనకు మాఫీ జరగకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానంటూ పురుగు మందు డబ్బా చూపించాడు.

• కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్



రుణమాఫీ కోసం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంక్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

గతంలో ఇట్లా ఇబ్బంది కాలేదు...



నాకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఎడపల్లిలోని సిండికేట్ బ్యాంకులో రూ.1.33లక్షలు రుణం తీసుకున్నా. రుణమాఫీ మూడో జాబితాలోనూ పేరు రాలే. బ్యాంకు అధికారులను, వ్యవసాయాధికారిని అడిగితే ఆధార్ కార్డు నంబర్ కొడితే వేరే సమాచారం చూపిస్తున్నదని అంటున్నరు. వారం రోజుల తర్వాత రమ్మంటున్నరు. మాకు రుణమాఫీ వర్తింపజేయాలి.

- ఆర్ స్వామిగౌడ్, ఒడ్డాపల్లి, ఎడపల్లి మండలం, నిజామాబాద్ జిల్లా

• యువరైతు ఆత్మహత్యాయత్నం



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం చౌడారం మధిర గ్రామం ఎల్లమ్మజాలులో శనివారం రైతు వంకాయల రాజు తనకు చెందిన రెండు లక్షల పంట రుణమాఫీ కాలేదని మనస్తాపంతో పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా, పక్కనున్న రైతులు అడ్డుకున్నారు. ఈ వీడియా సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నకు ఈ వీడియో చేరవేయాలని ఆ వీడియోలో వేడుకున్నాడు. -చిన్నకోడూరు

రాజకీయంగా రుణమాఫీ చేయలేదు



నాకు మూడెకరాల 20 గుంటల భూమి ఉంది. సొసైటీ బ్యాంకులో రూ.1,74,024 రుణం తీసుకున్నా. కానీ నాకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదు. నేను సీపీఎం తరుపున ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని విమర్శిస్తునందుకే నాకు చేయలే. కాంగ్రెస్ నాయకులు కావాలనే ఇలా చేశారు. ప్రభుత్వం రుణమాఫీపై గొప్పలు చెప్పింది కానీ.. అచరణలో మాత్రం చేయడం లేదు.

- శివ వర్మ, రైతు, సీపీఎం నాయకుడు, ముక్కిడిగుండం, నాగర్‌కర్నూల్ జిల్లా

• నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలంలో



నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలోని గాంధీ చౌక్‌లో రైతులు నిరసన తెలిపారు. రుణమాఫీకి నోచుకోని వారంతా కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. - ధర్పల్లి

నేను ఏ తప్పు చేసిన



నేను గిరిజన రైతును. నేను రూ.98వేలు తీసుకున్న. అర్హత ఉన్నా నా పేరు రుణమాఫీ లిస్టులో లేదు. ఇప్పుడు పంట వేసుకునేందుకు డబ్బులు లేక పొలం బీడుగా పెట్టుకున్న. ఉన్న పాసుబుక్ బ్యాంకులో ఉన్నది. ఎవరూ నాకు అప్పు ఇస్తలేరు. నేను ఏం తప్పు చేసిన. నాకు ఎందుకు వర్తింపజేయలేదో అర్థం కావడం లేదు. నాకు ఎందుకు ఇయ్యలేదో ప్రభుత్వమే సమాధానం చెప్పాలి.

- పూల్యా నాయక్, రైతు, ముక్కిడిగుండం, నాగర్‌కర్నూల్ జిల్లా



ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో..

తమకు రెండు లక్షల రుణ మాఫీ కాలేదంటూ ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తుమ్మలపల్లికి చెందిన 50 మంది రైతులు శనివారం కలెక్టరేట్‌లోని సహాయ కేంద్రానికి చేరుకున్నారు. ఆ వెంటనే కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రధాన గేటు ముందు నుంచి జాతీయ రహదారిపైకి చేరుకొని నిరసన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి, జిల్లా మంత్రులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. - కొణిజర్ల

• కామారెడ్డి జిల్లాలో..



రాజంపేట మండలం ఆరెపల్లితండాకు చెందిన రైతు కెతావత్ హరి భార్య పేరిట రూ.2లక్షల రుణం ఉన్నది. మూడో విడుత రుణమాఫీ జాబితాలో పేరు లేకపోవడంతో కామారెడ్డిలోని కలెక్టరేట్‌కు వెళ్లగా అధికారులెవరూ పట్టించుకోలేదు. దీంతో జంగంపల్లి గ్రామానికి చేరుకొని శివారులోని సెల్‌టవర్ ఎక్కి నిరసన తెలిపారు. రుణమాఫీ కాలేనందున టవర్‌పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటున్నానని కుటుంబసభ్యులకు, మీడియాకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. ఘటనా స్థలానికి కుటుంబసభ్యులు, మీడియా, గ్రామస్తులు చేరుకొని హరిని సముదాయించడంతో దిగొచ్చాడు. -భిక్కనూరు

• సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల ..



మాకెందుకు రుణ మాఫీ కాలేదంటూ శనివారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామునిపట్ల వద్ద రాజీవ్ రహదారిపై రైతులు రాస్తారోకో చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రుణ మాఫీ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. - చిన్నకోడూరు,

మూడో జాబితాలో లేదు



నాకు రెండెకరాల 30 గుంటల భూమి ఉంది. రూ.80 వేల క్రాప్‌లోన్ తీసుకున్న. మొదటి, రెండో విడతల్లో రుణమాఫీ అయ్యిందని బ్యాంకుల చుట్టూ తిరిగితే కాలేదని అధికారులు చెప్పిండ్రు. మూడో విడత జాబితాలోనూ నా పేరు రాలే. అసలు, వడ్డీ కలిపి రూ.1,39,500 రుణం ఉన్నట్టు బ్యాంక్ సారోళ్లు చెబుతున్నరు. అప్పు కట్టమంటున్నరు. కానీ మాఫీ గురించి ఏం చెప్పట్లే. నాకు ఏం చేయాలో అర్థం కావడం లేదు.

-బంగారమ్మ, ముక్కిడిగుండం, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

• కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలో..



కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో అవినీతి, అక్రమాలు జరిగాయని, అర్హులకు రుణమాఫీ కాలేదని ఆరోపిస్తూ రైతులు శనివారం రహదారిపై రాస్తారోకో చేశారు. రుణమాఫీ జాబితాలో పేర్లు రాకపోవడంతో ఎక్కడ తప్పిదం జరిగిందా? అని రైతులు ఆరా తీశారు. రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్లు, మాఫీ అయినా మాఫీ కానట్లు, చనిపోయిన వారికి సైతం రెన్యువల్ అయినట్టు గుర్తించామని రైతులు తెలిపారు. - రెబ్బెన

రైతుగుండెలో కాంగ్రెస్ గునపం పోట్లు

- రుణమాఫీపై మాట తప్పి మోసం
- రాష్ట్రవ్యాప్తంగా వెలిసిన పోస్టర్లు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): 'దేవుళ్ల మీద రేవంత్‌రెడ్డి ఒట్లు.. తెలంగాణ రైతాంగం గుండెల్లో గునపం పోట్లు' అనే నినాదంతో రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు వెలిశాయి. రుణమాఫీపై కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరికి పోస్టర్లు అద్దంపడుతున్నాయి. 'రుణమాఫీపై మాట తప్పి మోసం.. రైతాంగం పాలిట కాంగ్రెస్ శాపం', 'కాంగ్రెస్ కుతంత్రం.. రుణమాఫీ తూతూ మంత్రం' అని కాంగ్రెస్ పార్టీ ద్వంద్వనీతిని ఎండగడుతూ వెలసిన పోస్టర్లు ప్రధాన కూడళ్లల్లో చర్చనీయాంశంగా మారాయి. రుణమాఫీపై రేవంత్‌రెడ్డి సర్కార్ ఆయా సందర్భాల్లో చేసిన వ్యాఖ్యలను, ఎన్నికల ముందు నమ్మబలికిన తీరును పోస్టర్లు కండ్లకు కడుతున్నాయి. రుణమాఫీపై 'మొదట చెప్పింది రూ.40వేల కోట్లు...రెండోసారి చెప్పింది రూ. 31వేల కోట్లు....చేసింది మాత్రం రూ. 17వేల కోట్లు' అని సీఎం రేవంత్‌రెడ్డి సహా ఉపముఖ్యమంత్రి, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు చేసిన వ్యాఖ్యలను క్రోడీకరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా వెలసిన పోస్టర్లు రచ్చబండ దగ్గర చర్చకు తెరలేపాయి.

• సిద్దిపేట జిల్లా చిన్నకోడూరులో..



సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున రైతులు రాస్తారోకో చేశారు. వెంటనే అందరికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అరకొర రుణమాఫీతో మిగతా రైతులకు ఎగ్గొడతామంటే సహించేది లేదని కాంగ్రెస్ సర్కారును హెచ్చరించారు. - చిన్నకోడూరు,

రేవంత్‌వి బూటకపు మాటలే..



రేవంత్ సర్కారు చేసిన రూ.2 లక్షల రుణమాఫీలో మా ఊళ్లోనే 99 శాతం మంది అర్హులు ఉన్నారు. అయినా చాలా మందికి కాలేదు. నాకు రెండెకరాల 12 గుంటల భూమి ఉంది. రూ.85 వేలు క్రాప్‌లోన్ తీసుకున్న. అర్హత ఉన్నా లిస్టులో నా పేరు రాలే. కారణాలు తెలుసుకునేందుకు బ్యాంకుల చుట్టూ తిరిగుతున్న. అధికారులు కారణాలు చెప్పడం లేదు. ప్రభుత్వం బూటకపు మాటలు నమ్మి మోసపోయిన.

-మల్లేశ్, ముక్కిడిగుండం, కొల్లాపూర్ మండలం, నాగర్‌కర్నూల్ జిల్లా

వినేశ్‌కు ఘన స్వాగతం

భారీ సంఖ్యలో అభిమానుల రాక • భావోద్వేగానికి లోనైన స్టార్ రెజ్లర్



న్యూఢిల్లీ: భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫోగాట్‌కు సొంతగడ్డపై అపూర్వ స్వాగతం లభించింది. అందరూ ఊహించినట్లే పతక విజేతలకు మించి అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి రెజ్లర్‌కు స్వాగతం పలికారు. శనివారం ఉదయం 10.30కు ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఫోగాట్ కోసం సహచర రెజ్లర్లు సాక్షి మాలిక్, బజరంగ్ పునియాతో పాటు హర్యానా కాంగ్రెస్ లీడర్ దీపేందర్ హుడా, పంచాయత్ సభ్యులు తరలివచ్చారు. ఓవైపు 'డోల్' చప్పుల మధ్య ఫ్యాన్స్ నృత్యాలు చేస్తూ వినేశ్‌పై పూల వర్షం కురిపించారు. అభిమానుల తాకిడి నేపథ్యంలో ఆమెకు మెరుగైన భద్రతా ఏర్పాట్లు చేశారు. ఓపెన్ టాప్ జీపులో బజరంగ్, సాక్షితో కలిసి అభిమానులకు అభివాదంచేస్తూ వినేశ్ ముందుకు సాగింది. ఈ క్రమంలో దీపేందర్ విజయానికి చిహ్నమైన గదను బహుకరించగా.. ఒకింత భావోద్వేగానికి లోనైన వినేశ్‌ను ఆమె భర్త సోమ్‌వీర్, సాక్షి, దీపేందర్ ఓదార్చారు. తన సొంత గ్రామమైన బలాలీకి చేరుకునే క్రమంలో ఢిల్లీలోని ద్వారక దేవాయలంలో వినేశ్ పూజలు చేసింది. మొత్తం 135 కి.మీ ప్రయాణానికి దాదాపు 10 గంటల సమయం పట్టగా, దారి మధ్యలో పలు కాప్ పంచాయతీలకు చెందిన సభ్యులు ఆమె ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'మీరు నాపై చూపించిన ప్రేమ, గౌరవం..1000 ఒలింపిక్ పసిడి పతకాలు గెలిచిన దాని కంటే ఎక్కువ' అని చెమర్చిన కండ్లతో అంది. ఇదిలా ఉంటే ఇప్పటికే తన కెరీర్‌కు వీడ్కోలు పలికిన వినేశ్..కొనసాగే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తున్నది. కొద్దిరోజులు కుటుంబసభ్యులతో గడిపిన తర్వాత వినేశ్ ఏదో ఒక నిర్ణయానికి వస్తుందని సాక్షి మాలిక్ పేర్కొంది. వంద గ్రాముల అధిక బరువుతో అనర్హతకు గురైన వినేశ్‌కు అంతర్జాతీయ క్రీడా న్యాయస్థానం(కాస్)లో చుక్కెదురైన సంగతి తెలిసిందే. కాస్ తీర్పును వినేశ్ తిరిగి సవాల్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీ!

- **ఒలింపిక్స్ స్థాయి ప్రమాణాలతో క్రీడా అకాడమీలు**
- **అథ్లెట్లకు శిక్షణలో కొరియన్ స్పోర్ట్స్ వర్సిటీ సహకారం**

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ (ఫోర్త్ సిటీ)లో నిర్మించే స్పోర్ట్స్ హబ్‌లో దీన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్నది. దాదాపు 12 వివిధ క్రీడల అకాడమీలను ఇక్కడే పెట్టాలని భావిస్తున్నది. వీటిలో అంతర్జాతీయ స్థాయి అధునాతన మౌలిక సదుపాయాలు ఉంటాయి. ఈ స్పోర్ట్స్‌హబ్‌లో స్పోర్ట్స్ సైన్స్ సెంటర్, స్పోర్ట్స్ మెడిసిన్ సెంటర్ కూడా ఉండేలా ఏర్పాట్లు చేయనున్నారు. కొత్తగా స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ తరహాలోనే తెలంగాణ స్పోర్ట్స్ వర్సిటీకి 'యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ' అనే పేరు పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి అనువైన స్థలంగా ప్రస్తుతం హకీంపేటలో ఉన్న స్పోర్ట్స్ స్కూల్ లేదా గచ్చిబౌలిలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలిస్తున్నారు. ఆ క్యాంపస్‌ను ఒలింపిక్స్ స్థాయి అంతర్జాతీయ ప్రమాణాలు ఉండేలా అప్‌గ్రేడ్ చేయాలని నిర్ణయించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల దక్షిణ కొరియాలో పర్యటనలో సియోల్‌లోని కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శించారు. ఇది ప్రపంచంలోనే పేరొందిన స్పోర్ట్స్ వర్సిటీగా ప్రత్యేకత చాటుకున్నది. భవిష్యత్తులో ఒలింపిక్ చాంపియన్లకు శిక్షణ ఇచ్చేలా తెలంగాణ యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీకి సాంకేతిక భాగస్వాములుగా కొరియన్ నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీ సేవలను వాడుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది.



గాయం వల్లనే..

పారిస్ ఒలింపిక్స్‌ప్రదర్శనపై నీరజ్ • డైమండ్ లీగ్ బరిలో స్టార్ అథ్లెట్ • 90మీటర్ల మార్క్ లక్ష్యంగా ప్రాక్టీస్

గాయం కారణంగా తాను అనుకున్న లక్ష్యాన్ని చేరుకోలేకపోయానని భారత డబుల్ ఒలింపియన్ నీరజ్ చోప్రా పేర్కొన్నాడు. ఇటీవలే ముగిసిన ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌లో నీరజ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. ఓవైపు గాయం వేధిస్తున్నా..బల్లాన్ని అద్భుతంగా విసురుతూ రెండో స్థానంలో నిలిచాడు. అంచనాలు అందుకోలేకపోవడానికి గాయం తీవ్ర ప్రభావం చూపించిందని చెప్పుకొచ్చాడు. పూర్తి ఫిట్‌నెస్‌తో ఉంటే 90మీటర్ల మార్క్‌ను కచ్చితంగా చేరుకునేవాడనని స్పష్టం చేశాడు. రానున్న డైమండ్ లీగ్ కోసం సిద్ధమవుతున్న చోప్రా..వచ్చే ఒలింపిక్స్‌లో భారత్ మరింత మెరుగైన ప్రదర్శన కనబరుస్తుందని అన్నాడు.

న్యూఢిల్లీ: భారత స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రా..పారిస్ ఒలింపిక్స్ ప్రదర్శనతో పాటు పలు అంశాలపై మాట్లాడాడు. డైమండ్ లీగ్ కోసం ప్రస్తుతం స్విట్జర్లాండ్‌లో శిక్షణ తీసుకుంటున్న చోప్రా..శనివారం వర్చువల్ ఇంటర్వ్యూలో ముచ్చటించాడు.

90మీటర్ల లక్ష్యంపై..?

వాస్తవానికి పారిస్ ఒలింపిక్స్‌లో 90మీటర్ల మార్క్ అందుకోవాలన్న లక్ష్యాన్ని ఎంచుకున్నాను. కానీ గజ్జల్లో గాయంతో అనుకున్న మేర జావెలిన్‌ను విసరలేకపోయాను. గాయం వేధిస్తుండటంతో రనప్ సరిగ్గా లేకపోవడం విసిరిన బల్లెం సరైన దిశలో వెళ్లకపోవడంతో లక్ష్యాన్ని అందుకోవడంలో విఫలమయ్యాను. కానీ రానున్న టోర్నీల్లో వందకు వంద శాతం విసిరేందుకు ప్రయత్నిస్తా. చూద్దాం ఏం అవుతుందో.

అర్షద్‌తో పోటీపై?



పారిస్ ఒలింపిక్స్‌లో నాకు, పాకిస్థాన్ జావెలిన్ త్రో అథ్లెట్ అర్షద్ నదీమ్ మధ్య స్నేహపూర్వక పోటీ కొనసాగింది. ఇద్దరం తొలిసారి విసిరినప్పుడు ఫౌల్ అయ్యాం. ఆ తర్వాత రెండో ప్రయత్నంలో అర్షద్ 92.97 మీటర్ల దూరం విసిరి కొత్త ఒలింపిక్ రికార్డు నెలకొల్పాడు. ఆ తర్వాత వచ్చిన నా వంతులో 89.45 మీటర్ల దూరం మాత్రం విసరగలిగాను. అర్షద్‌ను చేరుకునేందుకు ప్రయత్నించినా..గాయం కారణంగా పూర్తి స్థాయిలో రాణించలేకపోయాను. వంద శాతం ప్రయత్నం చేసేందుకు శరీరం, మనసు సహకరించలేకపోయింది. గాయంతో ట్రైనింగ్ సెషన్లలో సరిగ్గా విసరలేకపోవడం నా ప్రదర్శనపై ప్రభావం చూపించింది.

టెక్నిక్‌పై దృష్టి పెట్టారా?


పారిస్‌లో కొన్ని వైఫల్యాలు దెబ్బతీశాయి. ముఖ్యంగా జావెలిన్‌ను వేగంగా విసిరినా..లైన్ సరిగ్గా లేకపోవడంతో దూరం తగ్గింది. ఒకవేళ బల్లెం సరైన దిశలో వెళ్లి ఉంటే..మరో రెండు, మూడు మీటర్ల దూరం కలిసి వచ్చేది.

డైమండ్ లీగ్ కోసం సన్నద్ధత?

ఈనెల 22 నుంచి లూసానెలో డైమండ్ లీగ్ మొదలవుతున్నది. ఇందుకోసం ప్రాక్టీస్ చేస్తున్నాను. టాప్-6లో నిలువడం ద్వారా సెప్టెంబర్‌లో జరిగే డైమండ్ లీగ్ ఫైనల్‌కు అర్హత సాధించే అవకాశం లభిస్తుంది. నెల రోజుల్లో సీజన్ ముగిసిన తర్వాత గాయానికి శస్త్రచికిత్స చేయించుకుంటాను.

భారత ప్రదర్శనపై?

భారత్ స్పోర్ట్స్ పవర్‌హౌజ్‌గా మారాలంటే..విప్లవాత్మక మార్పులు రావాలి. ముఖ్యంగా అందరూ అన్ని రకాల క్రీడలు ఆడేందుకు ముందుకు రావాలి. ఏ క్రీడలోనైతే రాణించగలమో గుర్తించి అందుకు తగ్గట్లు ముందుకు సాగాలి. చైనా, అమెరికా, జపాన్ పతకాల సాధనలో ముందున్నాయి అంటే వాళ్ల విధానాల వల్లే. రానున్న రోజుల్లో మనం ఒలింపిక్స్‌తో పాటు ఫిఫా ప్రపంచకప్ టోర్నీకి అర్హత సాధిస్తామన్న నమ్మకం నాకుంది.



వావ్ ఖెలిఫ్!

అల్జీరియా బాక్సర్ అందంపై ఫిదా

అల్జీరియా: ఇమానె ఖెలిఫ్...అల్జీరియా వివాదాస్పద బాక్సర్. ఇటీవలి పారిస్ ఒలింపిక్స్‌లో తనపై వచ్చిన విమర్శలకు పసిడి పతకంతో పంచ్‌లు కురిపించింది. ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తు చేస్తూ తన దేశానికి స్వర్ణ పతకాన్ని అందించింది. ఈ క్రమంలో ఖెలిఫ్‌లోని కొత్త కోణం బయటకు వచ్చింది. బాక్సింగ్ రింగ్‌లో దూకుడుగా పంచ్‌లు విసరడమే కాదు.. అందం విషయంలో తనను మించిన వారు లేరని నిరూపించుకునే ప్రయత్నం చేసింది. ఖెలిఫ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఫ్లోరల్ డిజైన్‌లో మెరిసిపోతున్న ఖెలిఫ్ నవ్వులు చిందిస్తున్నది.

43 మందితో బరిలో

అండర్-20 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

న్యూఢిల్లీ: లిమా వేదికగా ఈనెల 27 నుంచి 31 వరకు జరుగనున్న అండర్-20 ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 43 మందితో కూడిన జట్టుతో భారత్ బరిలోకి దిగనుంది. గత ఎడిషన్‌లో భారత్ 25వ ర్యాంక్‌లో నిలిచింది.

రన్నరప్ హవ్య



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌లో జరుగుతున్న తెలంగాణ షార్ట్‌కోర్స్ అంతర జిల్లాల స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో హవ్య అదరగొట్టింది. శనివారం జరిగిన టోర్నీ 400మీటర్ల ఫ్రీస్టయిల్, 100మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్లలో హవ్య రన్నరప్‌గా నిలిచింది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ రెండో స్థానం దక్కించుకుంది. ప్రస్తుతం బ్లూడాల్ఫిన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఈ యువ స్విమ్మర్ మాండ్య (కర్ణాటక)లో ఈ నెల 30 నుంచి జరిగే సౌత్‌జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌నకు ఎంపికై ప్రతిభ చాటింది.





ఓడిన కోపంలో..రాకెట్ నేలకేసికొట్టి

అల్కారజ్ దుందుడుకు చర్య

సిన్సినాటి: స్పెయిన్ నయా సంచలనం కార్లోస్ అల్కారజ్ విచక్షణ కోల్పోయాడు. ఇప్పటికే పలు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు గెలువడం ద్వారా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకున్న అల్కారజ్ ఓడిన కోపంలో రాకెట్‌ను నేలకేసి బలంగా కొట్టాడు. వర్షం అంతరాయం కారణంగా వాయిదాతో శుక్రవారం జరిగిన పోరులో అల్కారజ్ 6-4, 6-7(5-7), 4-6తో గేల్ మోనోఫిల్స్(ఫ్రాన్స్) చేతిలో అనూహ్య ఓటమి చవిచూశాడు. తొలి సెట్‌ను 6-4తో గెలుచుకున్న ఈ స్పెయిన్ స్టార్..వరుసగా రెండు సెట్లను మోనోఫిల్స్‌కు చేజార్చుకున్నాడు. ఈ క్రమంలో కోపాన్ని అణుచుకోలేకపోయిన అల్కారజ్ రాకెట్‌ను ముక్కలయ్యే వరకు బాదాడు. 'ఇప్పటి వరకు నా కెరీర్‌లో చెత్త మ్యాచ్. దీని కోసం చాలా ప్రాక్టీస్ చేశాను. కానీ స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయాను. ఇదంతా మరిచిపోయి యూఎస్ ఓపెన్ కోసం న్యూయార్క్ బయల్దేరి వెళ్లాలి' అని అన్నాడు. మోనోఫిల్స్‌తో మ్యాచ్‌లో అలా వ్యవహరించడంపై అల్కారజ్ క్షమాపణలు చెప్పాడు.

తెలంగాణ దుఃఖంలోంచి పుట్టిందే కాళేశ్వరం

- **తుమ్మిడిహెట్టి వద్ద నీటిలభ్యత లేకనే రీ డిజైన్**
- **ప్రాజెక్టు విద్యుత్తు చార్జీలపై దుష్ప్రచారం**
- **జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్**
- **జస్టిస్ పీసీ ఘోష్‌కు పలు అంశాలపై వివరణ**



హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దుఃఖంలోంచి పుట్టిందే కాళేశ్వరం ప్రాజెక్టని, తుమ్మిడిహెట్టి కోణం నుంచి చూస్తే అది ఎవరికీ అర్థం కాదని తెలంగాణ రాష్ట్ర జలవనరుల సంస్థ మాజీ చైర్మన్ వీ ప్రకాశ్ వెల్లడించారు. ప్రాజెకు విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌ను శనివారం ఆయన ప్రత్యేకంగా కలిసి కాళేశ్వరంపై జరుగుతున్న ప్రచారం, వాస్తవాలు, ప్రాజెక్టు రీ డిజైన్ ఆవశ్యకత, ప్రయోజనాలను వివరించారు. అనంతరం బీఆర్కే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. తెలంగాణ భవిషత్తు కోసమే కేసీఆర్ అన్ని ప్రాజెక్టులను డిజైన్ చేశారని వివరించారు. వాస్తవంగా అక్కడ 165 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా అందులో ఎగువ రాష్ట్రాలు వినియోగించుకోని 63టీఎంసీలు ఉన్నాయని, ఆ జలాలను మినహాయిస్తే అక్కడ నికర నీటి లభ్యత 102 టీఎంసీలేనని వివరించారు. బరాజ్ ఎత్తును 152ఎఫ్‌ఆర్‌ఎల్ వద్ద నిర్మించేందుకు మహారాష్ట్ర సర్కారు ఒప్పుకోలేదని, 148ఎఫ్‌ఆర్‌ఎల్‌కే సుముఖత వ్యక్తం చేసిందని, ఆ ఎత్తులో బరాజ్ నిర్మిస్తే తెలంగాణ వినియోగించుకోగలిగేది 54టీఎంసీలకు మించవని తెలిపారు. ప్రాజెక్టు ప్రాంతంలో చాప్రాల్ అభయారణ్యం కూడా ఉన్నదని, అనుమతుల సాధన కష్టమని, ఈ సవాళ్లన్నింటి నేపథ్యంలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కేసీఆర్ రీ డిజైన్ చేసి మేడిగడ్డకు మార్చారని గుర్తుచేశారు. హైదరాబాద్ రాష్ట్రం ఉన్నప్పుడు కృష్ణా, గోదావరి బేసిన్‌లో 9 భారీ ప్రాజెక్టుల నిర్మాణానికి రూపకల్పన జరిగితే ఆంధ్రలో విలీనం తర్వాత 7 ప్రాజెక్టులు అటకెక్కాయని తెలిపారు. కృష్ణా, గోదావరిపై కర్ణాటక, మహారాష్ట్ర దాదాపు 300కు పైగా చెక్‌డ్యామ్‌లు, ఇతర ప్రాజెక్టులు కట్టాయని, దీంతో దిగువకు జలాలు రావడం తగ్గిపోయిందని, నీటి కొరతతో కరువు ఏర్పడి తెలంగాణ రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. ఒక్క గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టుల ఆయకట్టుకే 400 టీఎంసీలకు పైగా కావాలని నొక్కిచెప్పారు.

26న కమిషన్‌కు సాక్ష్యాలు అందిస్తా

ప్రాణహిత ప్రాజెక్టు లక్ష్యం కేవలం 16లక్షల ఎకరాల ఆయకట్టేనని, కాళేశ్వరం కింద కొత్త, స్థిరీకరణ కలిపి 38లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టు ఉన్నదని గుర్తుచేశారు. స్వల్పకాలంలోనే 17లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించామని వెల్లడించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగింది తప్ప అవినీతికి తావులేదని స్పష్టం చేశారు. విద్యుత్తు చార్జీలపై చేస్తున్న ప్రచారం కూడా అబద్ధమని, అసంబద్ధమని తెలిపారు. ప్రాజెక్టు ప్రతి అంశాన్ని నోట్ రూపంలో కమిషన్‌కు అందించానని, కమిషన్ సూచనమేరకు వాటన్నింటికీ సాక్ష్యాలతో సహ 26న అఫిడవిట్‌ను దాఖలు చేస్తానని చెప్పారు.

సమన్ల జారీకి కమిషన్ సమాయత్తం

కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ విచారణ శనివారం నుంచి పునఃప్రారంభమైంది. విశ్రాంత ఇంజినీర్లతో పాటు, పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ అభిప్రాయాలు వెల్లడించారు. తాజాగా వీ ప్రకాశ్ ప్రాజెక్టు రీ డిజైన్, ప్రయోజనాలను వివరించారు. ప్రాజెక్టు ఇంజినీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, ప్రైవేట్ వ్యక్తుల అభిప్రాయాలన్నింటినీ అఫిడవిట్ల రూపంలో ఇవ్వాలని సూచించిన మేరకు మొత్తం 57మంది అఫిడవిట్లు దాఖలయ్యాయి. రెండు వారాల్లో అఫిడవిట్లపై విచారణ ప్రక్రియ ప్రారంభించే దిశగా కమిషన్ కసరత్తు చేస్తున్నట్టు సమాచారం.

పశువైద్యాధికారికి జాతీయ సాహితీ పురస్కారం

కథల పోటీల్లో కోటేశ్వర్‌రావుకు ప్రథమ బహుమతి



కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఆగస్టు 17: నమస్తే తెలంగాణ దినపత్రిక, ముల్కనూరు సాహితీ పీఠం సంయుక్తంగా నిర్వహిస్తున్న 2023-24 జాతీయస్థాయి తెలుగు కథల పోటీల్లో కరీంనగర్ ప్రాంతీయ పశుసంవర్ధక శిక్షణ కేంద్రంలో సీనియర్ ఫ్యాకల్టీగా పనిచేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ ఎం కోటేశ్వరరావు ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. తలపండిన రచయితలు పాల్గొంటున్న ఈ పోటీల్లో ఒక సాధారణ పశువైద్యాధికారి ప్రథమ బహుమతిని గెలుపొందటం విశేషం. ఆయన రూ.50 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమెంటో అందుకోనున్నారు. తన కున్న సాహిత్య అనుభవం వృత్తిలో రాణించడానికి, రైతులకు వందల సంఖ్యలో సాంకేతిక వ్యాసాలు రాయటానికి ఎంతో దోహదం చేసిందని డాక్టర్ కోటేశ్వరరావు తెలిపారు. ఆయన్ను సంబంధిత శాఖ అధికారులు అభినందించారు.

• 'నమస్తే తెలంగాణ' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు





ఏపీ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ఫొటోగ్రఫీ కాంపిటేషన్-2024లో 'నమస్తే తెలంగాణ' నల్లగొండ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ ఆర్ ఆకాశ్‌కు అవార్డు దక్కింది. దేశవ్యాప్తంగా 500 ఎంట్రీలు రాగా.. నల్లగొండలో బోనాల సందర్భంగా ఆకాశ్ తీసిన పోతరాజు విన్యాసం ఫొటో కన్సోలేషన్ అవార్డుకు ఎంపికైంది. ఈ నెల 19న ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

- నల్లగొండ రూరల్



ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సమాచార శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నమస్తే తెలంగాణ సూర్యాపేట స్టాఫ్ ఫొటోగ్రాఫర్ పీ సైదిరెడ్డి మొదటి అవార్డుకు ఎంపికయ్యారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అంశంపై సైదిరెడ్డి తీసిన ఫొటో ప్రథమ అవార్డు దక్కించుకుంది. ఈ నెల 19న హైదరాబాద్ గ్రీన్ పార్క్ హోటల్‌లో అవార్డుతోపాటు నగదు బహుమతిని అందుకోనున్నారు.

-సూర్యాపేట(నమస్తే తెలంగాణ)





మహబూబ్‌నగర్ 'నమస్తే తెలంగా' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ బందిగే గోపి జాతీయస్థాయి ఉత్తమ ఫొటోగ్రాఫర్ అవార్డుకు ఎంపికైనట్టు ఏపీ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ తెలిపింది. పాలమూరు డైట్ కళాశాలలో మూత్రశాలల వద్ద బారులుదీరిన విద్యార్థినుల వేదనను గుర్తించి తీసిన ఫొటో కన్సోలేషన్ బహుమతికి ఎంపికైంది. ఐపీఆర్ కాంపిటేటివ్‌లో బెస్ట్ న్యూస్ పిక్చర్ కింద సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి అవార్డును అందుకోనున్నారు. -మహబూబ్‌నగర్

సీఎం సీటుకు ఎసరు?!

- స్కామ్‌లు, విచారణలతో సిద్ధరామయ్య ఉక్కిరిబిక్కిరి
- మెజార్టీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నా సీఎం పదవిపై విరక్తి
- ఈ వయసులో టెన్షన్ అవసరమా అంటూ ఆక్రోశం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ముడా కుంభకోణంలో విచారణను ఎదుర్కోనుండటం ఒకవైపు, వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో ఈడీ అరెస్టులు మరోవైపు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డులో అవినీతి మరకలు ఇంకోవైపు.. వెరసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పదవికే ముప్పు తెస్తున్నాయి. వీటితో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఆయన మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు ఉన్నప్పటికీ సీఎం పదవి నుంచి దిగిపోవడానికి సిద్ధమైనట్టు సమాచారం. ఇదే విషయమై అధిష్ఠానం బుజ్జగింపులకు ప్రయత్నించినా.. ఆయన తిరస్కరిస్తున్నట్టు తెలుస్తున్నది. 76 ఏండ్ల వయసులో ఈ రాజకీయ ఒత్తిళ్లు, విచారణలు అవసరమా? అని సన్నిహితుల వద్ద సిద్ధరామయ్య వాపోయినట్టు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో త్వరలోనే ఆయన సీఎం పదవికి రాజీనామా చేయవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రేసులో ఎవరు?

నిరుడు కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డీకే శివకుమార్ సీఎం అవుతారని అందరూ భావించారు. అయితే, అనూహ్యంగా అధిష్ఠానం సిద్ధరామయ్యకు ఆ పదవిని కట్టబెట్టింది. అయితే, తమ నాయకుడికి సీఎం పదవిని ఇవ్వకపోవడంపై డీకే వర్గం ఎమ్మెల్యేలు గుర్రుగా ఉన్నారు. అయితే, మెజారిటీ ఎమ్మెల్యేల మద్దతు సిద్ధరామయ్యకు ఉండటంతో ఇంతకాలం ముఖ్యమంత్రి మార్పు జరుగలేదు. ఇదే సమయంలో డీకేకు ఉప ముఖ్యమంత్రి పదవిని అధిష్ఠానం కేటాయించింది. కాగా, సిద్ధరామయ్య సీఎం పదవి నుంచి దిగిపోతే ఎవరు ఆ రేసులో ఉంటారన్న చర్చ ప్రస్తుతం జరుగుతున్నది. హోంమంత్రి జీ పరమేశ్వరకు సీఎం పదవి ఇవ్వొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. డీకేపై అప్పట్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో అధిష్ఠానం పరమేశ్వర వైపు మొగ్గు చూపవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

వందేండ్లకైనా వచ్చేనా?

గ్రీన్‌కార్డు కోసం అమెరికాలో 3.47 కోట్ల మంది నిరీక్షణ



వాషింగ్టన్, ఆగస్టు 17: అమెరికాలో శాశ్వత నివాస హోదా కల్పించే 'గ్రీన్ కార్డ్'ను పొందేందుకు ప్రవాస భారతీయులు నానా కష్టాలు పడుతున్నారు. గ్రీన్ కార్డు వెయిటింగ్ టైమ్..100 ఏండ్లకు చేరుకుందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్నాయి. దరఖాస్తుల సంఖ్య 3.47 కోట్లకు చేరుకోగా, 2024 ఆర్థిక సంవత్సరంలో 11 లక్షల మందికి గ్రీన్ కార్డులు వచ్చే అవకాశముందని అంచనా! ఈ నేపథ్యంలో ఉన్నత చదువులు, ఉద్యోగాల కోసం అమెరికాకు రావొద్దంటూ నెటిజన్లు సలహాలు ఇస్తున్నారు. ప్రస్తుతం భారత్‌లోని వివిధ నగరాల్లో 'ఎడ్యుకేషన్ యూఎస్‌ఏ ఫెయిర్స్' నిర్వహిస్తున్నారు. వీటిలో పాల్గొనాల్సిందిగా భారత్‌లో అమెరికా అంబాసిడర్ ఎరిక్ గార్సెట్టీ చేసిన ప్రకటనపై నెటిజన్లు మండిపడుతున్నారు. వర్సిటీ ప్రతినిధులు చెప్పే మాటలన్నీ అబద్ధాలేనని, మోసపోవద్దని మనవాళ్లను హెచ్చరిస్తూ సోషల్ మీడియాలో సందేశాలు వెలువడుతున్నాయి.

ఏమిటీ గ్రీన్ కార్డ్?

ఆ దేశంలోనే శాశ్వతంగా బతకాలనుకుంటే 'గ్రీన్ కార్డు' పొందాల్సిందే. లేదంటే హెచ్1-బీ వీసా రెన్యూవల్ చేసుకుంటూ పోవాలి. కుదరకపోతే స్వదేశానికి వెళ్లిపోవాలి. ఎన్ని గ్రీన్ కార్డులు మంజూరు చేయాలన్నది అమెరికా చట్టసభ నిర్ణయిస్తుంది. ఎంప్లాయ్‌మెంట్ బేస్డ్ కార్డులు 1,40,000 మాత్రమే ఉన్నాయి. టెక్నాలజీ, మెడిసిన్, అకడమిక్స్‌లో పనిచేస్తున్న 12 లక్షల మందికిపైగా ప్రవాస భారతీయులు కొన్ని దశాబ్దాలుగా 'గ్రీన్ కార్డు' కోసం ఎదురుచూస్తున్నారు.

'ముడా' చిక్కుల్లో సిద్ధరామయ్య

- కర్ణాటక సీఎంను విచారించేందుకు అనుమతినిచ్చిన గవర్నర్
- సిద్ధరామయ్య భార్యకు విలాస ప్రాంతాల్లో స్థలాలు
- తెర వెనుక చక్రం తిప్పిన కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర
- బీజేపీ సహా హక్కుల కార్యకర్తల సంచలన ఆరోపణలు
- 'ముడా'లో రూ. 4 వేల కోట్ల మేర స్కామ్ అంటూ ఫైర్
- సిద్ధరామయ్య రాజీనామా చేయాలని విపక్షాల డిమాండ్
- రాజీనామా చేసేంత తప్పు తానేం చేయలేదన్న కర్ణాటక సీఎం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): వేల కోట్ల రూపాయల అక్రమాలు చోటుచేసుకున్న మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) కుంభకోణంలో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య అడ్డంగా బుక్కయ్యారు! ఈ స్కామ్‌కు సంబంధించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య విచారణను ఎదుర్కోనున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ఈ కుంభకోణానికి సంబంధించి సిద్ధరామయ్యపై విచారణకు రాష్ట్ర గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్ శనివారం అనుమతిచ్చారు. దీనికి సంబంధించిన సమాచారం అందినట్టు సీఎం కార్యాలయం కూడా నిర్ధారించింది. దీంతో సిద్ధరామయ్యకు రాజకీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఎదురవ్వొచ్చని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం: సిద్ధరామయ్య

తనపై విచారణకు గవర్నర్ అనుమతినివ్వడంపై సీఎం సిద్ధరామయ్య స్పందించారు. గవర్నర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, చట్ట వ్యతిరేకమని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యయుతంగా ఏర్పడ్డ ప్రభుత్వాన్ని కూలదోసేందుకే బీజేపీ, జేడీఎస్ కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. తాను రాజీనామా చేసేంత తప్పేమీ చేయలేదన్నారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు. ముడా కుంభకోణం ఆరోపణలను గతంలోనూ సిద్ధరామయ్య ఖండించారు. తమ కుటుంబానికి ఎవరు, ఎలా ఆ భూములను కేటాయించారో తనకు తెలియదని పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే ఈ కేటాయింపులు జరిగినట్టు చెప్పుకొచ్చారు. రింగ్ రోడ్డుకు సమీపంలో తన భార్య పేరిట 3.16 ఎకరాల భూమి ఉన్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. భూముల కేటాయింపుల్లో 50:50 ఫార్ములాను బీజేపీనే ప్రతిపాదించిందని పేర్కొన్నారు.

గవర్నర్‌ది సరైన నిర్ణయమే: ప్రహ్లాద్ జోషీ

సీఎం సిద్ధరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ సమర్థించారు. ఈ కుంభకోణంపై విచారణకు ఆదేశించి గవర్నర్ సరైన నిర్ణయం తీసుకున్నారని ఆయన మీడియా సమావేశంలో పేర్కొన్నారు. లోకాయుక్త లేదా స్థానిక అధికార యంత్రాంగం దీనిపై విచారణ జరుపుతుందని, దీనికి సిద్ధరామయ్య సహకరించాలని కోరారు. తనపై వచ్చిన ఆరోపణలకు నైతిక బాధ్యత వహిస్తూ సిద్ధరామయ్య రాజీనామా చేయాలంటూ బీజేపీ ఎంపీ, మాజీ సీఎం జగదీశ్ షెట్టర్, కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే డిమాండ్ చేశారు. విపక్ష జేడీ(ఎస్) కూడా సీఎం రాజీనామా చేయాలని కోరింది.

ఇది రాజకీయ ప్రేరేపితం

సీఎం సిద్ధరామయ్యపై విచారణకు గవర్నర్ ఆదేశించడాన్ని కర్ణాటక మంత్రివర్గం ఖండించింది. గెహ్లాట్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితమైనదని ఆరోపించింది. దీనిపై తాము న్యాయపోరాటం చేస్తామని తెలిపింది. పార్టీ కార్యకర్తలు మైసూరు, మండ్య, బెంగళూరులతో పాటు పలు ప్రాంతాల్లో నిరసనలు తెలిపారు. గవర్నర్‌ను వెంటనే తొలగించాలంటూ బెంగళూరులోని గాంధీనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలు, కర్ణాటక ప్రదేశ్ కురుబుర సంఘ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన జరిపారు. అనంతరం గవర్నర్ గెహ్లాట్ దిష్టిబొమ్మలను దగ్ధం చేశారు. మాండ్య, దావణగెరెలలో సైతం సిద్ధరామయ్యకు అనుకూలంగా ప్రదర్శనలు నిర్వహించారు.



ఏమిటీ స్కాం?

బీజేపీ నేతలు, హక్కుల కార్యకర్తల ఆరోపణల ప్రకారం.. మైసూరు శివారులోని కెసరె గ్రామంలో సిద్ధరామయ్య భార్య పార్వతమ్మకు 3 ఎకరాల 16 గుంటల భూమి ఉంది. అయితే, అవసరాల దృష్ట్యా ఆ భూమిని సేకరించిన ప్రభుత్వం.. దానికి బదులుగా నగరం లోపల అత్యంత ఖరీదైన ప్రాంతాలుగా చెప్పుకొనే విజయనగర్, దట్టగల్లీ, జేపీ నగర్, ఆర్టీ నగర్, హంచయా-సతాగల్లీలో సిద్ధరామయ్య కుటుంబానికి 38,283 చదరపు అడుగుల భూమిని కేటాయించింది. 50:50 నిష్పత్తిలో (పడావు పడ్డ ఒక ఎకరా తీసుకొంటే, అభివృద్ధి చేసిన అర్ధ ఎకరం ఇవ్వడం) ఈ కేటాయింపు జరిగింది. అయితే, కెసరెలోని భూములతో పోలిస్తే మార్కెట్ ధర అతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సిద్ధరామయ్య కుటుంబానికి ఆ భూములను కేటాయించాలని ఎవరు సిఫారసు చేశారని బీజేపీ నేత ఆర్ అశోక్ నిలదీశారు. క్యాబినెట్ అనుమతి లేకుండా భూములు కేటాయించే అధికారం ఎవరికి ఉంటుందని, ముఖ్యమంత్రికి తెలియకుండానే రూ. 4 వేల కోట్ల విలువజేసే ఇంత పెద్ద కుంభకోణం జరిగిందా? అని ఆయన ప్రశ్నించారు. ముడా భూకుంభకోణంలో సిద్ధరామయ్య కొడుకు యతీంద్ర పాత్ర ఉన్నదని, ఆయనే దీనికి అసలు సూత్రధారని బీజేపీ ఎమ్మెల్సీ హెచ్ విశ్వనాథ్ ఆరోపించారు. ఈ స్కామ్ మూలంగా వేల కోట్లు పక్కదారి పట్టాయని ముగ్గురు హక్కుల కార్యకర్తలు ప్రదీప్ కుమార్, టీజే అబ్రహం, స్నేహమయి కృష్ణ.. లోకాయుక్త పోలీసులు సహా గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే గవర్నర్ సీఎంపై విచారణకు అనుమతినిచ్చారు.

పిల్లల పెంపకానికి 'ప్రొఫెషనల్ పేరెంట్స్'

- చైనా సంపన్నుల్లో కొత్త పోకడ

బీజింగ్: చైనాలోని సంపన్నుల్లో కొత్త పోకడ పుట్టుకొచ్చింది. కెరీర్‌లో ఎదుగుదలపై దృష్టి పెట్టే సంపన్నులైన తల్లిదండ్రులు తమ పిల్లల పెంపకం బాధ్యతలను 'ప్రొఫెషనల్ పేరెంట్స్'కు అప్పగిస్తున్నారు. తల్లిదండ్రులుగా తాము చేయాల్సిన పనులను ఈ నిపుణుల చేత చేయిస్తున్నారు. సైకాలజీలో పీహెచ్‌డీ చేస్తున్న విద్యార్థి ఒకరు వందలాది మంది ప్రొఫెషనల్ పిల్లల పెంపకందారులను ఇంటర్వ్యూ చేసి ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేస్తున్నవారిలో అత్యధికులు హార్వర్డ్, కేంబ్రిడ్జ్, త్సింఘువా, పెకింగ్ వంటి ప్రముఖ విశ్వవిద్యాలయాల నుంచి డిగ్రీలు పొందినవారేనని చెప్పారు. వీరిలో కొందరు బాలల మానసిక శాస్త్రంలో ప్రత్యేక నైపుణ్యం సాధించినవారని, మరి కొందరు మాస్టర్స్ డిగ్రీ, అంతకన్నా ఎక్కువ విద్యార్హతలు కలవారని తెలిపారు. ప్రొఫెషనల్ చైల్డ్ కంపేనియన్‌గా నియమితులైనవారు తమ యజమాని పిల్లలను బడికి తీసుకెళ్లడం, అవసరమైనపుడు దవాఖానకు తీసుకెళ్లడం, హోమ్‌వర్క్ చేయించడం, ఆడించడం వంటి పనులు చేస్తారు. వీరికి నెలకు జీతం రూ.1,17,000 నుంచి రూ.3,43,000 వరకు ఉంటుంది. 'ప్రొఫెషనల్ అమ్మ'లకు డిమాండ్ బాగా ఉంది. ప్రొఫెషనల్ నాన్నలకు డిమాండ్ తక్కువగా ఉంది. మగ పిల్లల కోసమే ప్రొఫెషనల్ నాన్నలను నియమించుకుంటున్నారు.

బండరాయిని ఢీకొన్న సబర్మతి ఎక్స్‌ప్రెస్

పట్టాలు తప్పిన 22 బోగీలు

కాన్పూర్: ఉత్తరప్రదేశ్‌లో సబర్మతి ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. శనివారం తెల్లవారుజామున 2:30 గంటలకు కాన్పూర్ - భీమ్‌సేన్ రైల్వే స్టేషన్ల మధ్య 22 బోగీలు పట్టాలు తప్పి పక్కకు జరిగాయి. రైలు వారణాసి నుంచి అహ్మదాబాద్ వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. అదృష్టవశాత్తూ ఎవరికీ గాయాలు కాలేదు. ప్రమాదం కారణంగా ఏడు రైళ్లు రద్దు కాగా, మూడు రైళ్లను దారి మళ్లించారు. పట్టాలపై ఉన్న భారీ బండరాయిని రైలు ఇంజిన్ ముందు భాగం(కాటిల్ గార్డ్) ఢీకొనడంతో ఘటన జరిగిందని రైల్వే అధికారులు తెలిపారు. కాటిల్ గార్డ్ దెబ్బతిన్నదని చెప్పారు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

9 ఏండ్లలో మూడోసారి కూలిన వంతెన

పాట్నా, ఆగస్టు 17: బీహార్‌లో వంతెనలు కూలిపోతున్న సంఘటనలు ఆగటం లేదు. తాజాగా సుల్తాన్ గంజ్-అగువాని ఘాట్ వంతెనపై నిర్మిస్తున్న నిర్మాణంలోని కొంత భాగం కూలిపోయి, గంగా నదిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఎవరూ గాయపడలేదు. ఈ వంతెన తొమ్మిదేండ్ల నుంచి నిర్మాణంలో ఉంది. దీనిలోని చాలా భాగాలు ఇప్పటికే రెండుసార్లు కూలిపోయాయి. దీనిని నిర్మిస్తున్న ఎస్‌కే సింగ్లా కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఈ సంఘటనపై స్పందించలేదు. ఈ వంతెన చాలా ముఖ్యమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు అని ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చెప్తూ ఉంటారు. దీని నిర్మాణం పూర్తయితే భాగల్పూర్ నుంచి ఖగారియా గుండా జార్ఖండ్‌కు ప్రయాణించడం సులువవుతుంది.

అమెరికాలో కాల్పులు.. భారత సంతతి వ్యక్తి మృతి

వాషింగ్టన్, ఆగస్టు 17: అమెరికాలో దోపిడీ, తుపాకీ కాల్పుల ఘటనలకు భారత సంతతి పౌరులు బలవుతున్నారు. ఉత్తర కరోలినాలో ఓ టొబాకో స్టోర్‌ను నడుపుతున్న మైనాక్ పటేల్ (36)పై దొంగతనానికి వచ్చిన దుండగుడు విచక్షణారహితంగా కాల్పులకు తెగబడ్డాడు. కాల్పుల్లో మైనాక్ పటేల్ చనిపోయాడని పోలీసులు వెల్లడించారు. మైనాక్ పటేల్‌కు భార్య, 5 ఏండ్ల కూతురు ఉన్నారు. వందలాది మంది స్థానికులు టొబాకో స్టోర్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అతడి మృతికి నివాళి అర్పించారు. కాల్పుల ఘటనలో నిందితుడైన బాలుడిని అదుపులోకి తీసుకున్నామని రోవాన్ కౌంటీ షెరీఫ్ తెలిపారు. దుండగుడు చోరీ కోసం వచ్చి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

లక్నో ఎయిర్‌పోర్ట్‌లో రేడియో ధార్మిక పదార్థం

క్యాన్సర్ మందుల్లోంచి లీకైన ఫ్లోరైన్

న్యూఢిల్లీ: లక్నోలోని చౌదరి చరణ్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రేడియో ధార్మిక పదార్థం కలకలం రేపింది. శనివారం మధ్యాహ్నం టెర్మినల్ 3లోని కార్గో ప్రాంతంలో పార్సిళ్లను తనిఖీ చేస్తున్న సమయంలో రేడియో ధార్మిక పదార్థాన్ని గుర్తించిన అలారం ఒక్కసారిగా మోగింది. దీంతో ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఓ క్యాన్సర్ రోగికి సంబంధించిన మందులను స్కాన్ చేస్తున్న సమయంలో అందులోని ఫ్లోరైన్ లీకైంది. ఇది రేడియో ధార్మిక పదార్థం కావడంతో అలారం ఒక్కసారిగా మోగి గందరగోళం తలెత్తింది.

ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్తతలు

మొబైల్ ఇంటర్నెట్ సేవల నిలిపివేత

జైపూర్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని సహ విద్యార్థి శుక్రవారం కత్తితో దారుణంగా పొడిచాడు. గాయపడిన విద్యార్థిని దవాఖానకు తరలించి, చికిత్స చేయిస్తున్నారు. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి ఇంటిని బుల్డోజర్‌తో కూల్చేశారు. ఈ సంఘటన గురించి బయటకు పొక్కడంతో మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగాయి. హిందూ సంస్థలు నిరసన ప్రదర్శనలు చేశాయి. ఉదయ్‌పూర్ జిల్లా కలెక్టర్ అరవింద్ పోస్వాల్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను తదుపరి ఆదేశాలు వెలువడే వరకు మూసివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సీఎం భజన్‌లాల్ శర్మ ఆదేశాల మేరకు, గాయపడిన విద్యార్థికి చికిత్స చేసేందుకు ముగ్గురు వైద్యుల బృందం జైపూర్ నుంచి ఉదయ్‌పూర్ చేరుకుందని తెలిపారు. పలు ప్రాంతాల్లో మొబైల్ ఇంటర్నెట్ సేవలను శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి 24 గంటలపాటు నిలిపేయాలని డివిజనల్ కమిషనర్ రాజేంద్ర భట్ ఆదేశించారు.

స్తంభించిన వైద్య సేవలు

- కోల్‌కతా ఘటనకు నిరసనగా అన్ని రాష్ట్రాల్లో డాక్టర్ల ఆందోళనలు
- యూకే, బంగ్లాదేశ్‌ల్లోనూ ప్రదర్శనలు
- కేంద్రం ముందు ఐదు డిమాండ్లు
- కమిటీ వేస్తామన్న ప్రభుత్వం



ఢిల్లీలో వైద్యుల నిరసన

న్యూఢిల్లీ/కోల్‌కతా, ఆగస్టు 17: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై లైంగిక దాడి, హత్య ఘటనపై దేశవ్యాప్తంగా వైద్యులు, వైద్యసిబ్బంది ఆందోళనకు దిగారు. శనివారం 24 గంటల సమ్మె నిర్వహించారు. దీంతో వైద్యసేవలు స్తంభించిపోయాయి. అన్ని రాష్ట్రాల్లోనూ వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. వైద్యుల సమ్మెతో అనేక దవాఖానాల్లో ఓపీ, డిస్పెన్సరీ వంటి వైద్యసేవలు నిలిచిపోయాయి. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఐసీయూ, ఎమర్జెన్సీ విభాగం, ఆపరేషన్ థియేటర్ల కార్యకలాపాలను మాత్రం వైద్యులు కొనసాగించారు. కోల్‌కతా ఘటనను సుమోటోగా తీసుకొని విచారణ జరపాలని కోరుతూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌కు మూడు లేఖలు అందాయి. కాగా, గుజరాత్‌లోని అమ్రేలీలో వైద్యుల నిరసన కార్యక్రమంలో తన లైసెన్స్డ్ తుపాకీని ప్రదర్శించారనే ఆరోపణలతో జీజే జజీరా అనే వైద్యుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యూకే, బంగ్లాలోనూ నిరసనలు

కోల్‌కతా ఘటనకు వ్యతిరేకంగా విదేశాల్లోనూ నిరసనలు జరిగాయి. యూకేలో భారతీయ వైద్యులు, వైద్య విద్యార్థులు లండన్‌లోని ఇండియా హౌస్ ముందు శాంతియుత నిరసన తెలిపారు. బంగ్లాదేశ్‌లోని ఢాకా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు నిరసన తెలిపారు.

నిరసనలు విరమించండి: కేంద్రం

వైద్యుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర వైద్య శాఖ స్పందించింది. శనివారం ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర వైద్య శాఖ అధికారులతో సమావేశమయ్యారు. కేంద్రం ముందు వైద్యుల సంఘాలు ఐదు డిమాండ్లను పెట్టాయి. ఈ డిమాండ్లపై ఒక కమిటీని వేసి సంప్రదింపులు జరుపుతామని కేంద్ర వైద్య శాఖ తెలిపింది. నిరసనలు విరమించుకోవాలని కోరింది.

నిరసనల వేళ వైద్యుల బదిలీలు

జూనియర్ డాక్టర్ హత్య ఘటనపై పశ్చిమ బెంగాల్ వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతున్న వేళ 42 మంది వైద్యులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం వివాదంగా మారింది. ఆందోళనను అణిచివేసేందుకే నిరసనల్లో చురుగ్గా పాల్గొంటున్న వైద్యులను బదిలీ చేశారని వైద్య సంఘాలు ఆరోపించాయి.



కేంద్రంలో కీలక పోస్టులు.. ప్రైవేట్ ఉద్యోగులకు ఆహ్వానం!

న్యూఢిల్లీ, ఆగస్టు 17: కేంద్ర ఆర్థిక శాఖ, హోం, వ్యవసాయం, విద్య..ఇలా వివిధ శాఖల్లో పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఉద్యోగ ప్రకటన జారీ చేసింది. ప్రైవేట్ రంగ ఉద్యోగుల నుంచి కూడా వీటికి దరఖాస్తులు స్వీకరించబోతున్నది. సెక్రెటరీ, డిప్యూటీ సెక్రెటరీ, డైరెక్టర్ స్థాయిలోని 45 లేటరల్ ఎంట్రీ పోస్టుల భర్తీకి సంబంధించి యూపీఎస్సీ దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదల చేసింది. వీటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు అర్హులు కాదని పేర్కొన్నది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, వర్సిటీలు, పీఎస్‌యూలు, స్వతంత్ర సంస్థలు, ప్రైవేట్ రంగంలో పనిచేస్తున్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపింది. 10 జాయింట్ సెక్రెటరీ, 35 డైరెక్టర్, డిప్యూటీ సెక్రెటరీ స్థాయి పోస్టుల దరఖాస్తుకు చివరి తేదీ సెప్టెంబర్ 17. సంబంధిత రంగంలో కనీసం 10, 15 ఏండ్ల అనుభవం ఉండాలని నోటిఫికేషన్ పేర్కొన్నది. డిప్యూటేషన్, కాంట్రాక్ట్ విధానంలో కనీసం 3 ఏండ్లు, గరిష్ఠంగా 5 ఏండ్లు పని చేయాల్సి ఉంటుందని తెలిపింది.

ప్రపంచ ఆర్థికానికి 'మంకీ' భయం

- అంతకంతకూ పెరుగుతున్న మంకీపాక్స్ కేసులు
- గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటన
- కొవిడ్‌నాటి దుస్థితి దాపురించవచ్చంటున్న నిపుణులు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)



హైదరాబాద్(నమస్తే తెలంగాణ): కరోనాతో కకావికలమైన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఇప్పటికీ సాధారణ స్థితికి రాలేదు. ఇలాంటి సమయంలో 'మంకీపాక్స్' రూపంలో మరో వైరస్ కలకలం సృష్టిస్తున్నది. 1958లో గుర్తించిన ఈ వైరస్ కొత్తది కానప్పటికీ, మ్యుటేషన్‌తో కొత్త శక్తిని సంతరించుకోవడం భయపెడుతున్నది.

ఎందుకంత భయం?

ఆఫ్రికాలో మాత్రమే కనిపించే మంకీపాక్స్ వైరస్ స్వీడన్, పాకిస్థాన్‌కూ విస్తరించింది. గతంలో నమోదైన మంకీపాక్స్ కేసులు పశ్చిమ ఆఫ్రికా క్లాడ్ వేరియంట్ (క్లాడ్-2) రకానికి చెందినవి. తీవ్రత తక్కువ ఉండేది. ఇప్పుడు నమోదవుతున్న కేసులు క్లాడ్-1 (కాంగోబేసిన్ క్లాడ్) రకానికి చెందినవిగా శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ వైరస్ సోకితే మరణాల రేటు 10% వరకూ ఉండొచ్చు.

ఆర్థిక వ్యవస్థపై ప్రభావం

కరోనా విలయం ముసుపు 2020లో గ్లోబల్ జీడీపీ వృద్ధిరేటు 2.5% మేర పెరుగుతుందని ప్రపంచబ్యాంకు 2019లో అంచనా వేసింది. అయితే, కొవిడ్ కేసులు, లాక్‌డౌన్‌తో జీడీపీ వృద్ధిరేటు 3.1 శాతం మేర పడిపోయింది. ఇప్పుడూ ఎంపాక్స్ కేసులతో అదే పరిస్థితి రావొచ్చని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరోనాకు వ్యాక్సిన్ అందుబాటులోకి రావడానికి సమయం పట్టినట్లే, మంకీపాక్స్ టీకాలకు సమయం పట్టొచ్చని గుర్తు చేస్తున్నారు.

ఆర్థికవేత్తల భయానికి కారణాలు

- ఇతర దేశాలకు వ్యాపిస్తున్న వైరస్
- మ్యుటేషన్‌తో పెరుగుతున్న వ్యాధి తీవ్రత
- వ్యాధిని గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీగా డబ్ల్యూహెచ్‌వో ప్రకటించింది.
- టీకా ఫార్ములా అందుబాటులో ఉన్నప్పటికీ, అనుమతినివ్వని మెజారిటీ దేశాలు


భారత్‌లో ముందస్తు చర్యలు

మంకీపాక్స్ వ్యాధి వ్యాప్తిని కట్టడి చేసి, నిరోధించేందుకు ముందు జాగ్రత్త చర్యలను చేపట్టినట్టు కేంద్రం పేర్కొన్నది. దేశంలో కొత్తగా మంకీపాక్స్ కేసులు నమోదు కాలేదని ఆరోగ్య శాఖ తెలిపింది. ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా నేతృత్వంలో శనివారం ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది.



స్కీ-బేస్ జంపింగ్‌లో గిన్నిస్ రికార్డు

లండన్: బ్రిటీష్ సాహసికుడొకరు స్కీ-బేస్ జంపింగ్‌లో కొత్త రికార్డును నెలకొల్పాడు. 34 ఏండ్ల జాషువా బ్రెగ్‌మెన్ 18,753 అడుగుల ఎత్తు నుంచి ప్యారాచూట్ సహాయంతో దూకి సురక్షితంగా హిమాలయాలపై దిగి గిన్నిస్ రికార్డు సాధించాడు. అంతకుముందు ఫ్రెంచ్ వ్యక్తి 2019లో సాధించిన 14,301 అడుగుల రికార్డును జాషువా అధిగమించాడు. స్కీయింగ్, బేస్ జంపింగ్ క్రీడల సమ్మిళితమే ఈ స్కీ-బేస్ జంపింగ్. రెండు పొడవైన ప్లాస్టిక్ కర్రలను రెండు బూట్లకు బిగించి మంచులో వేగంగా కదలడమే స్కీయింగ్. ఎత్తయిన ప్రదేశాల నుంచి ప్యారాచూట్ సహాయంతో కిందకు దూకడాన్ని బేస్ జంపింగ్‌గా పేర్కొంటారు.



రెండు దశల్లో వేగంగా వృద్ధాప్యం

వాషింగ్టన్: వృద్ధాప్యం అనేది కాలక్రమంగా జరిగే ప్రక్రియ అని సంప్రదాయ సిద్ధాంతాలు చెప్తున్న మాట. కానీ అది నిజం కాదని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు తేల్చారు. అణువుల కూర్పు పరంగా మనిషి శరీరం 44, 60 ఏండ్ల వయసులో తీవ్ర మార్పులకు లోనవుతుందని గుర్తించారు. దేహంలో అణువులు, సూక్ష్మజీవులు పెరగడం లేదా తగ్గడం లేదా తీవ్రమైన మార్పులకు లోనవడం లాంటి అంశాలు శరీరంలో మార్పులకు దోహదం చేస్తాయన్నారు. అందుకే ఈ రెండు దశల్లో కొంత మందికి అకస్మాత్తుగా వృద్ధులమైపోయినట్టు లేదా ఆరోగ్యం క్షీణించినట్టు అనిపిస్తుందని వివరించారు.



ప్రపంచంలో తొలి 'పోర్టబుల్ హాస్పిటల్'

న్యూఢిల్లీ, ఆగస్టు 17: భారత ఆర్మీ, వాయుసేన సంయుక్తంగా ఒక ప్రతిష్ఠాత్మక ఆపరేషన్ చేపట్టాయి. ప్రపంచంలోనే మొదటి 'పోర్టబుల్ హాస్పిటల్'ను విజయవంతంగా ఒక మారుమూల ప్రాంతానికి డెలివరీ చేశాయి. సొంతంగా తయారు చేసిన ఈ పోర్టబుల్ హాస్పిటల్‌ను 15 వేల అడుగుల ఎత్తు నుంచి ఐఏఎఫ్‌కు చెందిన రవాణా విమానం ద్వారా అనుకొన్న లక్షిత ప్రాంతంలో ప్యారాచూట్ సాయంతో జారవిడిచినట్టు రక్షణ శాఖ వర్గాలు శనివారం వెల్లడించాయి. మారుమూల ప్రాంతాల్లో ఆపత్కాల పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడే లక్ష్యంలో భాగంగా నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో ట్రామా కేర్ సదుపాయాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ఆరోగ్య మైత్రి హెల్త్ క్యూబ్‌లను తరలించారు. ప్రాజెక్ట్ 'బీహెచ్‌ఐఎస్‌హెచ్‌ఎం'లో భాగంగా ఈ క్యూబ్‌లను దేశీయంగా అభివృద్ధి చేశారు. ఈ పోర్టబుల్ హాస్పిటల్‌ను తరలించేందుకు ఐఏఎఫ్ ఆధునాతన వ్యూహాత్మక సీ-130జే సూపర్ హెర్క్యులస్ రవాణా విమానాన్ని వినియోగించింది. ఈ ఆపరేషన్‌లో ఆర్మీకి చెందిన పారా బ్రిగేడ్ కీలక పాత్ర పోషించిందని రక్షణ శాఖ తెలిపింది.

పీఏసీ చైర్మన్‌గా ఎంపీ వేణుగోపాల్

మూడు పార్లమెంటరీ కమిటీల నియామకం

న్యూఢిల్లీ, ఆగస్టు 17: పార్లమెంటు ప్రజాపద్దుల కమిటీ(పీఏసీ) చైర్మన్‌గా కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ నియమితులయ్యారు. అంచనాల కమిటీ చైర్మన్‌గా బీజేపీ ఎంపీ సంజయ్ జైశ్వాల్, పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్‌గా బైజయంత్ పాండాలు నియమితులైనట్టు లోక్‌సభ సచివాలయం ఒక బులెటిన్ జారీ చేసింది. ఈ మూడు కమిటీలతో పాటు పలు శాఖలు, విభాగాలకు సైతం స్టాండింగ్ కమిటీలు ఏర్పాటయ్యాయి. ఓబీసీ సంక్షేమ కమిటీకి బీజేపీ ఎంపీ గణేష్ సింగ్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కమిటీకి అదే పార్టీకి చెందిన ఎంపీ ఫగ్గన్ సింగ్ కులాస్తే నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీల్లో సభ్యులుగా లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ఉంటారు.



నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

NAMASTE TELANGANA

ఆదివారం SUNDAY 18.8.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 8+8+4+32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 8+8+4+32 Pages SUNDAY supplement | సంపుటి (Volume): 14 ॥ సంచిక (Issue): 74 ॥ వెల (Price) రూ.8.00



మంచిర్యాల జిల్లా కవ్వాల్‌లో పురుగుల మందుతాగేందుకు యత్నిస్తున్న గొల్ల లచ్చన్న వద్ద డబ్బా లాక్కుంటున్న మరోరైతు బుచ్చన్న

మాఫీ మోసంపై దద్దరిల్లిన రాష్ట్రం

నిజామాబాద్ జిల్లా వేల్పూర్‌లో నిర్వహించిన ధర్నాలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్లకార్డు ప్రదర్శిస్తున్న రైతు



రోడ్డెక్కిన రైతన్న కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పూర్తిచేశామని చెప్తున్నా రాష్ట్రంలో వేలాదిమంది రైతులు తమకు రుణాలు మాఫీ కాలేదంటూ రోడ్డెక్కారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట కెనరా బ్యాంకు ఎదుట రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు



సీఎం దిష్టిబొమ్మకు శవయాత్ర రుణమాఫీ విషయంలో ప్రభుత్వ మోసాన్ని నిరసిస్తూ ఆదిలాబాద్ జిల్లా తలమడుగులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహిస్తున్న రైతులు

తీరని రుణం.. రైతుల రణం

ఒట్టుతీసి గట్టుమీద పెట్టి.. రుణమాఫీని ఎగ్గొట్టి..

ఆదిలాబాద్ నుంచి జోగులాంబ జిల్లా దాకా సంగారెడ్డి నుంచి కొత్తగూడెం జిల్లా దాకా రైతన్నల నిరసనలతో తెలంగాణ దద్దరిల్లింది. రేవంత్ రుణ మోసంపై రణభేరి మోగించింది. పోయిన ప్రతి జిల్లాలో అక్కడి గుడిలోని దేవుడిపై ఒట్టేసి మరీ చెప్పిన మాఫీని గట్టున పెట్టిన ముఖ్యమంత్రి తీరుపై రైతులోకం భగ్గుమన్నది. ఒకే దఫాలో చేస్తానన్న రుణమాఫీని మూడు దశల కిందికి మార్చినా, ఇవాళ కాకపోతే రేపైనా అవుతుందని పంద్రాగస్టు దాకా ఓపికగా వేచిచూసిన అన్నదాతలు.. ఇది మాఫీ కాదు, మోసమని గుర్తించి ఒక్కసారిగా రోడ్డెక్కారు. ఎక్కడికక్కడ, ఎవరికి వారుగా ముందుకు కదిలారు. శవయాత్రలు, దిష్టిబొమ్మల దహనాలు, ధర్నాలు, అధికారుల నిలదీతలు, ఆత్మహత్యాయత్నాలు, రాస్తారోకోలు ఇలా ఎవరికి తోచిన రూపంలో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేవంత్ సర్కారు చేసిన పాపం చివరికి బ్యాంకుల మెడకు చుట్టుకున్నది. అనేక చోట్ల రైతులు బ్యాంకుల్లోకి చొరబడి మాకెందుకు రుణమాఫీ కాలేదంటూ బ్యాంకర్లను నిలదీశారు. అసలేం జరిగిందో, ఏ ప్రాతిపదికన మాఫీ చేశారో తెలియని బ్యాంకర్లు జవాబు చెప్పలేక, రైతుల్ని ఏమీ అనలేక ఆపసోపాలు పడ్డారు. అనేక చోట్ల రైతులు గతంలో కేసీఆర్ ప్రభుత్వం చేసిన రుణమాఫీతో ప్రస్తుత పరిస్థితిని పోల్చి మాట్లాడుకున్నారు. ఎవరు, ఏ రైతు, ఎప్పుడు, ఎంత పంట రుణం తీసుకున్నాడన్న వివరాలన్నీ బ్యాంకుల వద్ద సిద్ధంగా ఉండగా రేవంత్ ప్రభుత్వం ఇప్పటికీ సమాచారం సేకరిస్తున్నాం అంటూ సాకులు చెప్తున్నదని వారు ధ్వజమెత్తారు. ఒట్టుదీసి గట్టుమీద పెట్టి మాఫీని ఎగ్గొట్టడమే సీఎం రేవంత్ పని అంటూ తిట్టుకోవడం వినిపించింది.

- పంద్రాగస్టులోపు పూర్తికాని రుణమాఫీ.. అప్పులున్న రైతుల సంఖ్య 70 లక్షలు
- రుణమాఫీ అయింది 22 లక్షల మందికే.. 2 లక్షలకుపైగా ఉంటే మొండిచెయ్యే
- అర్హులని సర్కారే తేల్చిన 32.5 లక్షల మందిలోనూ 10 లక్షల మంది రైతులకు కోత
- మోదీ సర్కారు తెచ్చిన పీఎం కిసాన్ నిబంధనలను వాడుకున్న రేవంత్ ప్రభుత్వం

2014లో కేసీఆర్ సర్కారు చేసిన లక్ష రుణమాఫీ కంటే 2024లో రేవంత్ సర్కారు చేసిన 2 లక్షల రుణమాఫీలో రైతుల సంఖ్య తగ్గింది.. మాఫీ మొత్తమూ తగ్గింది. వివరాలు

జిల్లా	2014	2024	తగ్గుదల
నల్లగొండ	4,95,000	3,32,490	1,62,510
కరీంనగర్	3,77,984	2,60,651	1,17,333
నిజామాబాద్	3,79,520	1,76,056	2,03,464
ఖమ్మం	3,58,026	1,72,433	1,85,593
మహబూబ్‌నగర్	6,02,085	3,38,548	2,63,537
మెదక్	4,17,591	2,85,493	1,32,098
వరంగల్	4,13,474	2,64,781	1,48,693
ఆదిలాబాద్	3,16,195	2,28,085	8,8110
రంగారెడ్డి	2,10,252	1,79,484	30,768
మొత్తం	35.67 లక్షలు	22.38 లక్షలు	13.32 లక్షలు

2014 కంటే 2024 నాటికి

- తెలంగాణలో రైతుల సంఖ్య భారీగా (45లక్షల నుంచి 70 లక్షలకు) పెరిగింది. సాగు విస్తీర్ణం (1.31 కోట్ల ఎకరాల నుంచి 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది.
- రైతులు తీసుకున్న పంట రుణాల మొత్తం 33 వేల కోట్ల నుంచి 65 వేల కోట్ల రూపాయలకు పెరిగింది.
- అప్పుడు లక్ష రుణమాఫీకే 36.68 లక్షల మంది అర్హులయ్యారు. రూ.19,198 కోట్లు ఖర్చు అయ్యాయి.

మరిప్పుడు 2 లక్షల రుణమాఫీకి అంతకంటే తక్కువ మందే ఎలా అర్హులవుతారు? అంతకంటే తక్కువ మొత్తం ఎలా సరిపోతుంది?

రైతుకు అండగా గులాబీ దళం



- ప్రతి గ్రామంలో మాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా ఎల్లుండి నుంచి వారం అదే పనిలో › 4
- కలెక్టర్, మంత్రి, సీఎం, గవర్నర్‌కు ఆ వివరాలు అందిస్తాం
- అప్పటికీ సర్కారు స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ
- మాఫీ పూర్తైతే కలెక్టరేట్‌లో కౌంటర్లెందుకు?: కేటీఆర్
- బీజేపీ జెండాతోనే చచ్చిపోతానని మోదీతో అన్న సీఎం
- దీనిపై రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలని డిమాండ్

గద్దె దిగాల్సింది రేవంతే

› 4



- మాఫీ చేయడంలో పూర్తిగా విఫలం
- రైతులను మోసం చేసి దైవ ద్రోహం
- మరో రైతాంగ ఉద్యమానికి శ్రీకారం
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఉద్ఘాటన

లెక్క తప్పిందిలా..

రూ.49,500 కోట్లు
ఎస్‌ఎల్‌బీసీ లెక్క ప్రకారం మాఫీకి అర్హులైన రైతుల రుణాల మొత్తం

↓

రూ.40,000 కోట్లు
కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తొలుత అవసరం అన్న నిధులు

↓

రూ.31,000 కోట్లు
ఆ తర్వాత మాఫీ కోసం క్యాబినెట్‌లో ఫైనల్ చేసిన నిధులు

↓

రూ.26,000 కోట్లు
రుణమాఫీకి బడ్జెట్‌లో పెట్టిన నిధులు

↓

రూ.17,933 కోట్లు
చివరికి రుణమాఫీకి వాడిన నిధులు

రుణమాఫీ సిత్రాలు

కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పరిధిలోని 130 సంఘాలకు చెందిన 96,338 మంది రైతులకు రుణమాఫీ కాగా ఇంకా 36,543 మందికి రూ.421.70 కోట్ల మాఫీ కావాల్సి ఉన్నది.

కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మొలంగూర్ ఇండియన్ బ్యాంకులో 1,400 మంది రైతులకు 311 మందికే రుణ మాఫీ అయింది.

జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట కెనరా బ్యాంకులో 2వేల మంది రైతులకు 1,021 మందికే మాఫీ అయింది.

కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట ఇండియన్ బ్యాంకులో 1,280 మంది రైతులకు 432 మందికే రుణమాఫీ అయింది.

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం పైడి మడుగు ఇండియన్ బ్యాంకులో 1,308 మంది రైతులకు 173 మందికే రుణమాఫీ జరిగింది.

దుండిగల్ బ్యాంక్‌లో 632 మందికి కేవలం 14 మంది రైతులకు చెందిన రూ.4.30 లక్షలనే ప్రభుత్వం మాఫీ చేసింది.

2 లక్షల పైబాకీ చెల్లిస్తేనే రుణమాఫీ

ఎట్టి పరిస్థితుల్లోనూ మోసం చేయం: మంత్రి తుమ్మల › 4

హరీశ్ ఆఫీస్‌పై కాంగ్రెస్ దౌర్జన్యం





సిద్దిపేటలో మాజీమంత్రి హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై దాడిని నిరసిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు

- అర్ధరాత్రి గూండాల అరాచకం.. ప్రజలు, అభిమానుల ఆగ్రహం
- దద్దరిల్లిన సిద్దిపేట.. దాడి వెనుక మైనంపల్లి హస్తం?
- ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా నిరసనలు, రాస్తారోకోలు

సిద్దిపేట, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి): రుణమాఫీ సవాళ్లపై వెలసిన ఫ్లెక్సీలు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య చిచ్చు రగిల్చాయి. ఫ్లెక్సీ వార్ చినికి చినికి గాలివానగా మారి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకునే వరకు వెళ్లింది. పోలీసుల ఉదాసీనతను ఆసరాగా చేసుకుని అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు రెచ్చిపోయారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై శుక్రవారం అర్ధరాత్రి దాడిచేశారు. క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకున్న ఇరువర్గాలు పోటాపోటీ ర్యాలీలు, నినాదాల మధ్య శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు సిద్దిపేటలో ఉద్రిక్తత నెలకొన్నది. రుణమాఫీ సవాళ్ల నేపథ్యంలో సిద్దిపేటలోని పలు కూడళ్లలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు రాజీనామా చేయాలని అనుచిత కామెంట్లతో › 5వ పేజీలో



దాడి బాధాకరం

హరీశ్‌రావు నివాసంపై దాడిని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ డాక్టర్ ఆండ్రూ ఫ్లెమింగ్ ఖండించారు. దాడిదృశ్యాలను చూస్తే చాలా బాధ కలిగిందని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. హరీశ్‌రావు అంటే ఎంతో గౌరవం అని, ఆయనతో అనేక అంశాలపై విస్తృతంగా చర్చలు జరిపానని వెల్లడించారు.



మంత్రి జూపల్లి కాన్వాయ్ అడ్డగింత

అడ్డుకున్న సరిత అనుచరులు

కాంగ్రెస్‌లో వర్గపోరు › 5


‘ముడా’ చిక్కుల్లో సిద్ధరామయ్య



- కర్ణాటక సీఎంను విచారించేందుకు గవర్నర్ అనుమతి
- సిద్ధరామయ్య భార్యకు విలాస ప్రాంతాల్లో స్థలాలు › 7
- తెర వెనుక చక్రం తిప్పిన కుమారుడు ఎమ్మెల్సీ యతీంద్ర
- బీజేపీ సహా హక్కుల కార్యకర్తల సంచలన ఆరోపణలు
- ‘ముడా’లో రూ. 4 వేల కోట్ల మేర స్కామ్ అంటూ ఫైర్
- రాజీనామా చేసేంత తప్పు తానేం చేయలేదన్న కర్ణాటక సీఎం



నార్నే నితిన్ హీరోగా నటించిన 'ఆయ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంజి కే మణిపుత్ర దర్శకత్వంలో బన్నీ వాస్ నిర్మించారు. శనివారం అగ్ర హీరో ఎన్టీఆర్‌ను చిత్ర యూనిట్ సభ్యులు కలుసుకున్నారు. బాక్సాఫీస్ వద్ద గట్టిపోటీ ఉన్నా ఈ సినిమా అద్భుత విజయం సాధించిందని, వినోదం, సందేశం కలబోసిన మంచి కాన్సెప్ట్‌తో రూపొందించారని చిత్ర బృందాన్ని ఎన్టీఆర్ అభినందించారు.



ఇక మాస్‌సాంగ్స్ చేస్తాను



- 'మ్యూజిక్ డైరెక్టర్‌గా మంచి సక్సెస్‌లు చూశాను. ఇదొక అద్భుతమైన ప్రయాణం. ప్రేక్షకుల హృదయాల్లో గుర్తుండిపోయే పాటలిచ్చాననే సంతృప్తి ఉంది' అన్నారు సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్. తెలుగు ఇండస్ట్రీలో మెలోడీ మ్యూజిక్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఆయనకు పేరుంది. మిక్కీ జే మేయర్ స్వరాలందించిన రవితేజ తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ సందర్భంగా మిక్కీ జే మేయర్ శనివారం పాత్రికేయులతో పంచుకున్న సంగతులు..
- సినిమాల విషయంలో నేను మాస్, క్లాస్ అని ఆలోచించను. కథ ప్రకారమే ట్యూన్స్ సిద్ధం చేస్తాను. 'మిస్టర్ బచ్చన్'లో మాస్‌సాంగ్స్ చేసే అవకాశం దక్కింది. మాస్ పాటలు చేయడం నాకేమీ కొత్తగా అనిపించలేదు. ఈ సినిమా పాటలు ఆడియన్స్‌కు బాగా రీచ్ కావడం ఆనందంగా ఉంది.
- ఈ సినిమాలో హిందీ సాంగ్స్ ఎక్కువగా వినిపిస్తాయి. అది డైరెక్టర్ హరీశ్ శంకర్ ఐడియానే. ఆయన లెజెండరీ సింగర్ కిశోర్‌కుమార్‌గారి అభిమాని. నేను కూడా ఆయన పాటలు విని పెరిగాను. అయితే ఆ పాటలకు కొన్ని కొత్త బిట్స్ యాడ్ చేశాం.
- నాలుగు ట్యూన్స్ ఒక్కవారంలోనే పూర్తి చేశా. హరీశ్‌శంకర్ మ్యూజిక్ సిట్టింగ్స్ కోసం అమెరికా సియాటిల్ వచ్చారు. హరీశ్ శంకర్ మ్యూజిక్ సెన్స్ అద్భుతం. తనకు ఎలాంటి పాటలు కావాలనే విషయంలో చాలా స్పష్టతతో ఉన్నారు. సంగీత పరిజ్ఞానం కలిగిన దర్శకులతో పనిచేయడం వల్ల సాంగ్ కంపోజింగ్ మరింత సులభం అవుతుంది.
- స్వరకర్తగా నా ప్రయాణం పట్ల హ్యాపీగా ఉన్నా. కెరీర్ ఆరంభించినప్పుడు తెలుగు భాషపై అంతగా పట్టులేదు. కానీ మన ఇండస్ట్రీ చాలా గొప్పది. న్యూటాలెంట్‌ను ఎప్పుడూ ఎంకరేజ్ చేస్తుంటుంది. నేను సాధారణంగా మెలోడిని బాగా ఎంజాయ్ చేస్తాను. అయితే 'మిస్టర్ బచ్చన్'తో నా కెరీర్‌లో కొత్త అధ్యాయం మొదలైంది. ఇక ముందు మరిన్ని మాస్‌సాంగ్స్ చేయాలనుకుంటున్నా.



ప్రభాస్ చారిత్రక చిత్రం

'కల్కి 2898 ఏడీ' చిత్రంతో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు హీరో ప్రభాస్. అదే ఉత్సాహంతో ఆయన వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇమాన్వి కథానాయికగా పరిచయమవుతున్నది. 1940 నేపథ్యంలో నడిచే ఈ కథలో ప్రభాస్ వారియర్ పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్నారు. భారీ వ్యయంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుధీప్ చటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ-మోనిక, వీఎఫ్‌ఎక్స్: కమల్ కన్నన్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

ధగధగలాడుతున్న బంగారు నిధి

పవన్‌కల్యాణ్ 'హరిహరవీర మల్లు' సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల 14 నుంచి మొదలైన విషయం తెలిసిందే. జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఏ.దయాకరరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఎం.రత్నం సమర్పకుడు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన యుద్ధ సన్నివేశాలను దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. ఇదిలావుంటే.. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నిధి అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆమె పాత్రకు సంబందించిన ప్రత్యేక పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో నిధి బంగారు చీరలో, ఒంటినిండా నగలతో మెరిసిపోతూ కనిపిస్తున్నది. పేదలకోసం రాజులను కొల్లగొట్టే రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాణం: మెగా సూర్య మూవీస్.




కొత్త లీడర్ వస్తున్నాడు

'గాయ్స్.. థిస్ ఈజ్ న్యూ ఎసైన్మెంట్.. మిమ్మల్ని లీడ్ చేయబోయేది ఒక కొత్త లీడర్.. 68 సక్సెస్‌ఫుల్ ఇంటర్నేషనల్ ఆపరేషన్స్.. హోస్టేజ్ నెగోషియేటర్. ఫీల్డ్ ఏజెంట్.. ఏ స్పై..'.ఈ వాయిస్ ఓవర్‌తో తమిళ అగ్రహీరో విజయ్ 'GOAT' (ది గ్రేటస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) చిత్రం ట్రైలర్ మొదలైంది. శనివారం మేకర్స్ ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగింది. దర్శకుడు వెంకట్‌ప్రభు పవర్‌ప్యాక్ట్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను మలిచినట్టు ట్రైలర్ చెబుతున్నది. ట్రైలర్‌లో విజయ్ విభిన్నమైన రూపాల్లో కనిపిస్తున్నారు. విజయ్, మీనాక్షి చౌదరిల బ్యూటిఫుల్ కెమిస్ట్రీ కూడా ఈ ట్రైలర్‌లో చూడొచ్చు. ప్రశాంత్, ప్రభుదేవ, మోహన్, జయరామ్, స్నేహ, లైలా, యోగిబాబు, ప్రేమి అమరన్ ప్రధాన పాత్రధారులుగా కనిపిస్తున్నారు. సిద్ధార్థ్ నుని కెమెరా, యువన్‌శంకర్ రాజా బీజీఎం అభినందనీయంగా ఉంది. వచ్చేనెల 5న సినిమా విడుదల కానున్న విషయం తెలిసిందే. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ ప్రై.లిమిటెడ్ పతాకంపై రూపొందుతోన్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కల్పాతి అఘోరమ్, కల్పాతి ఎస్.గణేశ్, కల్పాతి ఎస్.సురేశ్ నిర్మాతలు.



సినిమా చూసి రివ్యూ రాస్తా!

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకుడు. డా|| మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మాతలు. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం అగ్ర నిర్మాత దిల్ రాజు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సినిమా కాన్సెప్ట్ బాగుందని, జర్నలిస్ట్ మిత్రులైన ప్రభు, రాంబాబు నిర్మాణ పర్యవేక్షణలో సినిమా తెరకెక్కడం ఆనందంగా ఉందని, ఈ సినిమా చూసి తాను రివ్యూ రాస్తానని అన్నారు. సినిమా చూసి సెన్సార్ వాళ్లు కూడా మెచ్చుకున్నారని చిత్ర నిర్మాణ బాధ్యతల్ని పర్యవేక్షిస్తున్న జర్నలిస్ట్ ప్రభు తెలిపారు. మంచి కాన్సెప్ట్‌తో తీసిన ఈ చిత్రం అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పేర్కొన్నారు.



సూపర్ నేచురల్ జటాధర

సుధీర్‌బాబు నటించనున్న తాజా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్ ఖరారు చేశారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు శివన్ నారంగ్, ప్రేరణా అరోరా, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. చేతిలో త్రిశూలంతో పవర్‌ఫుల్‌గా సుధీర్‌బాబు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సూపర్ నేచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లే కథాంశమిదని, ఈ కథకు 'జటాధర' టైటిల్ పర్‌ఫెక్ట్ యాప్ట్ అని చిత్ర దర్శకుడు వెంకట్ కల్యాణ్ తెలిపారు. ప్రీప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని, టాప్ టెక్నీషియన్స్ పని చేయనున్నారని, త్వరలో హైదరాబాద్‌లో షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు.

'చాంపియన్' మొదలైంది



రోషన్ కథానాయకుడిగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్' శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు నాగ్‌అశ్విన్ క్లాప్‌నిచ్చారు. ఈ సినిమాలో హీరో రోషన్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని, కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయని చిత్ర బృందం పేర్కొంది. ఈ సినిమా కోసం రోషన్ కంప్లీట్ మేకోవర్ అయ్యారని, ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.మది, ఆర్ట్: తోట తరణి, నిర్మాణ సంస్థలు: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం.

శివన్న బైలింగ్వల్



కన్నడ అగ్రనటుడు శివరాజ్‌కుమార్ నటిస్తున్న కన్నడ, తెలుగు బైలింగ్వల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం శనివారం లాంచనంగా మొదలైంది. శివరాజ్‌కుమార్ 131వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు కార్తీక్ అద్వైత్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, సుధీర్.పి నిర్మాతలు. ఇందులో శివరాజ్‌కుమార్ అత్యంత శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, హై బడ్జెట్‌తో తెరకెక్కనున్న యాక్షన్ థ్రిల్లర్‌కి టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారని, ఈ సినిమాకు సంబంధించిన మిగతా నటీనటుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.జె.శెట్టి, సంగీతం: సామ్ సిఎస్, సమర్పణ: పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రై.లిమిటెడ్, నిర్మాణం: భువనేశ్వరి పిక్చర్స్.

సందేశాత్మక కథతో 'అభినవ్'

స్వీయ దర్శకనిర్మాణంలో భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. గురువారం ఈ చిత్ర ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, మాదకద్రవ్యాల మాఫియాను అణిచివేయాలనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సీసీ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లలో శిక్షణ పొంది దేశ రక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నదే ఈ సినిమా ప్రధాన ఉద్దేశ్యమని దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్, గీతా గోవింద్, అభినవ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వందేమాతరం శ్రీనివాస్.





దడపుట్టించే డిమాంటీ కాలనీ

అరుల్‌నిధి, ప్రియ భవానీశంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్.జ్ఞానముత్తు దర్శకుడు. విజయసుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్‌కుమార్ నిర్మాతలు. ఈ నెల 15న తమిళంలో విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈసినిమా ఈ నెల 23న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తెలుగులో విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వస్తున్నదని, సినిమాకు కూడా అదే స్పందన వస్తుందని నమ్మకంతో ఉన్నామని మేకర్స్ తెలిపారు. ఆన్టి జాస్కెలైనెస్, సెరింగ్ డోర్జీ, అరుణ్ పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవింద్‌రాజన్, సరనో ఖాలిద్, అర్చన రవిచంద్రన్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: హరీశ్ కన్నన్, సంగీతం: సామ్ సీఎస్.



ఉత్కంఠభరితంగా పార్క్

థమన్‌కుమార్, శ్వేతా దొర్నే లీడ్‌రోల్స్‌లో ఈకే మురుగన్ దర్శకత్వంలో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'పార్క్'. తమిళంలో విడుదలై ప్రస్తుతం ప్రదర్శించబడుతున్న ఈ సినిమాను పి.శ్రీనివాస్ గౌడ్ తెలుగులో విడుదల చేయనున్నారు. మర్డర్ మిస్టరీ, పోలీస్ ఇన్వెస్టిగేషన్, హారర్ ఎలిమెంట్స్ నేపథ్యంలో సినిమా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుందని, ఈ సినిమాలోని టెర్రిఫిక్ విజువల్స్, బీజీఎం అన్నీ టాప్ క్లాస్‌లో ఉంటాయని మేకర్స్ చెబుతున్నారు. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమా ఫ్యామిలీ ఆడియన్స్‌కి కూడా నచ్చుతుందని, త్వరలో భారీ స్థాయిలో సినిమాను విడుదల చేస్తామని సహనిర్మాత పి.హేమంత్ తెలిపారు. బ్లాక్ పాన్డీ, క్రేన్ మనోహర్, రేఖ సురేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: పాండియన్ కుప్పన్, సంగీతం: హమరా సీవీ.

సుకుమార్ మాటలు ధైర్యాన్నిచ్చాయి!



'హ్యాపీ ఎండింగ్' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమయ్యాడు లక్ష్మణ్ కార్య. ఆయన దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. రావు రమేష్ టైటిల్ రోల్ పోషించిన ఈ చిత్రం ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు లక్ష్మణ్ కార్య శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ కథ రాసుకున్న తర్వాత టైటిల్ రోల్‌లో ఎవరైతే బాగుంటుందని ఆలోచించా. వెంటనే రావు రమేష్‌గారు గుర్తుకొచ్చారు. అయితే ఆయన చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తున్నారు కాబట్టి ఒప్పుకుంటారో లేదో అని అనుకున్నా. కథ చెప్పగానే నవ్వుతూ ఓకే చేశారు' అన్నారు. సినిమా కథ గురించి చెబుతూ 'ఓ రోజు నా భార్య అకౌంట్‌లో 80 వేలు క్రెడిట్ అయ్యాయి. ఎవరు వేశారో తెలియదు. రెండు రోజుల తర్వాత ఫారిన్‌లో వున్న మా అత్తగారే డబ్బులేశారని తెలిసింది. ఆ రెండు రోజులు ఇంట్లో జరిగిన విషయాలన్నీ సరదాగా అనిపించాయి. వాటి స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నా. ఇందులో రావు రమేష్ మిడిల్ ఏజ్డ్ ఫాదర్‌గా కనిపిస్తారు' అని తెలిపారు. ఈ సినిమాలో తండ్రీకొడుకుల అనుబంధం హైలైట్‌గా నిలుస్తుందని, రావు రమేష్‌గారి భార్య కళామణి పాత్రలో ఇంద్రజ అద్భుతంగా నటించిందని లక్ష్మణ్ కార్య పేర్కొన్నాడు. ఈ సినిమాకు అగ్ర దర్శకులు సుకుమార్‌గారి భార్య తబిత సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నదని, సినిమా చూశాక సుకుమార్ గారు ఫోన్ సినిమా అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారని తెలిపారు. 'సుకుమార్‌గారి మాటలు నాకు మరింత ధైర్యాన్ని ఇచ్చాయి. ప్రేక్షకులు ఈ సినిమాను హాయిగా నవ్వుతూ ఎంజాయ్ చేస్తారు' అని లక్ష్మణ్ కార్య చెప్పారు.

తీరని రుణం.. రైతన్న రణం

- మంచిర్యాల జిల్లా నెన్నలలో రోడ్డెక్కిన రైతులు



మంచిర్యాల జిల్లా నెన్నెల మండల కేంద్రంలో 2 లక్షల రుణమాఫీ కాలేదంటూ రైతులు రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని సీఎం వెంటనే రాజీనామా చేయాలని బీఆర్ఎస్ మండల నాయకుడు సింగతి రాంచందర్, రైతులు డిమాండ్ చేశారు. – నెన్నెల

- బాల్కొండ నియోజకవర్గం వేల్పూరు ఎక్స్‌రోడ్డులో..



బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్ ఎక్స్ రోడ్డు వద్ద ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. – వేల్పూర్

"మా రుణం ఎందుకు మాఫీ కాలే.. మాటిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు చేయలే.. ఇదే సర్కారు.. ఏమి గోస ఇది.. అందరికీ చేసినన్నడు.. అన్నీ చేసినట్టు చెప్పకున్నరు.. మాకెందుకు గాలే" అని రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అన్నదాతలు శనివారం రోడ్డెక్కారు. వ్యవసాయ రుణాలు తీసుకున్న బ్యాంకుల ఎదుట ఆందోళనలకు దిగారు. ఒక్కో బ్యాంకు పరిధిలో వందలాది మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు. కోట్ల రూపాయల రుణాలు మాఫీ కాలేదు. దీంతో సర్కారు నిర్లక్ష్యాన్ని రైతులు ఎండగట్టారు. పాలకుల పరిహాసాన్ని నిరసించారు. బ్యాంకుల అధికారుల అలసత్వంపై ధ్వజమెత్తారు. మళ్లీ దరఖాస్తులు చేసుకోవాలంటూ కొర్రీలు పెట్టిన ప్రభుత్వ వైనాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వెంటనే మాఫీ చేయాలని, లేకుంటే ఉద్యమిస్తామని రైతులు హెచ్చరించారు.

- నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో..



బ్యాంకు ఖాతా పేరుకు, ఆధార్ కార్డుకు మిస్‌మ్యాచ్ కావడంతో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులకు రుణమాఫీ ఆగిపోయింది. దీంతో శనివారం మండలకేంద్రంలోని ఇండియన్ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. – నార్కట్‌పల్లి

ఎందుకు రుణమాఫీ కాలేదో!



నేను కవేలి బ్యాంకులో రూ.1.35 అప్పు తీసుకున్నాను. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అయ్యిందంటే నేను కూడా బ్యాంకుకు వచ్చాను. కానీ, వారు అతికించిన లిస్టులో నా పేరు లేదు. నాకు రుణమాఫీ ఎందుకు కాలేదో తెలియడం లేదు. ఎవరూ చెప్పడం లేదు. ఇప్పుడు నేనేం చేయాలి?

-సంగయ్య, రైతు, కవేలి గ్రామం, కోహీర్ మండలం(సంగారెడ్డి జిల్లా)

- వనపర్తి జిల్లా అమరచింతలో..



రుణమాఫీ కాలేదంటూ వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు ఎదుట రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో రైతులు శనివారం ఆందోళనకు దిగారు. అధికారంలోకి రాగానే షరతులు పెట్టి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నదని మండిపడ్డారు. – అమరచింత

శాతగాని మాటలు ఎందుకు చెప్పాలె?



ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చినప్పుడు అందరి ఓట్లు కావాలి కానీ, రుణమాఫీ చేసేటప్పుడు రైతులందరికీ చేయాలనే సోయి లేని ప్రభుత్వం ఇది. శాతగాని మాటలు చెప్పి రైతులను ఆగం చేసుడెందుకు? గతంలో రూ.25 వేల చొప్పున రూ.లక్ష వరకు రుణమాఫీ అయినప్పుడు ఇప్పుడెందుకు కాదు? ఊర్లో 10 మందికి రుణమాఫీ అయితే మిగతా వాళ్లు ఎటు పోతరు? ఆ పది మందితోనే ప్రభుత్వానికి అవసరమా? ఊర్లకు వచ్చి వ్యవసాయం చేసేటోళ్లు ఎవలు? చేయనోళ్లు ఎవలు అని చూసి అందరికీ మాఫీ చేయాలె. వ్యవసాయం కోసం బ్యాంకుల్లో రుణాలు, బయట వడ్డీలకు తెచ్చుకొని రెక్కలు పోయేదాక వ్యవసాయం చేసిన చేతికి రూపాయి వత్తలేదాయె. రైతు అనేటోళ్లందరికి మాఫీ చేయాలె.

- ఎల్లావుల విజయ, పంచోత్కులపల్లి, ములుగు మండలం, ములుగు జిల్లా

- నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్‌రోడ్‌లో..



రైతు రుణమాఫీ కోసం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ ఎక్స్‌రోడ్ వద్ద శనివారం నిర్వహించిన ధర్నాలో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి వినూత్న నిరసన తెలిపారు. తెలంగాణలోని పలు ఆధ్యాత్మిక క్షేత్రాలకు సంబంధించిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.. పార్లమెంట్ ఎన్నికల సమయంలో సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి ఆయా దేవుళ్లపై ఒట్లు వేసుకుంటూ రైతులను నమ్మించి రుణమాఫీ చేస్తానని అబద్ధపు హామీలు ఇచ్చాడని వేముల గుర్తుచేశారు. – వేల్పూర్

ఒక్కరికీ మాఫీ కాలేదు



మా ఊర్లో పావులా వంతు రైతులకూ రుణమాఫీ జరగలేదు. నాకు ఏడెకరాల భూమి ఉంది. నా పేరు మీద రూ.1,95 లక్షలు, నా భార్య పేరు మీద రూ. 2.12 లక్షలు ఉంది. ఏఈవోను అడిగితే ఒకటే రేషన్‌కార్డు మీద ఇద్దరి పేర్లు ఉన్నందున పథకం వర్తించలేదని చెప్పారు. బ్యాంకు అధికారులను అడిగితే రేషన్‌కార్డు నిబంధన ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయం అని అంటున్నారు. ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు వస్తాయని, తొందరపడొద్దని సముదాయిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.లక్ష రుణమాఫీ పొందాను. ఇప్పుడూ అలాగే రుణమాఫీ వర్తింపజేస్తే నాలాంటి ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుంది.

- బిక్కినేని మల్‌హల్‌రావు, పంచోత్కులపల్లి, ములుగు మండలం, ములుగు జిల్లా

- సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలంలో..



సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం కవేలిలోని బ్యాంకు వద్ద శనివారం రుణ మాఫీ జాబితాలో తమ పేర్లను చూసుకుంటున్న రైతులు. పేర్లు లేని వారు నిరాశతో వెనుదిరిగారు. –కోహీర్

- నిజామాబాద్ జిల్లా జన్నేపల్లిలో..



నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం జన్నేపల్లిలోనూ సిండికేట్(కెనరా) బ్యాంకు వద్ద రైతులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతన్నలందరికీ రుణమాఫీ చేయాలంటూ డిమాండ్ చేశారు. – నవీపేట

- మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో..



పంట రుణం తీసుకున్న రైతులందరికీ రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద వివిధ గ్రామాలకు చెందిన రైతులు ధర్నా చేశారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు రైతు వేదికలో వ్యవసాధికారులు, ఏఈవోలు లేకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. – నర్సింహులపేట

- కామారెడ్డి జిల్లా పెద్దమల్లారెడ్డిలో..



రుణమాఫీ కాలేదని కామారెడ్డి మండలం తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన రైతులు పెద్దమల్లారెడ్డిలోని రైతువేదికలో ఆందోళన చేపట్టారు. అనంతరం మూకుమ్మడిగా కామారెడ్డిలోని కలెక్టరేట్‌కు తరలివెళ్లారు. – కామారెడ్డి

వచ్చినోళ్లు నవ్వబట్టె.. రానోళ్లు ఏడ్వబట్టె



రుణమాఫీ అయితదని ఎదురు చూసినం. మాకు కాలె. మా ఆయన సదర్‌లాల్ పేరు మీద రూ.2.02 లక్షల అప్పు ఉన్నది. ఇప్పుడు మాఫీ కాలేదు. పైన రూ.2 వేలు కట్టినా కాదంటున్నరు. రుణమాఫీ వచ్చినోళ్లు నవ్వబట్టె.. రానోళ్లు ఏడ్వబట్టె.. ఎందుకు ఈ దొంగ రాజకీయాలు. పెట్టుబడికే కదా రైతులు అప్పులు తెచ్చేది. దానికి ఇన్ని తాకట్లా. పెట్టుబడికి కొంచెం తోడు అయినట్టు ఉంటదనుకుంటే నాశనం అయిపాయె. రైతలందరికీ కచ్చితంగా రుణమాఫీ చేయాలె.

- భూక్యా యశోద, పంచోత్కులపల్లి, ములుగు మండలం, ములుగు జిల్లా

- జగిత్యాల జిల్లాలో..



రుణ మాఫీ కాలేదంటూ జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలం వేంపేట, చింతలపేట, మల్లాపూర్ మండలంలోని సాతారం, ధర్మారం, చిట్టాపూర్ గ్రామాల పరిధిలోని రైతులు శనివారం మల్లాపూర్ రైతువేదికలో డీఏవో వాణి, బ్యాంకు అధికారులను నిలదీశారు. – కరీంనగర్, నమస్తే తెలంగాణ ప్రతినిధి

- తాంసిలో ఏవో నిలదీత



రుణమాఫీ విషయంలో ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని కప్పర్లలో రైతులు వ్యవసాయ అధికారి శివకుమార్‌ను నిలదీశారు. ఎందుకు రుణమాఫీ చేయలేదంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. – ఆదిలాబాద్

- భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని పలువురు రైతులు శనివారం రుణమాఫీ అంశంపై ఏవో కార్యాలయ సిబ్బందిని నిలదీశారు. నిరసనగా కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు, సిబ్బందిపై చర్య తీసుకోవాలని కోరారు. – మహదేవపూర్

నాకు రుణమాఫీ ఎప్పుడు చేస్తరు?



నేను కవేలి బ్యాంకులో రూ.లక్షన్నర అప్పు తీసుకున్నాను. ఇప్పుడు అవి రూ.1.60 లక్షలు అయ్యాయి. రుణమాఫీ అయ్యిందని బ్యాంకుకు వస్తే అందులో నా పేరు లేదు. ఇప్పుడు కాకపోతే రుణమాఫీ ఇంకెప్పుడు చేస్తరు? నాకు ఎందుకు కాలేదో ఎవరూ కరెక్టుగా చెప్పడం లేదు. బ్యాంకు వాళ్లు, వ్యవసాయ అధికారులు సరైన సమాధానం ఇవ్వడం లేదు.

- లక్ష్మణ్, రైతు, పైడిగుమ్మల్ తండా, కోహీర్ మండలం (సంగారెడ్డి జిల్లా)

జీతాలు పుణ్యానికే వస్తున్నాయా?

- బ్యాంకర్లపై ఎమ్మెల్యే యెన్నం చిర్రుబుర్రు
- మంత్రి సమక్షంలోనే ఫైల్స్ పడేసిన శ్రీనివాస్‌రెడ్డి



మహబూబ్‌నగర్ డీసీసీబీ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్, ఆగస్టు 17: డీసీసీబీ అధికారులపై మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి చిర్రుబుర్రులాడారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి జిల్లా బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి ముఖ్యఅతిథిగా హాజరవగా.. ఎమ్మెల్యేలు యెన్నం, మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొరమోని వెంకటయ్య పాల్గొన్నారు. ఎమ్మెల్యే యెన్నం మాట్లాడుతూ.. 'మీ అందరికీ జీతాలు టైంకు ఇస్తుంటే.. మీకు ఉన్న పని ఏందీ? నిమ్మలంగా ఏసీలలో కూర్చొనే కదా పనిచేసేది? మీ కంప్యూటర్లలో ఉన్న లిస్టుల్లో ఏం తప్పు ఉందో చూడలేరా? ఇన్ని ఏండ్ల నుంచి జీతాలు ఎందుకు తీసుకుంటున్నారు? జీతాలు పుణ్యానికే వస్తున్నాయా? ఇదేనా మీ బాధ్యత? మీ రికార్డ్స్ సరిగా లేవు. మంత్రి వస్తున్నప్పుడు రికార్డ్స్ సరిగ్గా పెట్టుకోవాలన్న ఇంగిత జ్ఞానం కూడా లేదా మీకు? నిర్లక్ష్యంగా.. బాధ్యత లేకుండా.. మాకేం సంబంధం లేదన్నట్టు పనిచేస్తున్నారు' అంటూ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలోనే డీసీసీబీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి ముందే ఆవేశంతో రుణమాఫీ ఫైల్స్‌ను పడేశారు. మంత్రి మాట్లాడుతూ.. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని, లేకుంటే ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని బ్యాంకర్లకు సూచించారు.

రుణమాఫీపై రణరంగమే



రైతుబడి అగ్రిషోలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

2 లక్షల పైబాకీ చెల్లిస్తేనే రుణమాఫీ

- మంత్రి తుమ్మల

నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రూ.2 లక్షల వరకు రుణం తీసుకున్న రైతులు.. ఆపైన ఉన్న మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తేనే వారికి రూ.2 లక్షల రుణమాఫీ వర్తిస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు స్పష్టంచేశారు. ఇలాంటి ఖాతాలు రాష్ట్రంలో 10 వేల నుంచి 12 వేల వరకు ఉంటాయని, రాష్ట్రంలో 22 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని వెల్లడించారు. శనివారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ మైదానంలో రైతుబడి యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేసిన అగ్రి ఎక్స్‌పోను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేయబోమని స్పష్టంచేశారు.

100% రుణమాఫీ అయితే రాజీనామా చేస్తా

- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ ఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ వందశాతం అయినట్టు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటానని సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ శాసన సభాపక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏ గ్రామానికైనా వెళ్లి రైతుల సమక్షంలోనే చర్చ పెడుదాం.. రుణమాఫీ 100శాతం పూర్తయిందని రైతులంటే నేను దేనికైనా సిద్ధం. కాలేదని చెబితే రేవంత్‌రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకొంటారా? రాజీనామా చేస్తారా? ఏం చేస్తారో చెప్పాలి' అని సవాల్ విసిరారు.

'సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించండి'

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు హైదరాబాద్, వరంగల్, కరీంనగర్‌లో వైద్య సౌకర్యాలు కల్పించాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కోరింది. శనివారం అసోసియేషన్ అధ్యక్షుడు రాంచందర్‌రావు సచివాలయంలో డిప్యూటీ సీఎం విక్రమార్కను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు.

- ప్రతి గ్రామంలో రుణమాఫీ కాని రైతుల వివరాలు సేకరిస్తాం
- రాష్ట్రవ్యాప్తంగా సోమవారం నుంచి వారం పాటు అదే పనిలో
- కలెక్టర్, మంత్రి, సీఎం, గవర్నర్‌కు ఆ వివరాలు అందిస్తాం
- అప్పటికీ సర్కారు స్పందించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ
- రుణమాఫీ పూర్తయితే కలెక్టరేట్‌లో ప్రత్యేక కౌంటర్లెందుకు?
- బీజేపీ జెండాతోనే చచ్చిపోతానని మోదీ, షాతో అన్న రేవంత్
- దీనిపై రేవంత్‌రెడ్డి వివరణ ఇవ్వాలి.. కేటీఆర్ డిమాండ్



తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సమావేశమైన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రతి రైతుకు రుణమాఫీ జరగాలన్నదే తమ ఉద్దేశమని, దీని కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. గ్రామస్థాయిలో రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ పరంగా ఒత్తిడి తెస్తామని తెలిపారు. శనివారం తెలంగాణభవన్‌లో మీడియాతో ఇష్టాగోష్ఠిలో పాల్గొన్న ఆయన.. రాష్ట్రవ్యాప్తంగా 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయ్యిందని, మిగిలిన వారికి కాలేదని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో రైతుల వివరాలను సేకరించాలని నిర్ణయించామని అన్నారు. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వివరాలు సేకరిస్తామని చెప్పారు. 973 పీఏసీఎస్‌ల్లో చైర్మన్లు, డైరెక్టర్లు బీఆర్‌ఎస్ వాళ్లేనని, రైతుబంధు సమితి సభ్యులతో తమకు బలమైన వ్యవస్థ ఉన్నదని, వారి ద్వారా వివరాలను సేకరిస్తామని వెల్లడించారు. ఒక్కో నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సీనియర్ నాయకులు బాధ్యత తీసుకుంటారని వివరించారు. వారం పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించారు. ముందుగా ప్రతి మంత్రి నియోజకవర్గం నుంచి సీఎం నియోజకవర్గం వరకు వివరాలు సేకరించి ప్రభుత్వానికి అందిస్తామని, జిల్లా కలెక్టర్లను కలిసి వినతిపత్రం ఇస్తామని వెల్లడించారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రస్థాయిలో వ్యవసాయశాఖ కార్యదర్శి, ఆ శాఖ మంత్రిని కలుస్తామని అన్నారు. ఆ తర్వాత సీఎం, గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామని తెలిపారు. ప్రభుత్వం నుంచి స్పందనరాకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని స్పష్టంచేశారు.

రుణమాఫీపై ప్రభుత్వానికి సమయం ఇస్తున్నామని, అంతవరకు సంయమనం పాటిస్తామని చెప్పారు. రైతులకు రుణవిముక్తి చేయాలన్నదే తమ లక్ష్యమని తేల్చిచెప్పారు. రైతులు అసంతృప్తి, అసహనంతో ఉన్నారని అన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేస్తామని విఫలమయ్యారని, భంగపడ్డారని తెలిపారు. వందశాతం రుణమాఫీ అయ్యిందని చెప్పి.. కలెక్టరేట్లలో రుణమాఫీ కానివాళ్ల కోసం ప్రత్యేక కౌంటర్లు ఎందుకు పెట్టారని నిలదీశారు.

47 లక్షల్లో 22 లక్షల మందికేనా?

47 లక్షల మందికి రూ.49 వేల కోట్లు రుణమాఫీకి కావాలని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్‌ఎల్బీసీ) సమావేశంలో తేల్చారని కేటీఆర్ గుర్తుచేశారు. అయితే రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అంటూ క్యాబినెట్ తీర్మానం చేసి, రూ.26 వేల కోట్లకు బడ్జెట్ ఆమోదించిందని, చివరికి రూ.17 వేల కోట్లతో మమ అనిపించారని ఆరోపించారు. 22 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేశారని, మిగతా 25 లక్షల రైతుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. రుణమాఫీపై బీఆర్‌ఎస్ ఏర్పాటు చేసిన కాల్‌సెంటర్‌కు దాదాపు 1.20 లక్షల ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. రైతు రుణమాఫీ విఫలమైన నేపథ్యంలో దాన్నుంచి దృష్టిమళ్లించే చర్యలకు కాంగ్రెస్ దిగుతున్నదని మండిపడ్డారు. ప్రభుత్వంలో ఉండి ప్రభుత్వ ఆస్తులపై దాడులు చేయించటం దేనికి సంకేతం అని నిలదీశారు. సిద్దిపేటలో ఎమ్మెల్యే అధికారిక నివాసంపై దాడిచేసిన వారిపై ప్రభుత్వం కేసు పెట్టాలని డిమాండ్ చేశారు.

రేవంత్ చివరి మజిలీ బీజేపీతోనేనట

సీఎం రేవంత్‌రెడ్డి తన రాజకీయ మజిలీ బీజేపీతోనేనని, త్వరలోనే తన బృందంతో ఆయన బీజేపీలో చేరటం ఖాయమని కేటీఆర్ అన్నారు. తాను పుట్టింది బీజేపీలోనేనని, చివరికి బీజేపీలోనే తన రాజకీయ ప్రస్థానం ముగుస్తుందని, అదే జెండా కప్పుకొని చనిపోతానని ప్రధాని మోదీ, అమిత్‌షాకు రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని తెలిపారు. తనకు ఢిల్లీ నుంచి సమాచారం అందిందని వెల్లడించారు. ఇది వాస్తవమా? కాదా? రేవంత్ చెప్పాలని ప్రశ్నించారు. రేవంత్‌కు మోదీ అంటే భయం అన్న విషయాన్ని సన్నిహితుల వద్ద సీఎం చెప్పారని, అందుకే కేంద్ర బడ్జెట్‌పై మాట్లాడటానికి భయపడ్డారని ఆరోపించారు. అదానీపై 22న నిరసన కార్యక్రమాలకు కాంగ్రెస్ జాతీయ నాయకత్వం పిలుపునిచ్చిందని, ఈ నిరసనలో రేవంత్ పాల్గొంటారా? లేదా? చూడాలని అన్నారు. అదానీకి పెద్ద పీట వేస్తున్న కాంగ్రెస్ నేత రేవంత్ అని చెప్పారు.

ముఖ్యమంత్రి సొంత మీడియా ప్రతినిధులు కమలాసన్‌రెడ్డి లాంటి సీనియర్ అధికారిపై దాడి చేసినంత పని చేశారని, అటు.. సీఎం అధికారిక మీడియా ఆలిండియా సర్వీస్ అధికారులపై దాడి చేస్తున్నదని ఆరోపించారు.

ఫాక్స్‌కాన్ విస్తరణ లేనట్లేనా?

బీఆర్‌ఎస్ సర్కారు ఉన్నప్పుడు ఫాక్స్‌కాన్ సంస్థ హైదరాబాద్‌లో లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నదని కేటీఆర్ గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి మాటలు, పరిపాలన వైఫల్యం వల్ల ఆ కంపెనీ వెనక్కి వెళ్ళిపోయిందా? 40 వేల ఉద్యోగులతో చైనా తర్వాత అతిపెద్ద రెండో క్యాంపస్‌ను బెంగళూరులో ఏర్పాటు చేస్తామని సంస్థ చెప్పటం దేనికి నిదర్శనం? అని ప్రశ్నించారు. ఫాక్స్‌కాన్ పెట్టుబడులు, విస్తరణపై నిజాలు బయటపెట్టాలని డిమాండ్‌చేశారు. ఫాక్స్‌కాన్ ఒక దశ నిర్మాణం పూర్తయ్యిందని, ప్రారంభానికి సిద్ధమైందని తెలిపారు. దీని ద్వారా 25 వేల ఉద్యోగాలు రాబోతున్నాయని, తదుపరి విస్తరణను ఫాక్స్‌కాన్ చేపడుతుందా? లేదా? అన్నది సీఎం చెప్పాలని అన్నారు. సీఎం మాటలు, దుష్ప్రచారం వల్లే ఆ కంపెనీ బెంగళూరుకు పోయిందా? అని అనిపిస్తున్నదని వెల్లడించారు.

కమిషన్ ముందుకు వెళ్తా

యథాలాపంగా చేసిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పినా మహిళా కమిషన్ నోటీస్ ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఈ నెల 24న మహిళా కమిషన్ ముందు హాజరవుతానని వెల్లడించారు. హాజరుకావటమే కాదు.. గత 8 నెలలుగా కాంగ్రెస్ పాలనలో మహిళలపై జరిగిన దురాగతాల వివరాలను అందజేస్తానని పేర్కొన్నారు.

గూండా రాజకీయాలు చేస్తే చూస్తూ ఊరుకోం: రాజీవ్‌సాగర్

రైతు రుణమాఫీ ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల నివాసాలపై దాడులకు దిగుతుందని కార్పొరేషన్ మాజీ చైర్మన్ మేడే రాజీవ్‌సాగర్ ధ్వజమెత్తారు. మాజీ మంత్రి హరీశ్‌రావు అధికారిక నివాసంపై కాంగ్రెస్ గూండాల దాడిని ఆయన ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. రుణమాఫీ సంపూర్ణంగా చేయనందుకు సీఎం రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ గుండాగిరిని సహించేదిలేదని హెచ్చరించారు.

రుణమాఫీపై బీఆర్‌ఎస్ కార్యాచరణ

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్, హరీశ్‌రావు సమావేశం

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీపై పార్టీ పరంగా కార్యాచరణను రూపొందించడానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమయ్యారు. శనివారం తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో రుణమాఫీలో ప్రభుత్వ వైఫల్యంపై అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల అభిప్రాయాలను తీసుకున్నారు. రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత పార్టీ, ప్రజాప్రతినిధులపై ఉందని, వారికి భరోసా ఇచ్చి రుణమాఫీ అయ్యే విధంగా పోరాడాలని నిర్ణయించారు. రుణమాఫీ కాని రైతుల వివరాలను సేకరించి ప్రభుత్వ స్పందనకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునితా లక్ష్మారెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, మాణిక్ రావు, చింత ప్రభాకర్, బండారు లక్ష్మారెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు వాణిదేవి, దేశపతి శ్రీనివాస్ పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద్, చింతా ప్రభాకర్

రేవంత్ గద్దె దిగు

- రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలం
- 25 లక్షల మంది రైతులకు ఎగనామం
- రైతులను మోసం చేసి దైవద్రోహం
- మరో రైతాంగ ఉద్యమానికి బీఆర్‌ఎస్ శ్రీకారం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రుణమాఫీ చేయడంలో విఫలమైన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు డిమాండ్ చేశారు. డిసెంబర్ 9న చేస్తామని చెప్పి.. పంద్రాగస్టుకు వాయిదా వేసి ఇప్పటికీ పూర్తి స్థాయిలో చేయలేదని మండిపడ్డారు. శనివారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ అయిందని రాష్ట్రంలో ఏ గ్రామంలోనైనా నిరూపించాలని, తాను ఎక్కడికైనా, ఎప్పుడైనా రావడానికి సిద్ధంగా ఉన్నానని ప్రకటించారు. రుణమాఫీపై ప్రభుత్వం శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతులనే కాదు దేవుళ్లను మోసం చేసిన ఘనత రేవంత్‌రెడ్డిది విమర్శించారు. తనకు రాజీనామాలు కొత్త కాదని, రెండుసార్లు ఎమ్మెల్యే పదవికి, ఒకసారి మంత్రి పదవికి రాజీనామా చేసిన చరిత్ర తనదని, ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి పారిపోయిన చరిత్ర రేవంత్‌ది అని విమర్శలు చేశారు.

25 లక్షల మందికి ఎగనామం

అసెంబ్లీ ఎన్నికల సమయంలో డిసెంబర్ 9న సోనియాగాంధీ పుట్టిన రోజు కానుకగా రూ. 40 వేల కోట్లు ఏకకాలంలో చేస్తానని చెప్పాడని, పార్లమెంట్ ఎన్నికల్లో దేవుళ్ల మీద ఒట్టు పెట్టి పంద్రాగస్టుకు 31వేల కోట్లు చేస్తానని, బడ్జెట్‌లో 26 వేల కోట్లు మాత్రమే పెట్టారని హరీశ్‌రావు చెప్పారు. అసెంబ్లీలో రుణమాఫీ, రైతు భరోసా మీద చర్చ పెట్టాలని పట్టుపట్టినా ముఖం చాటేసి పారిపోయిండని విమర్శించారు. పంద్రాగస్టుకు రుణమాఫీ అయిపోయిందని ప్రకటిస్తే.. లెక్కలు చూస్తే కేవలం 17 వేల కోట్లు మాత్రమే తేలిందన్నారు. పార్లమెంట్ ఎన్నికలప్పుడు రైతుల సంఖ్య 47 లక్షలు అని చెప్పి 22 లక్షల మంది రైతులకు మాత్రమే చేశారని, సుమారు 25 లక్షల మంది రైతులకు ఎగనామం పెట్టినట్టు రికార్డులే చెబుతున్నాయని మండిపడ్డారు.

మాట తప్పేటోడిని కాదు

రుణమాఫీ చేసిన, రాజీనామా అని రంకెలేస్తున్న రేవంత్‌రెడ్డి.. ఆగస్టు15లోపు రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేసి, ఆరు గ్యారెంటీల్లోని 13 హామీలను సంపూర్ణంగా నెరవేరిస్తే తాను రాజీనామాకు సిద్ధమని ఆనాడు ప్రకటించానని హరీశ్‌రావు గుర్తు చేశారు. ఒకవైపు రైతు బంధు రాక, మరోవైపు రుణమాఫీ చెయ్యక రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు. రుణమాఫీ చేయలేక చేతులెత్తేసినందుకు రేవంత్‌రెడ్డి రాజీనామా చేయాల్సిందిపోయి, తన రాజీనామా అడగడంపై హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

రైతుకు మోసం.. దైవానికి ద్రోహం

రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసి.. హిందు, ముస్లిం, క్రిస్టియన్లు నమ్ముకున్న దేవుళ్లకు కూడా ద్రోహానికి పాల్పడ్డాడని మండిపడ్డారు. రేవంత్ పాపం ప్రజలకు శాపం కావద్దని, తాను తీర్థయాత్రకు బయలుదేరుతానని ప్రకటించారు. రుణమాఫీ చేసే దాకా, రైతు భరోసా ఇచ్చేదాకా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, రేవంత్‌రెడ్డిని వదిలిపెట్టేది లేదని హరీశ్‌రావు హెచ్చరించారు. బీఆర్‌ఎస్ పక్షాన మరో రైతాంగ ఉద్యమానికి శ్రీకారం చుడతామని చెప్పారు.

ప్లేసు.. డేటు.. డిసైడ్ చెయ్

'నువ్వు నిజంగనే రైతు రుణమాఫీ అయ్యిందనుకుంటున్నవా రేవంత్ రెడ్డి.. రైతులందరికీ రుణమాఫీ అయ్యిందని దమ్ముంటే నిరూపించు. ప్లేసు, డేటు, టైము నువ్వే చెప్పు, ఏ జిల్లాకు పోదాం, ఏ నియోజకవర్గానికి పోదాం, ఏ మండలానికి పోదాం, ఏ గ్రామానికి పోదాం. నీ నియోజకవర్గమా ?, నా నియోజకవర్గమా ? ఎక్కడికైనా పోదాం, నేనంటున్నది కరెక్టో, నువ్వంటున్నది కరెక్టో ఖుల్లం ఖుల్లా తెలుస్తది'

- రుణమాఫీపై హరీశ్‌రావు సవాల్

వచ్చే ఎన్నికల్లో అధికారం మనదే

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడదాం
- ఉమ్మడి వరంగల్ శ్రేణులతో కేటీఆర్



తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులతో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ ఎనిమిది నెలల పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా నిత్యం ప్రజలతోనే ఉండాలని సూచించారు. బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన పడాల్సిన అవసరంలేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాలుగేండ్ల కాలంలో పార్టీని బలోపేతం చేసుకుందామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడి పనిచేయాలని, ప్రజలు బీఆర్‌ఎస్ వైపే ఉన్నారని వివరించారు. పార్టీలో కష్టపడే కార్యకర్తలకు తగిన గౌరవం, గుర్తింపు కచ్చితంగా ఉంటుందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను, ప్రభుత్వ వైఫల్యాలు క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని పిలుపునిచ్చారు.



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు ఎదుట ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి ఆందోళన చేస్తున్న రైతులు

632 మందిలో 14మందికే మాఫీ

- బౌరంపేట కోఆపరేటివ్ బ్యాంకులో కొర్రీ
- అబద్ధపు పునాదులపై గద్దెనెక్కిన కాంగ్రెస్
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద
- సహకార బ్యాంకు ఎదుట రైతులు నిరసన

దుండిగల్, ఆగస్టు17: అసత్య ప్రచారం, అబద్ధపు మాటల పునాదులపైనే కాంగ్రెస్ రాష్ట్రంలో గద్దెనెక్కిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ధ్వజమెత్తారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో గండిమైసమ్మ చౌరస్తాలోని బౌరంపేట సహకార సంఘం బ్యాంక్ వద్ద రైతు రుణమాఫీ కాని వందలాది మంది బౌరంపేట్, దుండిగల్ గ్రామాల రైతులు శనివారం ఎమ్మెల్యే వివేకానంద ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గండిమైసమ్మ-దుండిగల్ మండలంలోని బౌరంపేట, దుండిగల్ బ్యాంక్‌లో 632 మంది రైతులు రుణం పొందితే కేవలం 14 మందికి రూ4.30 లక్షలను మాత్రమే ప్రభుత్వం రుణమాఫీ చేసిందని విమర్శించారు. మిగతా 618 మంది రైతులకు రూ.2.95 కోట్ల రుణాలను మాఫీ చేయాల్సి ఉన్నదని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ పనులు, వరినాట్లు పూర్తయినా ఇప్పటివరకు రైతు భరోసా ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ విద్దెల బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు భీమ్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జీతయ్య, కృష్ణ, సత్తిరెడ్డి, ఈ శ్రీనివాస్, పాల్గొన్నారు.

సీఎస్‌సీఎస్ చైర్మన్‌తో మాజీ ఐఏఎస్ భేటీ

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ) : మాజీ ఐఏఎస్ షఫీక్ ఉజ్జమాన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం.. సెంటర్ ఫర్ సోషల్ అండ్ కాన్‌స్టిట్యూషనల్ స్టడీస్‌అండ్ హెల్ప్ హైదరాబాద్ చైర్మన్ సయ్యద్ అజ్మతుల్లా హుస్సేనీ, సభ్యులతో శనివారం సమావేశమయ్యారు. వక్ఫ్ సవరణ చట్టం-2024పై చర్చించినట్టు తెలిసింది. సమావేశంలో ఖాద్రీ, షకీల్, మాజిద్, అన్వర్, సబా ఖాద్రీ, ఆరిజ్ మహ్మద్,అఫ్సర్ పాల్గొన్నారు.

విద్యాఫలాలు అందిరికీ అందేలా చూడండి: టీఆర్‌టీఎఫ్

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): విద్యా ఫలాలు అందరికీ అందేలా చూడాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని కోరింది. విద్యాసంస్కరణలకు ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌బాబును టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కటకం రమేశ్, ప్రధాన కార్యదర్శి మారెడ్డి అంజిరెడ్డి శనివారం సచివాలయం లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యా కమిషన్‌ను సైతం త్వరలో ఏర్పాటు చేయాలని కోరారు.

హామీ నిజం.. అమలు అబద్ధం!

- బీఆర్‌ఎస్ హయాంలో 73శాతం.. ఇప్పుడు 32శాతమే
- బీఆర్‌ఎస్ లక్ష రుణమాఫీకి 36.68 లక్షల మంది అర్హులు
- కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీకి 22.37 లక్షల రైతులేనట!
- రైతులు, రుణాలు పెరిగితే.. మాఫీ తగ్గడమేంటన్న ప్రశ్నలు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రైతు రుణమాఫీపై ఇచ్చిన మాటను కాంగ్రెస్ సర్కారు పూర్తిస్థాయిలో నిలబెట్టుకోలేకపోయింది. ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న హామీని పాక్షికంగానే అమలుచేసింది. వివిధ కారణాలు, షరతులతో రూ.2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులను మర్చిపోయింది. ప్రభుత్వం చెప్పిన ప్రకారం ఆగస్టు 15లోపు రైతులందరికీ రుణమాఫీ కాలేదు. అసంపూర్తిగా మాఫీ చేస్తే మొత్తం మాఫీ ఎలా అవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం రూ.2 లక్షలకుపైగా రుణాలున్న రైతులకు కూడా రుణమాఫీ చేసి ఉంటే, ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నదనే ఖ్యాతి దక్కేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామన్న సీఎం రేవంత్‌రెడ్డి, 'హామీ నిజం.. అమలు అబద్ధం' అనే విమర్శను ప్రతిపక్షాల నుంచి ఎదుర్కోవాల్సి వస్తున్నది.

31 వేల కోట్లకు చేసింది 17 వేల కోట్లే!

ప్రభుత్వ లెక్కల ప్రకారం 32.5 లక్షల మంది రైతులకు రూ.31 వేల కోట్ల రుణాలు మాఫీ కావాల్సి ఉన్నది. కానీ, 22.2 లక్షల మందికి రూ.17,869 కోట్లు మాత్రమే ప్రభుత్వం మాఫీ చేసింది. ఇంకా 10.3 లక్షల మందికి మాఫీ కాలేదు. వీరికి ఇంకా రూ.13,131 కోట్ల రుణాలు మాఫీ చేయాల్సి ఉన్నది. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు మాఫీ చేసింది. రెండో విడతలో రూ.1.5 లక్షల వరకు రుణం గల 6.40 లక్షల రైతులకు రూ.6,190 కోట్లు మాఫీ చేయగా, మూడో విడతలో రూ.2 లక్షల వరకు రుణం గల 4.46 లక్షల రైతులకు రూ.5,644 కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఈ విధంగా నెల వ్యవధిలో మూడు విడతల్లో కలిపి 22.2 లక్షల రైతులకు రూ.17,869 కోట్లను మాఫీ చేసింది. ఇంతకు రెండింతల మంది రుణ విముక్తులు కాలేకపోయారు.

48 లక్షల మంది రైతులకు నష్టం

ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ అని ప్రకటించిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకొచ్చాక నిబంధనలు విధించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిబంధనలను వర్తింపజేయడంతో దాదాపు 48 లక్షల మంది రైతులు రుణమాఫీకి నోచుకోలేకపోయారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్‌కార్డు లేకున్నా, ఆదాయ పన్ను చెల్లించినా, అక్షర దోషాలున్నా, చిన్న చిన్న ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న, పెన్షన్ పొందుతున్న వారికి కూడా రుణమాఫీ కాలేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే దాదాపు 10.30 లక్షల మందికి మాఫీ కాలేదు. వాస్తవ లెక్కలు పరిశీలిస్తే, ఈ సంఖ్య అంతకు నాలుగింతలు ఉంటుంది. రాష్ట్రంలో రుణాలు తీసుకున్న రైతులు 70 లక్షల మంది ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. కానీ, మూడు విడతల్లో కలిపి 22.2 లక్షల మందికే రుణమాఫీ చేయడంతో ఇంకా 48 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాకపోవడం గమనార్హం.

పెరిగిన రైతులు, సాగు, పంట రుణాలు..

రాష్ట్రంలో 2018తో పోల్చితే ప్రస్తుతం రైతుల సంఖ్య, సాగు భూమి విస్తీర్ణం పెరిగింది. దీంతో పంట రుణాలు తీసుకున్న వారి సంఖ్య కూడా పెరిగింది. కానీ ఇందుకు పూర్తి భిన్నంగా కాంగ్రెస్ సర్కారు రుణమాఫీలో రైతుల సంఖ్య భారీగా తగ్గించింది. రూ. లక్ష రుణం తీసుకున్న రైతుల సంఖ్యతో పోల్చితే రూ. 2 లక్షల రుణం తీసుకున్న వాళ్ల సంఖ్య సహజంగానే ఎక్కువ ఉండాలి. కానీ ఇందులోనూ సర్కారు మాయ చేసింది. 2018లో రైతుబంధు లెక్కల ప్రకారం రైతుల సంఖ్య 50 లక్షలు మాత్రమే. క్రమేనా ఈ సంఖ్య పెరిగింది. ప్రస్తుతం రైతుబంధు లెక్కల ప్రకారం రైతుల సంఖ్య సుమారు 70 లక్షలు. అంటే గడిచిన ఆరేండ్ల కాలంలో 20 లక్షల మంది రైతులు పెరిగారు. దీంతో పాటు రాష్ట్ర ఏర్పాటు సమయంలో సాగు భూమి విస్తీర్ణం 1.31 కోట్ల ఎకరాలు కాగా ప్రస్తుతం ఇది 2.38 కోట్ల ఎకరాలకు పెరిగింది. గడిచిన ఆరేండ్లలో సుమారు 32వేల కోట్ల పంట రుణాలు పెరిగాయి. 2018-19లో బ్యాంకులు రైతులకు రూ. 33వేల కోట్ల పంట రుణాలను మంజూరు చేస్తే గతేడాది రూ. 65వేల కోట్లు మంజూరు చేశాయి.

'లక్ష' మాఫీకి 36లక్షల మంది.. 2 లక్షలకు 22 లక్షలేనట!

2018లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. లక్ష వరకు రుణమాఫీ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందుకోసం 36.68 లక్షల మంది రైతులను అర్హులుగా గుర్తించింది. కాంగ్రెస్ సర్కారు రూ. 2 లక్షల రుణమాఫీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ హయాంతో పోల్చితే కాంగ్రెస్ రుణమాఫీకి రైతుల సంఖ్య పెరగాలి. కానీ తక్కువగా ఉండటం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేస్తున్నది. కాంగ్రెస్ సర్కారు 22.37 లక్షల మందికే రూ.2 లక్షల రుణమాఫీ చేసింది. అంటే బీఆర్‌ఎస్ లక్ష రుణమాఫీతో పోల్చితే కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీలో 14.31 లక్షల మంది రైతులు తగ్గడం గమనార్హం. బీఆర్‌ఎస్ రూ. లక్ష రుణమాఫీకి రూ. 19,198 కోట్లు కావాలని అంచనా వేస్తే కాంగ్రెస్ సర్కారు రూ. 2 లక్షల రుణమాఫీని రూ. 17,933 కోట్లతోనే పూర్తిచేసింది. బీఆర్‌ఎస్ లక్ష రుణమాఫీతో పోల్చితే కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీకి రూ.1265 కోట్లు తగ్గడం గమనార్హం.

40 వేల కోట్ల నుంచి 17వేల కోట్లకు

తొలుత రుణమాఫీకి రూ. 40వేల కోట్ల వరకు అవసరమవుతాయని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత రూ. 31వేల కోట్లు అని చెప్పారు. ఇక బడ్జెట్‌లో మాత్రం రూ. 26వేల కోట్లని పేర్కొన్నారు. అప్పుడే రుణమాఫీ నిధులపై అందరికీ సందేహాలు మొదలయ్యాయి. ఈ అనుమానాలను బలపరుస్తూ చివరికి ప్రభుత్వం చేసిన రుణమాఫీ కేవలం రూ. 17,933 కోట్లు మాత్రమే. దీనిద్వారా ప్రభుత్వం పూర్తిగా రుణమాఫీ చేయలేదని తేటతెల్లమైంది.

ఇదేనా మాఫీ?

ప్రభుత్వ లెక్కల ప్రకారం అర్హుల సంఖ్య: 32.5 లక్షలు

అవసరమైన నిధులు 31 వేల కోట్లు | మూడు విడతల్లో లబ్ధిదారులు : 22.2 లక్షలు

మూడు విడతల్లో వెచ్చించిన మొత్తం : రూ.17,869 కోట్లు

ప్రభుత్వ లెక్కల ప్రకారం మిగిలినవారు 10.3 లక్షలు

ఇంకా ఇవ్వాల్సిన నిధులు : రూ.13,131 కోట్లు

వాస్తవంగా రుణాలు పొందిన రైతులు : 70 లక్షలు | ఇంకా మాఫీ పొందాల్సినవారు : 47.8 లక్షలు

- 2018లో రైతుల సంఖ్య: 50 లక్షలు
- 2024లో రైతుల సంఖ్య : 70 లక్షలు
- నాడు సాగు భూమి : 1.31 కోట్ల ఎకరాలు
- నేడు సాగు భూమి : 2.38 కోట్ల ఎకరాలు

2018 పంట రుణాలు : 33వేల కోట్లు | 2024లో రుణాలు : 65వేల కోట్లు

- బీఆర్‌ఎస్ 'లక్ష' రుణమాఫీ అర్హులు : 36.68 లక్షలు, నిధులు : రూ.19,198 కోట్లు
- కాంగ్రెస్ 2 లక్షల రుణమాఫీ అర్హులు : 22.37 లక్షలు, నిధులు : రూ. 17,933 కోట్లు
- బీఆర్‌ఎస్‌తో పోల్చితే కాంగ్రెస్ రుణమాఫీలో 14.31 లక్షల మంది రైతులకు వాత, రూ.1265 కోట్ల కోత

ఇదీ రుణమాఫీ లెక్క (రైతుల సంఖ్య- లక్షల్లో, రుణం- రూ.కోట్లలో).

విడత	రుణ పరిమితి	రైతుల సంఖ్య	మాఫీ చేసిన రుణం
మొదటి విడత	లక్ష వరకు	11.34	6,034.96
రెండో విడత	1.5 లక్షల వరకు	6.40	6,190.01
మూడో విడత	2 లక్షల వరకు	4.46	5,644.24
మొత్తం	--	22.20	17,869.21

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నిన్న సాగు విప్లవం.. నేడు సావు సంకటం



వర్ధెల్లి వెంకటేశ్వర్లు

వెనుకటికెవరో... పంచ పాండవులు నాకు తెల్వదా.. మంచం కోళ్ల తీరు ముగ్గురే కదా అని రెండు చూపించి, ఒకటి రాయబోయి సున్నా సుట్టిండట! నా చిన్నప్పుడు మా హైస్కూల్ తెలుగు మాష్టారు తూపురాణి లక్ష్మణాచారి సార్ చెప్పేవారు. సార్ అప్పట్లో ఏ సందర్భంలో చెప్పారో నాకు గుర్తులేదు కానీ, ఇప్పుడు రైతు రుణమాఫీకి అచ్చు గుద్దినట్టు సరిపోయింది.

రూ.2 లక్షల పంట రుణాల హామీతో కాంగ్రెస్ పార్టీ కొలువు మీదికొచ్చింది. రేవంత్ రెడ్డి కూటమెక్కి పంట రుణమాఫీ రూ.40 వేల కోట్లని లెక్కలేసి, 'ఇదెంత పని ఏడాది పాటు కడుపు గట్టుకుంటే తీసి అవతల పారేత్తం' అని చెప్పి రూ.31 వేల కోట్లుగా నిర్ధారించి, బడ్జెట్‌లో 26 వేల కోట్లు పెట్టి, 17.9 వేల కోట్లే ఇచ్చి, పేద రైతులకు సున్నా సుట్టి తొడగొడుతున్నడు. ఇక రాజీనామా చెయ్ హరీష్‌రావు అని సవాల్ జేస్తున్నడు.

సంపూర్ణ రైతు రుణమాఫీ చేసినట్టు నిరూపిస్తే..! నేను సిద్ధమే అంటుండ్రు కేటీఆర్, హరీష్ రావు. నా నియోజకవర్గమో.. నీ నియోజకవర్గమో.. చెప్పు లెక్కలు తేలుద్దాం అంటున్నరు. ఇప్పటివరకు దొరికిన లెక్కల ప్రకారం ముఖ్యమంత్రి సొంతూరు కొండారెడ్డిపల్లి. ఆ ఊరు కల్వకుర్తి సహకార సంఘం బ్యాంక్ పరిధిలోకి వస్తుంది. ఈ బ్యాంకులో 1,407 మంది రైతులకు పంట రుణాలుంటే 2వ విడత నాటికి ఒక్కరికీ రుణ మాఫీ కాలేదు. మూడో విడత లబ్ధిదారులను వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. ఇటువంటి ఉదాహరణలు రాష్ట్రవ్యాప్తంగా లెక్కకు మించి ఉన్నాయి. బ్యాంకర్ల నివేదికల ప్రకారం.. ఇంకా 14.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వీళ్లంతా వ్యవసాయాధికారుల సుట్టూ తిరుగుతున్నరు. రోడ్ల మీదికి వస్తున్నరు. బ్యాంకుల ముందు ఆందోళన చేస్తున్నరు. రాజకీయ సవాళ్లు, ప్రతిసవాళ్లు ఎట్లా ఉన్నా... పెసరి చేలో పోగొట్టుకొని కూరటికల దేవులాడుకున్నట్టు ఉంది తెలంగాణ రైతాంగం అవస్థ. ఎవడు విసిరిన పాచికో.. ఏ కొనుగోళ్ల మాయలో పడ్డమో, ఏమో! మార్పు కావాలి.. మార్పు కావాలి అని పాలిచ్చే బర్రెను కాళ్ల తన్నుకున్నం. బతుకును బజాట్లె వేసుకున్నం.



ఈ నేపథ్యంలో ఓ సందర్భం గుర్తుకువస్తున్నది. 'నా వయస్సు ఇప్పుడు 64 ఏండ్లు. తెలంగాణ కావాలనుకున్నా.. తెచ్చినా. ఈ కీర్తే నాకు వెయ్యి జన్మల పుణ్యఫలం. కొట్లాడి తెచ్చుకున్నం. ఈన గాసి నక్కల పాలు కావద్దు. అది బంగారు తున్క గావాలె. కర్షకుని కన్నీళ్ల తుడిచే రైతురాజ్యం అవ్వాలె. అది రామరాజ్యంగా మారాలె. దుఃఖం లేని రైతు ముఖం చూడాలన్న ఆకాంక్ష తప్ప, నాకు ఎవరితో పంచాయితీ లేదు. కొట్లాట లేదు.' తెలంగాణ రాష్ట్ర సమితి 17వ ఆవిర్భావం వేళ ఓరుగల్లు వేదిక నుంచి కేసీఆర్ ఉద్వేగంగా ప్రసంగించారు.

వరంగల్ రైతుహిత సభ అనంతరం రాష్ట్రంలో సాగు విప్లవం వచ్చింది. మిషన్ కాకతీయ నీళ్లు పంట పొలాలకు అందినయి. దీనికితోడు కేసీఆర్ 2018లో పంట రుణాలకు లబ్ధిదారుల సంఖ్య పెంచారు. 36.68 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణ మాఫీ కోసమే రూ.19,198 కోట్లు ఖర్చుచేశారు. రైతుహిత సభ జరిగిన మరుసటి ఏడాదే.. అంటే, 2018లో రైతుబంధు పెట్టిండు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రైతుబంధుకు రూ.12 వేల కోట్ల బడ్జెట్‌ను పెట్టిండు. ఈ లెక్క కేసీఆర్ దిగిపోయేనాటికి రూ.64,940 కోట్లకు చేరుకున్నది. రైతులను అప్పుల భారం నుంచి విముక్తం చేస్తూ.. మళ్లీ అప్పుల ఊబిలో కూరుకుపోకుండా చేయాలన్న లక్ష్యంతో కేసీఆర్ రైతుబంధు పథకం తెచ్చిండు. రైతుబంధును కాంగ్రెస్ పార్టీ బద్నాం చేస్తూ వచ్చింది. కలిగినోళ్లకు కూడా రైతుబంధు పడుతుందనే విమర్శ చేస్తూ వచ్చింది. ఈ విమర్శ సన్న, చిన్నకారు రైతులను ఆకర్షించింది. అదే సమయంలో రాజకీయ వ్యూహకర్తల ముసుగులో బ్రోకర్లు పల్లెల్లోకి చొరబడ్డరు. ప్రత్యర్థి రాజకీయ పార్టీతో వేల కోట్ల రూపాయల ఒప్పందాలు చేసుకున్నరు. సోషల్‌మీడియా వేదికగా విషం చిమ్మిండ్రు. తెలంగాణ ఓటరును ఏమార్చిండ్రు. బ్రోకర్ల మాయలో సగటు ఓటరు దగా పడ్డడు.

> **బ్యాంకర్ల నివేదికల ప్రకారం.. ఇంకా 14.5 లక్షల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. వీళ్లంతా వ్యవసాయాధికారుల సుట్టూ తిరుగుతున్నరు. రోడ్ల మీదికి వస్తున్నరు. బ్యాంకుల ముందు ఆందోళన చేస్తున్నరు. రాజకీయ సవాళ్లు, ప్రతిసవాళ్లు ఎట్లా ఉన్నా... పెసరి చేలో పోగొట్టుకొని కూరటికల దేవులాడుకున్నట్టు ఉంది తెలంగాణ రైతాంగం అవస్థ.**

కాంగ్రెస్ వచ్చీరావటంతోనే కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టింది. 24 గంటల నిరంతర కరెంటును పండబెట్టింది. రైతుబంధు బందైంది. రైతు రుణమాఫీ ఎక్కిరిస్తున్నది. 14.5 లక్షల మంది రైతులను పక్కనపడేసి సంపూర్ణ రుణమాఫీ చేసినమని గప్పాలు కొట్టుకుంటున్నరు. కేసీఆర్ రూ.ఒక లక్ష రుణమాఫీనే 36 లక్షల మంది రైతులకు ఇస్తే... ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీకి కేవలం 22.37 లక్షల మందే అని చెప్పటం మోసం కాదా? సర్కారు చేతిలో మోసపోయిన రైతాంగం దిక్కుతోచక మళ్లీ ఆత్మహత్యల వైపు మొగ్గితే, ఆ ఉసురు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే తాకుతుంది. తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పంటచేను కాడి కాపలాదారుడై సాగు విప్లవం తీసుకొస్తే... మలి ప్రభుత్వం పంటను సావు సంకటంగా మారుస్తున్నది.

రాజకీయ అరాచకత్వం



కె.లక్ష్మణ్‌గౌడ్
97049 30509

గత వైభవం ఎంతో గాని ప్రస్తుత రాజకీయ కాలుష్యం అవధుల్లేని దురాగతాల పాలై విలవిల్లాడుతున్నది. పరనింద-ఆత్మస్తుతి పరాకాష్ఠకు చేరి సత్యమేదో, అసత్యమేదో సామాన్యుడు గ్రహించజాలని దుర్దశ రాజకీయాల్లో దాపురించింది.

చట్టసభల్లో, సామాజిక మాధ్యమాల్లో, విభిన్న ఛానెళ్లలో ఎడతెరిపి లేని చర్చలు, విశ్లేషణలు ఆయా రాజకీయ పార్టీలకు తొత్తులుగా సాగుతాయే కానీ, సార్వజనీన సత్యాలు గాలికి వదిలివేస్తున్నాయి. సత్యదూరమైన విష ప్రచారాలకు బానిసలై కాలాతీతమైన ప్రజాభ్యుదయాన్ని పరిగణనలోకి తీసుకోలేకపోతున్నాయి.

> **దశాబ్దకాలంగా ఉప్పెనై ఉప్పొంగిన అభ్యుదయాన్ని అపహాస్యం చేస్తూ పదవీలాలసత పొందుతున్నారు రాజకీయ నాయకులు. ప్రజా సంక్షేమంతో ముడిపడ్డ ప్రజా ప్రభుత్వాలు ప్రణాళికా రచనల్లో ప్రజాభ్యుదయ రాజకీయాలకు అంకితమై జనరంజకంగా సాగవలసిన పరిపాలన ప్రజా కంటకంగా మారితే దిక్కెవరు?**

రాజ్యాంగబద్ధ ప్రమాణాలు, న్యాయవ్యవస్థ స్థిరీకరించిన సత్సాంప్రదాయాలు నేలమట్టమై కేవలం వ్యక్తిగతం రాజ్యమేలే దుష్ట సంప్రదాయాలకు చట్టసభలు నిలయాలైతే సంస్కరించేదెవరు? ఒక స్థాయిలో ఉన్న ప్రజా నాయకులే ఉచ్ఛరించ వీలుకాని పద ప్రయోగాలకు చట్టసభలు వేదికలా? తర్కం ఎక్కడైతే విఫలమౌతుందో అక్కడ భౌతిక దాడి దాపురిస్తుంది. (Physical force comes into exforce where the logic fails) గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ అహంభావం, అరాచకం రాజ్యమేలిందంటూ మేధావులు ప్రచారాస్త్రాలను సంధిస్తున్నారు. కానీ, జాతీయ, అంతర్జాతీయ అధికార నివేదికలు దశాబ్దకాలంగా తెలంగాణ రాష్ట్ర ప్రగతిని వేనోళ్ల ప్రశంసిస్తూ ప్రకటించిన వివరాలు ఈ కండ్లున్న కబోదులకు కనిపించడం లేదా?

సమాజ శ్రేయస్సు కాంక్షించే మేధావివర్గం నిర్లిప్తంగా, నిద్రాణంగా గత ప్రభుత్వాన్ని కూలదోయడంలో క్రియాశీలక పాత్ర పోషించింది. కానీ, నేటి దుస్థితిని ఎందుకు ప్రతిఘటించలేకపోతున్నది? సమాజ సంరక్షకులుగా కీర్తించబడుతున్న మేధావులు తమ పాత్ర బలంగా పోషిస్తూ ఈ దారుణాలను నివారించే ప్రయత్నం చేయాలి. చట్టసభల్లో చేసే వాదాలు-వివాదాలపై పోస్ట్‌మార్టం చేయగల మేధోసంపత్తి గల చింతనాపరులు వారు తమ ఏకాంతానికే పరిమితమైన మేధో పరిమళాలతో ప్రస్తుత రాజకీయ కాలుష్యాన్ని నివారించడంలో మార్గ నిర్దేశనం చేయాలి. అప్పుడే పరిస్థితిలో మార్పు గణనీయంగా రాగలదు.

సిద్దిపేట అంటేనే పోరాటాల గడ్డ. ఎన్నో ఉద్యమాలు ఆ మట్టిలోనే పురుడుపోసుకున్నాయి. పద్నాలుగేండ్ల పాటు కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమంలో ముందుండి నడిచిన సిద్దిపేట, ఆ తర్వాత పదేండ్ల ప్రగతిపథంలోనూ అందరికీ ఆదర్శంగా నిలిచింది. అలాంటి సిద్దిపేట గడ్డ కాంగ్రెస్ కుతంత్రాలకు, డైవర్షన్ రాజకీయాలకు వేదికగా మారడం గమనార్హం.

దాడులతో నిజాలను దాచలేరు!



చిటుకుల మైసారెడ్డి
94905 24724



అబద్ధపు హామీలతో అందలమెక్కిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకైనా తన తీరును మార్చుకోవడం లేదు. దుష్ప్రచారాలు చేస్తూ అభూత కల్పనలను సృష్టిస్తున్నది. ఇంకా చెప్పాలంటే.. అధికార పీఠమెక్కాక ఆ పార్టీ ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను చేయనట్టు, పూర్తికానటువంటి రుణమాఫీ పూర్తయినట్టు ప్రచారం చేయడమే అందుకు నిదర్శనం.

రాజకీయాల్లో విమర్శలు-ప్రతివిమర్శలు, ఆరోపణలు-ప్రత్యారోపణలు, సవాళ్లు-ప్రతిసవాళ్లు సహజం. కానీ, అవి కాస్త హద్దు మీరితేనే అసలు సమస్య. రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్, మాజీ మంత్రి హరీశ్‌రావు చేసుకున్న సవాల్ గురించి తెలిసిందే. ఇచ్చిన మాటను నిలబెట్టుకోని కాంగ్రెస్ సర్కార్ సిద్దిపేటలో దాడులకు తెగబడుతూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నది. ఓ దిక్కు రైతులందరికీ రుణమాఫీ చేయాలని ప్రతిపక్ష బీఆర్‌ఎస్ పోరాడుతుంటే.. ఇంకో దిక్కు హరీశ్‌రావు రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ నానా హంగామా చేస్తున్నది. ఆ పార్టీ నాయకులు ఏకంగా సిద్దిపేట ఎమ్మెల్యే కార్యాలయంపై దాడిచేసి చర్చను పక్కదోవ పట్టించారు. దీనంతటి వెనుక ఎవరున్నారో ప్రజలకు తెలుసు.

ఒకేసారి రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి.. 22 లక్షల మంది రైతులకే రుణమాఫీ చేసిన కాంగ్రెస్ సర్కార్ సుమారు 60 శాతం మంది రైతులకు కుచ్చుటోపీ పెట్టింది. రూ.17 వేల కోట్ల రుణాలనే మాఫీ చేసినట్టు సీఎం రేవంత్ చెప్తుండటమే అందుకు నిదర్శనం.

హరీష్‌రావు రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేయడం హాస్యాస్పదం. పంద్రాగస్టులోపు రైతులందరి రుణాలను మాఫీ చేయాలని, ఆరు గ్యారంటీలను అమలుచేయాలని ఆయన సవాల్ చేశారు. ఇప్పటికీ ఆ మాట మీదే నిలబడ్డారు. చెప్పింది చేయలేకపోయిన కాంగ్రెస్ నేతలే మాట తప్పి ప్రభుత్వ ఆస్తులపై దాడులకు పాల్పడుతున్నారు. అసలు హరీశ్‌రావు సవాలు చేసిన అంశాన్ని పూర్తిస్థాయిలో కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదు. వాటిలో ముఖ్యమైన రుణమాఫీ అసలు పూర్తికాలేదు. ఇక, ఆరు గ్యారంటీలను వేరే చెప్పనక్కర్లేదు.

తమ నిర్వాకంతో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని గ్రహించిన కాంగ్రెస్ దాడులను ప్రోత్సహిస్తున్నది. సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై శుక్రవారం అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడటం శోచనీయం. కార్యాలయం ధ్వంసం అవుతుండగా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. ఈ ఘటన వెనుక కాంగ్రెస్ రాష్ట్ర నేతల హస్తం ఉన్నదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష బీఆర్‌ఎస్‌ను టార్గెట్ చేస్తూ వస్తున్నది. కేసీఆర్, హరీశ్‌రావు, కేటీఆర్, ఇతర బీఆర్‌ఎస్ నాయకులపై నిందారోపణలు చేస్తూ దాడులకు ఉసిగొల్పుతున్నది. ఈ నేపథ్యంలోనే సిద్దిపేట క్యాంప్ కార్యాలయంపై దాడి జరిగింది. ఇది రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చ.

రుణమాఫీ విషయమై ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులు నిలదీస్తుంటే కాంగ్రెస్ సర్కార్‌కు మింగుడు పడటం లేదు. ప్రతీ రైతు రుణాన్ని మాఫీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్ హామీ ఇచ్చారు. హామీ ఇచ్చిన 8 నెలలకు గాని రుణమాఫీ ప్రక్రియ చేపట్టలేదు. అది కూడా కొర్రీలు పెట్టి, కోతలు కోశారు. క్యాబినెట్ సమావేశంలో రూ.31 వేల కోట్లు, బడ్జెట్ సమయంలో రూ.26 వేల కోట్లు అని చెప్పిన రేవంత్.. చివరాఖరికి రూ.17 వేల కోట్ల రుణాలనే మాఫీ చేశారు. 45 లక్షల నుంచి 22 లక్షలకు లబ్ధిదారుల సంఖ్యను పరిమితం చేశారు. ఇంకా సగం మంది రుణాలు మాఫీ కాలేదు. ఈ విషయమై కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్‌ఎస్ బాణం ఎక్కుపెట్టింది. రైతుల పక్షాన నిలిచింది. కేటీఆర్, హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, నాయకులు ఊపిరాడకుండా చేస్తుండటంతో కాంగ్రెస్ ఆత్మరక్షణలో పడిపోయింది. అందుకే బీఆర్‌ఎస్ నేతలపై దాడులకు దిగుతున్నది. అధికార పార్టీ నాయకులే ప్రభుత్వ కార్యాలయాలపై దాడులు చేస్తుంటే బాధితులను ఎవరు కాపాడాలి? ప్రజల ఆస్తులను ఎవరు రక్షించాలి? ఇలాంటి దాడులు ప్రజాస్వామ్యానికే ప్రమాదకరం. వీటిని ప్రజాస్వామికవాదులు ఖండించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఈ ఘటనకు సంబంధించి ముఖ్యమంత్రే బాధ్యత తీసుకోవాలి.

ఒకవేళ హరీశ్‌రావు రాజీనామా చేస్తే.. ఆయనను మళ్లీ అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు సిద్దిపేట ప్రజలు సిద్ధంగా ఉన్నారు. కానీ, బీఆర్‌ఎస్ బీఫామ్‌తో గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి పోటీలోకి దింపేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందా అని ఈ సందర్భంగా నేను ప్రశ్నిస్తున్నా? సదరు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ పార్టీ రాజీనామా చేయించి, ఉప ఎన్నికలకు వెళ్తే ప్రజలు ఎవరిపక్షాన ఉన్నరనే విషయం తేలిపోతుంది. అంతేకానీ, చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రతిపక్ష బీఆర్‌ఎస్ నాయకులపై దాడులకు పాల్ప డుతామంటే ప్రజలు చూస్తూ ఊరుకోరు. కాంగ్రె స్ పార్టీకి తగినరీతిలో బుద్ధి చెపారు.

ముందు రిజర్వేషన్లు ఆ తర్వాతే ఎన్నికలు!

తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి గారికి బహిరంగ లేఖ

విషయం: కులగణన చేపట్టడం గురించి.

గౌరవనీయులైన రేవంత్‌రెడ్డి గారికి నమస్కారం..

బీసీలు అధికారానికి, అవకాశాలకు, అభివృద్ధికి నోచుకోకుండా వెనుకబడిన కులాలుగానే మిగిలిపోతున్నారు. దురదృష్టవశాత్తు ఆధిపత్య వర్గాల పార్టీలు ఎప్పుడూ బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి తప్ప ఏనాడూ వారికి తగినంత ప్రాతినిధ్యం కల్పించడం లేదు. పార్టీలు తమ అధికార, ధన, కుల బలాన్ని ఉపయోగించి బీసీలను ఓటర్లుగానే పరిగణిస్తున్నాయి. ఒకరిద్దరికి అవకాశాలు కల్పించి మొత్తం బీసీల కోసమే ప్రభుత్వం పనిచేస్తున్నట్టు భ్రమలు కల్పిస్తున్నారు.

1961 జనాభా లెక్కల ప్రకారమే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. ఇక బీసీ రిజర్వేషన్లు రాష్ట్రానికో రకంగా ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఇస్తుంటే.. బీసీలకు మాత్రం జనాభాలో సగం నిష్పత్తికే ఇస్తున్నారు. మండల్ కమిషన్ ప్రకారం.. దేశంలో బీసీలు 52 శాతం ఉండగా.. రిజర్వేషన్లు మాత్రం 27 శాతమే అమలవుతున్నాయి. ఇక ఓసీల జనాభా చాలా తక్కువ ఉన్నప్పటికీ ఏ సర్వే లేకుండానే నేరుగా ఎస్టీల కంటే ఎక్కువగా 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంట్‌లలో ఎస్సీ, ఎస్టీలకే రిజర్వేషన్లు అమలవుతున్నాయి. తమకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

> **తెలంగాణలో బీసీలు 60 శాతానికి పైగా ఉంటారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో కలిపితే 93 శాతం ఉంటారు. ప్రజాస్వామ్యంలో మెజారిటీ వర్గాలదే రాజ్యాధికారం. అంటే ఈ లెక్కన 60 శాతం ఉన్న బీసీలకే రాజ్యాధికారం దక్కాలి కదా! దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీసీలు ముఖ్యమంత్రులుగా పనిచేశారు. కానీ, ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటివరకు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఒక్క బీసీ వ్యక్తి కూడా ముఖ్యమంత్రి కాలేదు. రాజ్యాంగం కల్పించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికి రాజకీయ పార్టీలు కట్టుబడటం లేదు. రాజకీయ నాయకుల మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన ఉండదు.**

2022లో ఉదయ్‌పూర్‌లో జరిగిన సమావేశంలో మీ (కాంగ్రెస్) పార్టీ కులగణనకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం సంతోషకరం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపట్టి సామాజిక న్యాయం చేస్తామని భారత్ జోడో యాత్రలో మీ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పదే పదే చెప్పారు. అలాగే మీరు కూడా కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే జనాభా ప్రాతిపదికన బీసీ రిజర్వేషన్లను పెంచుతామని కూడా హామీ ఇచ్చారు. అంతేకాదు, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతో పాటు బీసీ సబ్‌ప్లాన్‌ను తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే తెస్తామన్నారు. అంతేకాకుండా, బీసీల అభివృద్ధికి ఏటా రూ.20 వేల కోట్ల చొప్పున ఐదేండ్లలో రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తామని వాగ్దానం చేశారు. ప్రతి జిల్లాలో బీసీ భవన్‌తో పాటు రుణాలు, మండలానికో బీసీ గురుకులం ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు.

సాక్షాత్తూ అసెంబ్లీ సాక్షిగా మీరు చెప్పిన మాటలను మీకు గుర్తుచేస్తున్నాను. 'బలహీనవర్గాలను బలోపేతం చేయడమే మా ఉద్దేశం. ఇంతకాలం పాలితులుగా ఉన్నవారిని రాబోయే రోజుల్లో పాలకులుగా తయారు చేయడమే మా లక్ష్యం. కులగణన చేపట్టి రాజకీయ ప్రాధాన్యంతో పాటు జనాభాకు తగ్గట్టుగా అభివృద్ధికి నిధులు కేటాయిస్తాం' అని మీరు హామీ ఇచ్చారు. మీ హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయే తప్ప అమల్లోకి రావడం లేదు.


ఈ సందర్భంగా మీకో విషయం గుర్తుచేయదలుచుకున్నాను. 2021లో జనగణనలో బీసీల కులగణన కూడా చేయాలని నాటి సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. 'సమాజంలోని పేదవర్గాల సముద్ధరణను దృష్టిలో ఉంచుకొని, నిరుపేదలకు లబ్ధి చేకూర్చడం కోసం వివిధ సంక్షేమ చర్యలు చేపట్టడానికి కచ్చితమైన గణాంకాలు నిర్వహించాల్సి ఉన్నది. సాంఘికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల పౌరులకు సంబంధించి రాజ్యాంగంలోని సెక్షన్ 15 రూల్ 4, 5, సెక్షన్ 16 రూల్ 4, సెక్షన్ 243 (టీ) రూల్ 6 మేరకు 2021 సాధారణ జనాభా లెక్కలను నిర్వహించేటప్పుడు కులాలవారీగా వెనుకబడిన తరగతుల జనాభా లెక్కలను నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ శాసనసభ కోరుతున్నది' అని తీర్మాన పత్రాన్ని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ సభలో చదివి వినిపించారు.

చివరిగా మిమ్మల్ని నేను కోరుతున్నది ఒక్కటే. కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ హామీ మేరకు మీ ప్రభుత్వం తక్షణమే సమగ్ర కులగణన చేపట్టి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీఆర్‌ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నా. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బీసీల వాటా ఎంతో తేల్చాలి. బీసీ డిక్లరేషన్ పేరిట ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన మీరు ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే దాదాపు 24 వేల మంది బీసీలు అదనంగా ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా మారుతారు. ఈ నేపథ్యంలో కులగణన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నా.

అలాగే బీసీల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి 2024-25 పద్దులో రూ.9,200 కోట్లు మాత్రమే కేటాయించడాన్ని బట్టి చూస్తే.. మీకు బీసీల పట్ల చిత్తశుద్ధి లేదనే విషయం అర్థమవుతున్నది. మీరు ఇచ్చిన హామీ మేరకు బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని, ఎంబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నా. ఇలాగే మీరు కాలయాపన చేస్తే ఏ బీసీలైతే మిమ్మల్ని అధికార పీఠంపై కూర్చోబెట్టారో అదే బీసీలు గద్దె దింపడం ఖాయం.



బూడిద బిక్షమయ్య గౌడ్
బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే





రాజకీయం చేస్తున్న బీజేపీ!

కోల్‌కతా ఘటనను నిరసిస్తూ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళన చేస్తున్నారు. కానీ, బీజేపీ మాత్రం ఈ అంశాన్ని రాజకీయం చేస్తున్నది. ఆ ఘటన గురించి పదే పదే మాట్లాడుతున్న బీజేపీ నేతలు.. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇంటికి సమీపంలో ఓ దళిత మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయాన్ని మాత్రం ఎక్కడా ప్రస్తావించడం లేదు.

\- అఖిలేశ్ యాదవ్, యూపీ మాజీ సీఎం

యూరియా కోసం రైతన్న అవస్థలు



వరంగల్ జిల్లా రాయపర్తి లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వద్ద శనివారం యూరియా బస్తాల కోసం రైతులు బారులుతీరారు. మండలంలోని 40 గ్రామ పంచాయతీలకు చెందిన రైతులు ట్రాక్టర్లు, ఆటోలు, బైక్‌లు, ఎడ్లబండ్లతో వందల సంఖ్యలో తరలివచ్చి ఉదయం నుంచి సాయంత్రం వరకు పడిగాపులు కాశారు. ప్రైవేట్ దుకాణదారులను ఆశ్రయిస్తే బస్తాకు రూ.340 నుంచి రూ.350 వసూలు చేస్తున్నారని, అంతేగాక యూరియా కావాలంటే మరో ఎరువును కొనాల్సిందేనని కొర్రీలు పెడుతున్నారని మండిపడుతున్నారు. – రాయపర్తి

పెండింగ్ బిల్లులు అడిగితే..మాజీ సర్పంచ్ అరెస్ట్



పెండింగ్ బిల్లులు చెల్లించాలని పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి మాజీ సర్పంచ్ సముద్రాల రమేశ్–వాణి దంపతులు శనివారం కలెక్టరేట్‌లోని ఇన్‌వార్డ్ వద్ద ఆందోళనకు దిగారు. చెల్లించకపోతే ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించారు. ఇప్పటివరకు 50 సార్లు వచ్చి కలెక్టర్, జిల్లా అధికారులను కలిసినా రూ.30 లక్షలు చెల్లించడం లేదన్నారు. పోలీసులు రమేశ్ దంపతులతోపాటు వాణి తల్లిని అదుపులోకి తీసుకొని పెద్దపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు.
– పెద్దపల్లి, (నమస్తే తెలంగాణ)

ఎమ్మెల్సీ సుభాశ్‌రెడ్డికి కేసీఆర్ శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి శనివారం ఎర్రవెల్లిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తన పుట్టినరోజును పురస్కరించుకొని కేసీఆర్ ఆశీస్సులు తీసుకున్నారు.
– హైదరాబాద్, (నమస్తే తెలంగాణ)

హరీశ్ ఆఫీస్‌పై కాంగ్రెస్ దౌర్జన్యం



సిద్దిపేటలో బీఆర్ఎస్ కార్యకర్తలపై పోలీసుల లాఠీచార్జ్



సిద్దిపేటలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మొదటిపేజీ తరువాయి...

కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను తొలిగించాలని మున్సిపాలిటీలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో బీఆర్ఎస్ నాయకులు బీజేఆర్ చౌరస్తాలో ఆందోళన చేయగా, కాంగ్రెస్ నాయకులు వచ్చి గొడవ చేశారు. ఫ్లెక్సీలను తొలిగించి గొడవ కాకుండా చూడాల్సిన పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసి సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌కు శుక్రవారం అర్ధరాత్రి తరలించారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు రెచ్చిపోయి బీజేఆర్ చౌరస్తా సమీపంలో ఉన్న హరీశ్‌రావు క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలను చింపి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులకు విషయం తెలిసి పీఎస్ గేట్ ఎదుట ధర్నా చేశారు. కాంగ్రెస్ నాయకులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. అయినా కాంగ్రెస్ కార్యకర్తలను పోలీస్‌స్టేషన్‌కు తరలించలేదు. అర్ధరాత్రి 3గంటలకు బీఆర్ఎస్ నాయకులను సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

భారీగా తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

దాడిని నిరసిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జీలు ధరించి క్యాంపు కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వైపు ర్యాలీగా బయలుదేరారు. పాత బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు బైఠాయించగానే పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత ఏర్పడింది. రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలుపుతున్న సమయంలో పోలీసులు కాంగ్రెస్ నాయకులను అరెస్టు చేసి ఆ దారి గుండా తీసుకెళ్తుండడంతో బీఆర్ఎస్ నాయకులను చూసి కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. దీంతో ప్రతిగా బీఆర్ఎస్ నాయకులు నినాదాలు చేశారు. కాంగ్రెస్ నాయకులు మళ్లీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. క్యాంప్ ఆఫీసుపై కాంగ్రెస్ జెండా, రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీ పెట్టే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కాంగ్రెస్ నాయకులను అడ్డుకోవడంతో ఉద్రిక్తత మొదలైంది. కాంగ్రెస్ నాయకులను పోలీస్ స్టేషన్లకు తరలించారు.

మైనంపల్లి హస్తం...?

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి వెనుక మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు హస్తం ఉందని చర్చ జరుగుతున్నది. సిద్దిపేటలో రాజకీయపరంగా ఎవరు ఏ పార్టీలో ఉన్నా దాడుల సంస్కృతి లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. సిద్దిపేటలో మైనంపల్లి పర్యటన చేస్తూ తన గుండాలతో చిల్లర ప నులు చేయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిద్దిపేట వన్ టౌన్ సీఐకి 20 సార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని, పోలీసులు కాంగ్రెస్‌కు కొమ్ముకాస్తున్నారని మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పాల సాయిరాం, మచ్చ వేణుగోపాల్‌రెడ్డి ఆరోపించారు. క్యాంపు కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిపై కలెక్టర్, సీపీని కలిసి బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు.

అడ్డుకోవాల్సిన పోలీసులే రక్షణా?: హరీశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): సిద్దిపేట ఎమ్మెల్యే అధికారిక నివాసంపై అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు దాడి చేసి ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేయడం దారుణమని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. దాడిని అడ్డుకోవాల్సిన పోలీసులే దుండగులను రక్షించడం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఎమ్మెల్యే నివాసంపైనే ఇంత దారుణంగా దాడి జరిగిందంటే, ఇక సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి? ప్రశ్నించారు. డీజీపీ చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మల దహనం

న్యూస్‌నెట్‌వర్క్, ఆగస్టు 17: అధికార బలంతో కాంగ్రెస్ గూండాలు క్యాంప్ కార్యాలయంపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బీఆర్ఎస్ శ్రేణులు కన్నెర్ర చేశాయి. సిద్దిపేటపలో, దుబ్బాకలో బస్టాండు వద్ద, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు పాత బస్టాండ్ సెంటర్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.

సిద్దిపేటలో ఇరువర్గాలపై కేసు నమోదు

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలోకి కాంగ్రెస్ కార్యకర్తలు అత్తుమామ్, మహ్మద్ గౌస్, నవాజ్‌బాబా, మున్నా అక్రమంగా చొరబడి క్యాంప్ ఆఫీస్ ఫ్లెక్సీ బోర్డును చింపివేశారు. హరీశ్‌రావు పీఏ ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ కార్యకర్తలపై పలు సెక్షన్ల కింద సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు కేసు నమెదు చేశారని సిద్దిపేట ఏసీపీ మధు తెలిపారు. కాగా.. శనివారం అకారణంగా పలువురు బీఆర్ఎస్ నేతలపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేశారు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు మండిపడుతున్నాయి.



సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద హరీశ్‌రావుకు ఘనస్వాగతం పలుకుతున్న అభిమానులు, బీఆర్ఎస్ శ్రేణులు

అసెంబ్లీ టైగర్ హరీశన్న

- సిద్దిపేటలో మిన్నంటిన నినాదాలు
- ఘనస్వాగతం పలికిన కార్యకర్తలు

సిద్దిపేట, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి నేరుగా సిద్దిపేట అధికారిక క్యాంపు కార్యాలయానికి భారీ కా న్వాయ్‌తో ఎమ్మెల్యే హరీశ్‌రావు శనివారం సాయంత్రం చేరుకున్నారు. అప్పటికే అభిమానులు, పార్టీ శ్రేణులతో కోలహాలంగా క్యాంప్ కార్యాలయం మారింది. క్యాంప్ కార్యాలయానికి హరీశ్‌రావు చేరుకోగానే బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. హరీశ్‌రావు జిందాబాద్, అసెంబ్లీ టైగర్ హరీషన్న అంటూ,.. సీఎం రేవంత్‌రెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. కార్యకర్తలు హరీశ్‌రావును ఎత్తుకొని అసెంబ్లీ టైగర్ అంటూ గట్టిగా నినదించారు. మహిళా నాయకులు తిలకం దిద్ది స్వాగతం పలికారు. అక్కడి నుంచి సిద్దిపేట ఎన్జీవో భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో హరీశ్‌రావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పరాకాష్ట

- హరీశ్ ఆఫీస్‌పై కాంగ్రెస్ దాడి పిరికిపందల చర్య: కేటీఆర్



హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆఫీస్‌పై కాంగ్రెస్ గుండాల దాడిని పిరికిపందల చర్యగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. దాడిని తీవ్రంగా ఖండించారు. పదేండ్లుగా రాష్ట్రం రాజకీయ హింసకు దూరంగా ఉన్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ థర్డ్ రేటెడ్ నీచ రాజకీయాలను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలు సరైన సమయంలో బుద్ధి చెప్తారని హెచ్చరించారు. 'ఒకవైపు రాహుల్ గాంధీ మొహబ్బత్ కా దుకాణ్ అని మాట్లాడుతుంటే ఆయన పార్టీ తెలంగాణలో నఫ్రత్ కా దుకాణ్ అంటూ హింసను ప్రేరేపిస్తున్నది. రాజ్యాంగ పరిరక్షకుడిని అని ప్రకటించుకున్న రాహుల్ గాంధీ చేస్తున్న రాజ్యాంగ విలువల పరిరక్షణ ఇదేనా ? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు.

వైద్యారోగ్యశాఖలో ఇన్‌చార్జీ పాలన రద్దు

3 హెచ్‌వోడీ పోస్టులు మంజూరు

హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ): వైద్యారోగ్య శాఖలో ఇన్‌చార్జుల పాలన వ్యవస్థను ప్రభుత్వం రద్దు చేసింది. 3 హెచ్‌వోడీ పోస్టులను మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర ఏర్పాటు తరువాత వైద్యారోగ్యశాఖలో డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ పోస్టులను మంజూరు చేయలేదు. ఇన్‌చార్జి అధికారులను కొనసాగిస్తూ వచ్చారు.

బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జిగా అభయ్‌పాటిల్!

హైదరాబాద్, ఆగస్టు17(నమస్తే తెలంగాణ): బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా అభయ్ పాటిల్ వైపే బీజేపీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్టు సమాచారం. రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా తరుణ్ చుగ్ కొనసాగారు. అయితే పార్లమెంట్ ఎన్నికలకు తెలంగాణ ఇన్‌చార్జిగా అభయ్‌పాటిల్‌ను నియమించింది. ఆయన సారథ్యంలో బీజేపీ 8ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది. దీంతో తరుణ్ చుగ్ స్థానంలో అభయ్ కుమార్ పాటిల్‌నే బీజేపీ ఇన్‌చార్జిగా కొనసాగించాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ఆర్టీసీ హామీలు అమలుచేయాలి

- ఆర్టీసీ జేఏసీ నేతల వినతి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలతోపాటు దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు 31 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని శనివారం డిప్యూటీ సీఎం భట్టి, రవాణా శాఖ మంత్రి పొన్నం, లేబర్ కమిషనర్‌కు అందజేశారు. ప్రభుత్వంలో ఆర్టీసీ ఉద్యోగుల విలీనం, సంస్థలో ట్రేడ్ యూనియన్ల పునరుద్ధరణ, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాల అమలు, వేతన సవరణ వంటి డిమాండ్లను ప్రభుత్వం ముందుంచారు. ఆ 31 డిమాండ్లలో 6 డిమాండ్లను వారంలోగా అమలు చేస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ చైర్మన్ థామస్‌రెడ్డి, కన్వీనర్ మౌలానా, కో కన్వీనర్లు యాదయ్య, సురేశ్, యాదగిరి పాల్గొన్నారు.

10 వేల కోట్ల ఎస్డీఎఫ్ పనులు రద్దు

- 33 జిల్లాల పనులను రద్దుచేసిన రేవంత్ సర్కారు
- గ్రౌండింగ్ కాని పనులను రద్దుచేసినట్టు వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిన ఎస్డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) పనులు లెక్క తేలింది. 33 జిల్లాల్లో 34,511 పనులను రేవంత్‌రెడ్డి సర్కారు నిలిపివేసింది. దీంతో 2014–15 నుంచి 2023–24 వరకు సుమారు రూ.10 వేల కోట్లకు పైగా విలువైన పనులకు బ్రేక్ పడింది. ప్రజల ఏండ్ల పోరాటం తర్వాత మంజూరైన అనేక పనులు మొదలు కాకముందే కాలగర్భంలో కలిసిపోయినట్టయింది. అనుమతులు లభించినా పనులు మొదలుకాలేదనే సాకుతో ప్రభుత్వం వాటిని రద్దుచేసింది. మొదలైన కొన్ని అభివృద్ధి పనులకూ సర్కారు మంగళం పలికింది. ఇప్పటికే ప్రారంభమైన పనులను తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు కొనసాగించొద్దని ఆదేశాలిచ్చింది. వీటితోపాటు ఆన్ గోయింగ్ ప్రాజెక్టులకు సైతం మెజార్టీ బిల్లుల చెల్లింపులు నిలిపివేసింది. ఎస్డీఎఫ్ నిధులతో చేపట్టిన పనులు, పథకాల్లో ప్రారంభం కాని పనులను పూర్తిగా రద్దు చేశారు. తద్వారా వేలాది పనులు ప్రారంభం కాకముందే రద్దయ్యాయి. ఒక్క పంచాయతీరాజ్ శాఖలోనే 2,800 పనులు మంజూరైనా ప్రారంభం కాలేదని అధికారవర్గాలు చెప్తున్నాయి. వీటి విలువ రూ.2,100 కోట్ల వరకు ఉంటుందని తెలిసింది. మున్సిపల్, రోడ్లు, భవనాలు, నీటిపారుదల తదితర శాఖలపరిధిలో చేపట్టిన వేలాది పనులను ప్రభుత్వం రద్దుచేసింది. ఫలితంగా మంచిర్యాల జిల్లాలో 2,205, మెదక్ జిల్లాలో 2,145, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,094 అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. 33 జిల్లాల్లో 34,511 పనులకు రేవంత్ సర్కార్ అడ్డుకట్ట వేసింది.

అసెంబ్లీలో ప్రశ్నించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

'గత ప్రభుత్వం వివిధ శాఖలవారీగా ఎస్డీఎఫ్ కింద చేపట్టిన అభివృద్ధి పనులను ఈ ప్రభుత్వం రద్దు చేసిందా? అత్యవసర పనులనూ రద్దుచేశారా? జిల్లాలవారీగా, శాఖలవారీగా రద్దుచేసిన పనుల వివరాలను ఇవ్వండి' అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, కమలాకర్, కృష్ణమోహన్‌రెడ్డి, గోపీనాథ్ ఇటీవలే అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి తాజాగా ఆర్థికశాఖలోని ఫైనాన్స్, ప్లానింగ్ విభాగం సమాధానం ఇచ్చింది.

జిల్లాలు	రద్దయిన పనులు	జిల్లాలు	రద్దయిన పనులు
ఆదిలాబాద్	-5	ములుగు	-6
భద్రాద్రి కొత్తగూడెం	-2,094	నాగర్‌కర్నూల్	-1,927
హనుమకొండ	-391	నల్లగొండ	-434
హైదరాబాద్	-19	నారాయణ్‌పేట	-236
జగిత్యాల	-818	నిర్మల్	-1,804
జనగామ	-304	నిజామాబాద్	-1,258
జయశంకర్ భూపాలపల్లి	-20	పెద్దపల్లి	-525
జోగులాంబ గద్వాల	-773	రాజన్న సిరిసిల్ల	-192
కామారెడ్డి	-1,087	రంగారెడ్డి	-1,549
కరీంనగర్	-1,939	సంగారెడ్డి	-1,065
ఖమ్మం	-4,299	సిద్దిపేట	-189
కుమ్రంభీం ఆసిఫాబాద్	-1,612	సూర్యాపేట	-1,351
మహబూబాబాద్	-1,380	వికారాబాద్	-1,873
మహబూబ్‌నగర్	-436	వనపర్తి	-476
మంచిర్యాల	-2,205	వరంగల్	-1,558
మెదక్	-2,145	యాదాద్రి భువనగిరి	-400
మేడ్చల్ మల్కాజిగిరి	-141	మొత్తం	-34,511

2014–15 నుంచి 2023–24 వరకు ఎస్డీఎఫ్ కింద చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులను మాత్రమే రద్దు చేసినట్టు తెలిపింది. పనులకు అనుమతులు లభించినా ప్రారంభించకపోవడంతో నిలిపివేసినట్టు ప్రకటించింది. ఏమైనా అత్యవసరమైన పనులు కూడా రద్దయినట్టు ఆయా జిల్లాల యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొస్తే వాటిని పరిశీలించి నిధులు కేటాయించే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది.

'పోడు' మార్గదర్శకాలు రూపొందించండి

అధికారులకు మంత్రి కొండా సురేఖ ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 17(నమస్తే తెలంగాణ) : పోడు భూముల సమస్యలకు శాశ్వత ముగింపు పలికేలా మార్గదర్శకాలు రూపొందించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. పోడు భూముల సమస్యలపై శనివారం సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి సమీక్ష నిర్వహించారు. పోడు భూములు ఎన్ని ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి? ఎంతమందికి పోడు పట్టాల పంపిణీ జరిగింది? పోడు పట్టాలు పొందిన వారిలో అనర్హులెవరైనా ఉన్నారా? తదితర అంశాలపై కలెక్టర్లు నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. పోడు భూముల హక్కుల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తు ఆన్‌లైన్‌లో నమోదుకావాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, మురళీనాయక్, అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ (హెచ్‌ఓఎఫ్‌ఎఫ్) డోబ్రియాల్, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలుసింగ్ మేరు, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్ ఉన్నారు.

కలెక్టర్ల నేతృత్వంలో ఎఫ్ఆర్సీలు..

ఏజెన్సీ, మైదాన ప్రాంత ఎమ్మెల్యేలతో మంత్రులు సీతక్క, సురేఖ శనివారం సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెండింగ్ పోడు దరఖాస్తులను క్లియర్ చేసేందుకు కలెక్టర్ల నేతృత్వంలో అటవీ, గిరిజన శాఖలు స్థానిక ప్రజలతో అటవీ హక్కుల కమిటీలు(ఎఫ్ఆర్సీలు) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి శరత్, అటవీ శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్లు, డీఎఫ్‌ఓలు, ఐటీడీఏ పీఓలు ఉన్నారు.

ఒకే బస్సులో 170 మంది ప్రయాణం

- రన్నింగ్‌లో ఊడిన బస్సుచక్రాలు
- ప్రయాణికులకు తప్పిన ప్రమాదం



ఊడిపోయిన బస్సు రైట్ సైడ్ టైర్లు

జగిత్యాల రూరల్, ఆగస్టు 17: ఆర్టీసీ బస్సు పరిమితి 47 మంది కాగా.. శనివారం ఏకంగా 170 మంది ప్రయాణికులను ఎక్కించుకొని డ్రైవర్, కండక్టర్ జగిత్యాల నుంచి ప్రయాణికులతో నిర్మల్‌కు వస్తున్నారు. ఓవర్ లోడ్ కారణంగా జగిత్యాల రూరల్ మండలం మోరపెల్లి శివారుకు చేరుకోగానే.. బస్సు వెనుక రైట్ సైడ్ రెండు టైర్లు ఊడిపోయాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు తెలిపారు. పరిమితికి మించి ఎక్కించుకొని తీసుకెళ్లడంపై మండిపడుతున్నారు. అనుకోని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యులని, వెంటనే అదనపు బస్సులు నడిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

'ఓవర్సీస్'కు ఆన్‌లైన్ దరఖాస్తులు

అక్టోబర్ 13 వరకు గడువు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం ద్వారా ఎస్సీ విద్యార్థులకు ఆర్థిక సాయం కోసం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైనట్టు శనివారం ఆ శాఖ ఉన్నతాధికారులు ప్రకటన జారీచేశారు. అక్టోబర్ 13వరకు గడువు ఉన్నట్టు పేర్కొన్నారు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5 లక్షల కంటే ఎక్కువగా ఉండవద్దని సూచించారు. యూఎస్ఏ, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, యూకే, సింగపూర్, జపాన్, దక్షిణకొరియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలలో ఉన్నత విద్య అభ్యసించవచ్చని, అందుకు రూ.20 లక్షలు ఆర్థికసాయం అందజేస్తామని పేర్కొన్నారు. కుటుంబం నుంచి ఒక్కరు మాత్రమే అర్హులని వెల్లడించారు. గ్రాడ్యుయేషన్‌లో 60 శాతం మార్కులు సాధించడంతోపాటు జీఆర్ఈ/జీమ్యాట్, ఇంగ్లిష్ ప్రావీణ్యత పరీక్షలో అర్హత స్కోర్ ఉండాలని నోటిఫికేషన్‌లో తెలిపారు. అర్హులు https://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్‌లో భగ్గుమన్న వర్గపోరు

- మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకున్న సరిత అనుచరులు
- సరిత ఇంటికి జూపల్లి
- సీఎం వద్దకు గద్వాల పంచాయితీ



గద్వాల జిల్లా కేంద్రంలో మంత్రి జూపల్లి కాన్వాయ్‌ను అడ్డుకుంటున్న సరిత వర్గీయులు

గద్వాల/గట్టు/గద్వాల అర్బన్, ఆగస్టు 17: గద్వాల నియోజకవర్గంలోని కాంగ్రెస్‌లో వర్గపోరు భగ్గుమన్నది. శనివారం ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జూరాల, నెట్టెంపాడ్, ర్యాలంపాడ్, గట్టు ఎత్తిపోతల పనులను పరిశీలించడానికి ప్రభుత్వ సలహాదారుడు ఆదిత్యానాథ్‌తో కలిసి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఈ విషయమై స్థానిక కాంగ్రెస్ నాయకురాలు సరితకు సమాచారం లేకపోవడంతో.. ఆమె వర్గీయులు ఈదమ్మ గుడి, చింతలపేట కాలనీ సమీపంలో రోడ్డుపైకి వచ్చి మంత్రి కారును అడ్డుకున్నారు. పోలీసులు ఆందోళనకారులను వెళ్లగొట్టడానికి ప్రయత్నించినా వినలేదు. ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకొని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులు రాళ్లు రువ్వగా మంత్రి కాన్వాయ్‌పై పడ్డాయి. కాన్వాయ్ దిగిన కృష్ణమోహన్‌రెడ్డి తన ఇంటికి వెళ్లిపోయారు. చేసేది లేక మంత్రి ఒక్కరే సరిత ఇంటికి చేరుకోవడంతో ఆందోళన సద్దుమణిగింది. ఎమ్మెల్యే పార్టీలో చేరడానికి తాము వ్యతిరేకం కాదని, కాంగ్రెస్ కండువా కప్పుకొని అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనాలని మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని సీఎం వద్దకు తీసుకెళ్తానని మంత్రి హామీ ఇవ్వడంతో మంత్రితో కలిసి సరిత ప్రాజెక్టుల పరిశీలనకు వెళ్లారు. జూపల్లితో సమావేశమైన అనంతరం సరిత కార్యకర్తలతో మాట్లాడారు. ఈ ప్రాంతానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్యాయం చేయరన్న నమ్మకం తనకు ఉన్నదని చెప్పారు. 'మనకు ఓట్లు వేసిన వాళ్లకు అన్యాయం జరగొద్దని నోరు మూసుకొని కూర్చున్నా.. ఈ మౌనం మీకు అన్యాయం జరగనంత వరకే ఉంటుంది. ఒక వేళ మీకు అన్యాయం జరిగితే నేను నోరు విప్పుతా. ఎమ్మెల్యే పార్టీలో చేరడాన్ని మనం వ్యతిరేకించొద్దు అంటూ సరిత కార్యకర్తలకు సూచించారు. మంత్రి కాన్వాయ్‌ను ఎమ్మెల్యే బండ్ల, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత వాహనాలు అనుసరించాయి. ఎమ్మెల్యే కాన్వాయ్‌లోని ఓ వాహనం వెనుక సరిత అనుచరుల వెహికిల్ ఉండగా.. ఓవర్‌టేక్ చేసేందుకు దారి ఇవ్వలేదని ఒకరు ఎమ్మెల్యే కాన్వాయ్‌ను అడ్డగించాడు. కారుపై దాడి చేయగా.. వాహనం అద్దం ధ్వంసమైంది. గద్వాల లోని క్యాంప్ కార్యాలయంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కొందరు రౌడీమూకలు మంత్రి పర్యటనను అడ్డుకోవడం బాధాకరమని విమర్శించారు. గద్వాల అభివృద్ధి కోసం ప్రయత్నం చేస్తుండగా కొందరు స్వార్థ రాజకీయం కోసం ఆటంకాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు.

ఉద్యోగం లేదని యువకుడి ఆత్మహత్య

పెండ్లికి రెండు రోజుల ముందు విషాద ఘటన



డిచ్‌పల్లి, ఆగస్టు 17: రెండు రోజుల్లో పెండ్లి చేసుకోవాల్సిన యువకుడు ఉద్యోగం లేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. మిట్టాపల్లికి చెందిన మాసిపెద్ది ప్రశాంత్ (29) బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. తల్లిదండ్రులు బోధన్ ప్రాంతానికి చెందిన అమ్మాయితో ప్రశాంత్‌కు పెండ్లి నిశ్చయించారు. ఈ నెల 18న పెండ్లి జరగాల్సి ఉంది. ఈ నెల 15న ప్రశాంత్ మండల కేంద్ర శివారులోని గాయత్రీ ఎన్‌క్లేవ్ వద్దకు చేరుకొని స్నేహితుడికి ఫోన్ చేశాడు. బీటెక్ పూర్తయినా ఇప్పటికీ ఉద్యోగం రాలేదని, పెండ్లి చేసుకున్న తర్వాత భార్యను ఎలా పోషించాలని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పాడు. స్నేహితుడు వారించేలోగా ప్రశాంత్ ఫోన్ స్విచ్చాఫ్ చేసి పురుగు మందు తాగాడు. స్నేహితుడు వెంటనే విషయాన్ని ప్రశాంత్ కుటుంబసభ్యులకు తెలిపాడు. పోలీసులు.. చివరి కాల్ లోకేషన్‌ను ట్రేస్ చేసి గాయత్రీ ఎన్‌క్లేవ్ వద్దకు చేరుకోగా ప్రశాంత్ అపస్మారక స్థితిలో కనిపించాడు. కుటుంబీకులు జిల్లా కేంద్రంలోని ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు. శనివారం డిచ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దవాఖాన నిర్వాహకులు యువకుడి మృతిపై సమాచారం ఇవ్వకపోవడం నేరమని, కేసు దర్యాప్తు చేసి దవాఖాన నిర్వాహకులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్సై మహేశ్ తెలిపారు.



వరంగల్‌లో జోస్ ఆలుక్కాస్ ఏర్పాటు చేసిన షోరూంను ప్రారంభిస్తున్న సినీనటి కీర్తి సురేశ్. చిత్రంలో జోస్ ఆలుక్కాస్ మేనేజింగ్ డైరెక్టర్లు వర్ఘీస్ ఆలుక్కా, పాల్ జె ఆలుక్కా, జాన్ ఆలుక్కా, తదితరులు. ఈ సందర్భంగా రూ.60 వేల విలువైన కొనుగోళ్లకు ప్రోత్సాహకంగా బంగారు నాణేన్ని ఉచితంగా సంస్థ అందిస్తున్నది. అలాగే వజ్రాలపై 20 శాతం, ప్లాటినం ఆభరణాలపై 7 శాతం తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు.

భగ్గుమన్న బంగారం

తులంపై రూ.1,200 వరకు పెరిగిన ధర



హైదరాబాద్, ఆగస్టు 17: బంగారం ధర మళ్లీ భగ్గుమన్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు దూసుకుపోవడంతో దేశీయ ధరలు పుంజుకున్నాయి. వచ్చే నెల సమీక్షలో ఫెడరల్ రిజర్వులు వడ్డీరేట్లను అర శాతం వరకు తగ్గించే అవకాశం ఉన్నట్లు వచ్చిన సంకేతాలు మదుపరులు తమ పెట్టుబడులను అతి సురక్షితమైన పుత్తడివైపు మళ్లించారు. దీంతో గ్లోబల్ మార్కెట్లో ఒకే రోజు ఔన్స్ ధర రెండు శాతం వరకు పెరిగాయి. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో తులం పుత్తడి ధర అయితే ఏకంగా రూ.72 వేలు దాటింది. శుక్రవారం ముగింపుతో పోలిస్తే 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 24 క్యారెట్ పదిగ్రాముల బంగారం ధర రూ.1,150 అధికమై రూ.72,770 పలికింది. అటు 22 క్యారెట్ ధర కూడా రూ.1,050 అధికమై రూ.66,700కి చేరుకున్నది. బంగారంతో పాటు వెండి పరుగులు పెట్టింది. కిలో వెండి రూ.2000 అధికమై రూ.91 వేలు పలికింది. అంతకుముందు ఇది రూ.89 వేలుగా ఉన్నది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ లేకపోయినప్పటికీ ధరలు పెరగడం విశేషం. మరోవైపు పండుగ సీజన్, పెళ్లిళ్ల సీజన్ కావడంతో కొనుగోళ్లు ఊపందుకున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు.

పెద్ద లావాదేవీలపై ఐటీ దృష్టి

హోటళ్లు, హాస్పిటల్స్‌ల్లో జరిగే లావాదేవీలపై దృష్టి సారించాలని సీబీడీటీ సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 17: దేశవ్యాప్తంగా పెద్ద మొత్తంలో జరిగే నగదు లావాదేవీలపై కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఆందోళన వ్యక్తంచేసింది. ముఖ్యంగా హోటళ్లు, లగ్జరీ బ్రాండ్ విక్రయ స్టోర్లు, హాస్పిటళ్లు, ఐవీఎఫ్ క్లినిక్స్‌ల్లో పెద్ద మొత్తంలో నగదు లావాదేవీలు జరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించాలని ఆదాయ పన్ను మంత్రిత్వ శాఖకు కీలక సూచన చేసింది కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ). 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను సీబీడీటీ విడుదల చేసిన వార్షిక ప్రణాళికలో ఈ విషయాన్ని స్పష్టంచేసింది. సాధారణంగా రూ.2 లక్షలకు పైబడి నగదు లావాదేవీలు జరిగితే ఆ వివరాలు ఆర్థిక సంస్థలకు నివేదించాల్సి ఉంటుందని సీబీడీటీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కానీ నిబంధనలను అతిక్రమించి పెద్ద మొత్తంలో లావాదేవీలు జరుగుతున్నాయని, వీటిపై ప్రధానంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని ఐటీ శాఖకు సూచించింది. అలాగే పెద్ద మొత్తంలో జరిగే ఆర్థిక లావాదేవీలకు ఖచ్చితంగా పాన్ కార్డు జత చేయాల్సి ఉండగా, వీరు ఎలాంటి కార్డు వివరాలు ఇవ్వకుండానే జరుపుతున్నారని, దీనివల్ల ఆదాయ పన్ను శాఖకు భారీ నష్టం జరుగుతున్నదని, వీటిని మోస పూరిత లావాదేవీలుగా గుర్తించి వీటిపై చర్యలు తీసుకోవాలని సూచించింది.



లైంగికదాడులపై స్పందించలేదేం?

- **ఎనిమిది నెలలుగా మహిళా కమిషన్ ఏమైంది?**
- **మహిళా ఎమ్మెల్యేలను సీఎం అవమానిస్తే ఎటుపోయింది?**
- **సంస్కారంతో మహిళలకు కేటీఆర్ క్షమాపణలు**
- **అయినా రాజకీయ లబ్ధి కోసం ఆయనపై విమర్శలు**
- **మాజీమంత్రులు సబిత, సునీతాలక్ష్మారెడ్డి, సత్యవతి**



తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ వాణీదేవి

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే మహిళా కమిషన్ ఎందుకు స్పందించలేదని మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. మహిళా ఎమ్మెల్యేలను అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి అవమానపర్చినప్పుడు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. తన ప్రసంగంలో దొర్లిన పొరపాటుకు కేటీఆర్ బహిరంగంగా క్షమాపణ కూడా చెప్పారని, అయినా మహిళా కమిషన్ నోటీసులు ఇవ్వటం ఏమిటని అన్నారు. శనివారం తెలంగాణభవన్‌లో మాజీమంత్రులు సునీతా లక్ష్మారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ వాణీదేవి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ముక్తవరం సుశీలారెడ్డితో కలిసి సబితాఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. హుందాతనంతో క్షమాపణ చెప్పిన కేటీఆర్‌ను మహిళాలోకం స్వాగతిస్తున్నదని.. అయినా కొందరు మహిళా నేతలు ఏదేదో మాట్లాడుతున్నారని అభ్యంతరం వ్యక్తంచేశారు. ఇద్దరు మహిళా మంత్రులు, మహిళా కమిషన్ వేగంగా స్పందించారని.. 8 నెలల్లో మహిళలపై 1,800 లైంగిక దాడులు, హత్యలు జరిగితే ఎందుకు స్పందించలేదని నిలదీశారు. అత్యాచారానికి గురైన ఒక్క మహిళనైనా పరామర్శించారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో సీఎం, డిప్యూటీ సీఎం తమను అనకూడని మాటలంటే ఈ మహిళా కమిషన్, మంత్రులు ఎక్కడికి వెళ్లారని కడిగిపారేశారు. కేటీఆర్‌కు కేసీఆర్ సంస్కారం నేర్పారు కాబట్టే క్షమాపణ చెప్పారని, సీఎం రేవంత్‌కు ఎవరూ సంస్కారం నేర్పినట్టు లేరని చురకలంటించారు. గతంలో అసెంబ్లీ సాక్షిగా డీకే అరుణకు కేటీఆర్‌తో కేసీఆర్ క్షమాపణ చెప్పించారని.. ఇది తమ సంస్కారమని అన్నారు. హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడిని ఖండిస్తున్నామన్నారు. సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ పైచేయి సాధించటంలో కేటీఆర్, హరీశ్‌రావు పాత్ర ప్రముఖంగా ఉన్నదని.. అందుకే వారిని సీఎం, కాంగ్రెస్ నేతలు టార్గెట్ చేస్తున్నారన్నారు. హరీశ్‌రావు ఒత్తిడితోనే ఈ మాత్రం రుణమాఫీ అయ్యిందని స్పష్టంచేశారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సచివాలయం దగ్గర తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టినపుడే మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం అవమానించిందన్నారు. మహిళలకు ఈ 8 నెలల్లో కాంగ్రెస్ చేసింది శూన్యమని విమర్శించారు. కొండా సురేఖ, సీతక్క కాంగ్రెస్ నుంచి రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవుపలికారు. వాణీదేవి మాట్లాడుతూ బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు సీఎం క్షమాపణ చెప్పకుండా మిగతా విషయాలు మాట్లాడటం దండగ అన్నారు.

'అంబేద్కర్ ఓవర్సీస్'కు విశేష ఆదరణ

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): గిరిజన విద్యార్థుల విదేశీ విద్యకోసం అమలుచేస్తున్న అంబేద్కర్ ఓవర్సీస్ పథకానికి పూర్తిస్థాయి ఆదరణ లభిస్తున్నది. తొలుత 50 మంది లక్ష్యంగా ప్రారంభించిన పథకాన్ని ప్రస్తుతం ఏటా 100 మంది వినియోగించుకుంటున్నారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం 2014-15లో అంబేద్కర్ ఓవర్సీస్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఒక్కో విద్యార్థి విదేశీ విద్యకోసం రూ.20 లక్షల వరకు మంజూరు చేశారు. 2022-23 సంవత్సరంలో ఈ పథకాన్ని ఏటా 100 మందికి అమలు చేయాలని నిర్ణయించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) నుంచి ఏటా 250 మంది గిరిజన విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనే ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఆ శాఖ ఉన్నతాధికారులు కోరుతున్నారు.

చట్టవిరుద్ధంగా 'మార్గదర్శి' డిపాజిట్ల సేకరణ

- **హైకోర్టులో ఆర్బీఐ కౌంటర్**

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ప్రజల నుంచి మార్గదర్శి చిట్ ఫండ్స్ కంపెనీ చట్టవిరుద్ధంగా డిపాజిట్లను సేకరించిందని హైకోర్టులో ఆర్బీఐ కౌంటర్ దాఖలు చేసింది. తమ సంస్థపై 2008లో నాటి ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ వేసిన వ్యాజ్యాన్ని కొట్టివేయాలని కోరుతూ మార్గదర్శి అధినేత రామోజీరావు, ఫైనాన్సియర్లు గతంలో పిటిషన్లు దాఖలు చేశారు. దీంతో మార్గదర్శిపై విచారణను నిలిపివేస్తున్నట్టు ఉమ్మడి హైకోర్టు ప్రకటించింది. దీన్ని సవాల్ చేస్తూ ఉండవల్లి సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో ఉమ్మడి హైకోర్టు తీర్పును రద్దు చేసింది. ఈ కేసు విచారణ పూర్తి చేయాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆర్బీఐ తరఫున సుభేందు దాస్ కౌంటర్ దాఖలు చేశారు. హిందూ అవిభాజ్య కుటుంబం పేరుతో చిట్ ఫండ్ కంపెనీని నెలకొల్పి, డిపాజిట్లు సేకరించడం చట్టవ్యతిరేకమని ఆ కౌంటర్‌లో పేర్కొన్నారు. ఆర్బీఐ చట్టంలోని 45ఎస్(1), 45ఎస్(2) సెక్షన్లకు విరుద్ధంగా మార్గదర్శి సంస్థ ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించిందని తప్పుపడుతూ.. రామోజీరావు తదితరుల పిటిషన్లను కొట్టివే

'ఏసీబీ కేసులో ఆస్తులను నిందితుడే నిరూపించుకోవాలి'

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఆదాయానికి మించి ఆస్తులను కూడబెట్టడంపై ఏసీబీ నమోదు చేసిన కేసులో ఆ ఆస్తులు ఎలా వచ్చాయో నిరూపించుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పింది. ఈ కేసులో మాజీ పోస్టుమ్యాన్ సురేందర్‌కు దిగువ కోర్టు విధించిన మూడేండ్ల శిక్షను ఏడాదికి తగ్గించింది. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్న సురేందర్‌ను జైలుకు పంపాలని స్పష్టం చేసింది.

సుఖేశ్‌గుప్తాకు చుక్కెదురు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఎంబీఎస్ జ్యువెలర్స్ అధినేత సుఖేశ్‌గుప్తాపై సీబీఐ కేసును కొట్టివేసేందుకు హైకోర్టు నిరాకరించింది. ఎంఎంటీసీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన ఈ కేసును కొట్టివేయాలంటూ సుఖేశ్‌గుప్తా దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. బంగారం సరఫరాకు సంబంధించి ఎంఎంటీసీ అధికారులతో కలిసి ఆ సంస్థకు సుకేశ్‌గుప్తా రూ.194 కోట్ల నష్టం కలిగించినట్టు సీబీఐ తన చార్జిషీట్‌లో అభియోగాలు మోపినందున కింది కోర్టులో పిటిషనర్ విచారణను ఎదుర్కోవాల్సిందేనని జస్టిస్ కే సుజన తేల్చిచెప్పారు.

సివిల్ సర్వెంట్స్‌ను బెదిరిస్తారా?

సీఎం సొంత మీడియా తీరుపై కేటీఆర్ ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): ఆల్ ఇండియా సర్వీస్‌కు చెందిన అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి తన మీడియా ద్వారా బెదిరింపులకు పాల్పడటమేమిటని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. సీఎంకు చెందిన మీడియా సంస్థగా చెప్పబడుతున్న ఓ టీవీ చానెల్ ప్రతినిధి ఐపీఎస్ ఆఫీసర్ కమలాసన్‌రెడ్డిని ఇబ్బందిపెట్టే విధంగా వ్యవహరించిన వీడియోను ఆయన ఎక్స్ ద్వారా షేర్ చేశారు. నిజాయితీ గల ఆఫీసర్‌గా పేరున్న కమలాసన్‌రెడ్డిని కావాలనే ఇబ్బంది పెడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తుందని, ఇది దిగ్భ్రాంతికరమని అన్నారు. ఇలాంటి చర్యలు అధికారుల మనో నిబ్బరాన్ని దెబ్బతీస్తాయని, దీనికి కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'పావనీ.. కాపాడుకోలేకపోయినందుకు క్షమించు'

సూర్యాపేట ఘటనపై కేటీఆర్ ఆవేదన

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): తండ్రిపై కండ్లెదుటే పాశవికంగా దాడి జరుగుతుంటే చూడలేక సాయం కోసం రోదించి 14 ఏళ్ల పావని చనిపోయిన సంఘటనపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా ఢీ కొత్తపల్లిలో భూతగదాలతో సోమయ్య అనే వ్యక్తిపై భార్య, కూతురు ముందే ముగ్గురు వ్యక్తులు దాడికి తెగబడ్డారని, తండ్రిని కాపాడుకునేందుకు పావని విలవించి స్పృహ తప్పి చనిపోయిందనే వార్త తెలిసినప్పటి నుంచి మనసంతా భారంగా ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పావని కుటుంబానికి కేటీఆర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'పావని నిన్ను కాపాడుకోలేకపోయినందుకు క్షమించు' అని కేటీఆర్ ఆవేదన చెందారు.

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరుపెట్టాలి

- **నేడు జయంతి సందర్భంగా ప్రకటించాలి**
- **మాజీ మంత్రి, శ్రీనివాస్‌గౌడ్**

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం సర్వాయి పాపన్న జయంతి సందర్భంగానే ఆయన పేరిట జిల్లా పేరు ప్రకటించాలని కోరారు. తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పల్లె రవి, రామచంద్రు నాయక్, రాంనర్సయ్యతో కలిసి ఆయన మాట్లాడారు. సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని గతంలో సీఎంగా కేసీఆర్ నిర్ణయించారని, మూడు కోట్లు కేటాయిస్తూ జీవో ఇచ్చారని, ఆ మేరకు విగహం ఏర్పాటుకు ప్రస్తుత ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఖిలాషాపూర్‌ను పర్యాటకంగా తీర్చిదిద్దామని, ఆయన చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని ప్రయత్నం చేసినట్టు తెలిపారు.

గడువులోగా దాఖలు చేయని బిడ్‌ను స్వీకరించకపోవడం సబబే: హైకోర్టు

హైదరాబాద్, ఆగస్టు 17 (నమస్తే తెలంగాణ): సింగరేణి బొగ్గు సరఫరా కోసం సకాలంలో దాఖలు చేయని బిడ్‌ను స్వీకరించకపోవడం సబబేనని హైకోర్టు తీర్పు చెప్పింది. సాంకేతిక కారణాల వల్ల ఆన్‌లైన్‌లో గడువులోగా బిడ్‌ను సమర్పించలేకపోయినందున తన బిడ్‌ను స్వీకరించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ కొత్తగూడెం వాసి కిశోర్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. గడువు దాటాక బిడ్లను స్వీకరించడం టెండర్ నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నది. అధికారులు దురుద్దేశపూరితంగా టెండర్‌ను తిరస్కరించినట్టయితేనే న్యాయస్థానాన్ని ఆశ్రయించే హక్కు ఉంటుందని, ఇక్కడ ఆ పరిస్థితి లేదని స్పష్టం చేసింది.

యాదవ మహాసభ యువజన అధ్యక్షుడిగా యశ్వంత్



హైదరాబాద్, ఆగస్టు17 (నమస్తే తెలంగాణ) : యాదవ మహాసభ రాష్ట్ర యువజన అధ్యక్షుడిగా గొర్ల యశ్వంత్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు బద్దుల బాబురావుయాదవ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ యాదవ్ యశ్వంత్‌కు శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ.. తనకు అవకాశం కల్పించిన యాదవ మహాసభ రాష్ట్ర కార్యవర్గానికి, జిల్లాల అధ్యక్షులు, ముఖ్యనేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

చిత్రం



నార్నే నితిన్ హీరోగా నటించిన 'ఆయ్' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. అంజి కే మణిపుత్ర దర్శకత్వంలో బన్నీ వాస్ నిర్మించారు. శనివారం అగ్ర హీరో ఎన్టీఆర్‌ను చిత్ర యూనిట్ సభ్యులు కలుసుకున్నారు. బాక్సాఫీస్ వద్ద గట్టిపోటీ ఉన్నా ఈ సినిమా అద్భుత విజయం సాధించిందని, వినోదం, సందేశం కలబోసిన మంచి కాన్సెప్ట్‌తో రూపొందించారని చిత్ర బృందాన్ని ఎన్టీఆర్ అభినందించారు.

'చాంపియన్' మొదలైంది



రోషన్ కథానాయకుడిగా ప్రదీప్ అద్వైతం దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం 'ఛాంపియన్' శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి అగ్ర దర్శకుడు నాగ్‌అశ్విన్ క్లాప్‌నిచ్చారు. ఈ సినిమాలో హీరో రోషన్ పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుందని, కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయని చిత్రబృందం పేర్కొంది. ఈ సినిమా కోసం రోషన్ కంప్లీట్ మేకోవర్ అయ్యారని, ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ సినిమాపై అంచనాలను పెంచిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.మది, ఆర్ట్: తోట తరణి, నిర్మాణ సంస్థలు: స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్, దర్శకత్వం: ప్రదీప్ అద్వైతం.

దడపుట్టించే డిమాంటీ



అరుల్‌నిధి, ప్రియ భవానీశంకర్ జంటగా నటించిన హారర్ థ్రిల్లర్ 'డిమాంటీ కాలనీ 2'. అజయ్ ఆర్.జ్ఞానముత్తు దర్శకుడు. విజయసుబ్రహ్మణ్యన్, ఆర్.సి.రాజ్‌కుమార్ నిర్మాతలు. ఈ నెల 15న తమిళంలో విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతున్న ఈ సినిమా ఈ నెల 23న తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే తెలుగులో విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వస్తున్నదని, సినిమాకు కూడా అదే స్పందన వస్తుందని నమ్మకంతో ఉన్నామని మేకర్స్ తెలిపారు. ఆన్తి జాస్కెలైనెస్, సెరింగ్ డోర్జీ, అరుణ్ పాండియన్, ముత్తుకుమార్, మీనాక్షి గోవింద్‌రాజన్, సరనో ఖాలిద్, అర్చన రవిచంద్రన్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: హరీశ్ కన్నన్, సంగీతం: సామ్ సీఎస్.




ధగధగలాడుతున్న బంగారు నిధి

పవన్‌కల్యాణ్ 'హరిహరవీరమల్లు' సినిమా కొత్త షెడ్యూల్ ఈ నెల14 నుంచి మొదలైన విషయం తెలిసిందే. జ్యోతికృష్ణ దర్శకత్వంలో ఏ.దయాకరరావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఏ.ఎం.రత్నం సమర్పకుడు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన యుద్ధ సన్నివేశాలను దర్శకుడు జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. ఇదిలా వుంటే.. ఈ సినిమాలో కథానాయికగా నటిస్తున్న నిధి అగర్వాల్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమాలోని ఆమె పాత్రకు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో నిధి బంగారు చీరలో, ఒంటినిండా నగలతో మెరిసిపోతూ కనిపిస్తున్నది. పేదలకోసం రాజులను కొల్లగొట్టే రాబిన్‌హుడ్ తరహా పాత్రలో పవన్‌కల్యాణ్ నటిస్తున్న ఈ చిత్రంలో బాబీడియోల్, అనుపమ్‌ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: మనోజ్ పరమహంస, సంగీతం: ఎం.ఎం.కీరవాణి, కళ: తోట తరణి, నిర్మాణం: మెగా సూర్య మూవీస్.

సందేశాత్మక కథతో 'అభినవ్'



స్వీయ దర్శకనిర్మాణంలో భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందిస్తున్న బాలల చిత్రం 'అభినవ్'. ఇటీవల ఈ చిత్ర ట్రైలర్‌ను ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు భరత్ భూషణ్ ఆవిష్కరించారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని, మాదకద్రవ్యాల మాఫియాను అణచివేయాలనే సందేశాత్మక కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. విద్యార్థి దశ నుంచే ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సీసీ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లలో శిక్షణ పొంది దేశ రక్షణలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నదే ఈ సినిమా ప్రధాన ఉద్దేశ్యమని దర్శకనిర్మాత భీమగాని సుధాకర్‌గౌడ్ తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: వందేమాతరం శ్రీనివాస్.



సూపర్ న్యాచురల్ జటాధర

సుధీర్‌బాబు నటించనున్న తాజా చిత్రానికి 'జటాధర' అనే టైటిల్ ఖరారు చేశారు. వచ్చే ఏడాది మహాశివరాత్రి కానుకగా ఈ సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు శివన్ నారంగ్, ప్రేరణా అరోరా, ఉజ్వల్ ఆనంద్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. చేతిలో త్రిశూలంతో పవర్‌ఫుల్‌గా సుధీర్ బాబు ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సూపర్ న్యాచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి తీసుకెళ్లే కథాంశమిదని, ఈ కథకు 'జటాధర' టైటిల్ పర్‌ఫెక్ట్ యాప్ట్ అని చిత్ర దర్శకుడు వెంకట్ కల్యాణ్ తెలిపారు. ప్రీప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని, టాప్ టెక్నీషియన్స్ పని చేయనున్నారని, త్వరలో షూటింగ్ మొదలుపెడతామని మేకర్స్ తెలిపారు.



ప్రభాస్ చారిత్రక చిత్రం

'కల్కి 2898 ఏడీ' చిత్రంతో అపూర్వ విజయాన్ని సొంతం చేసుకున్నారు అగ్ర హీరో ప్రభాస్. అదే ఉత్సాహంతో ఆయన వరుస సినిమాలను పట్టాలెక్కిస్తున్నారు. ప్రభాస్ కథానాయకుడిగా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం శనివారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇమాన్వి కథానాయికగా పరిచయమవుతున్నది. 1940 నేపథ్యంలో నడిచే ఈ కథలో ప్రభాస్ వారియర్ పాత్రలో కనిపిస్తారని చెబుతున్నారు. సీనియర్ నటులు మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటించనున్నారు. భారీ వ్యయంతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నామని, త్వరలో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సుధీప్ ఛటర్జీ, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, ప్రొడక్షన్ డిజైనర్: రామకృష్ణ-మోనిక, వీఎఫ్ఎక్స్: కమల్ కన్నన్, రచన-దర్శకత్వం: హను రాఘవపూడి.

శివన్న బైలింగ్వల్



కన్నడ అగ్రనటుడు శివరాజ్‌కుమార్ నటిస్తున్న కన్నడ, తెలుగు బైలింగ్వల్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం శనివారం లాంఛనంగా మొదలైంది. కార్తీక్ అద్వైత్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, సుధీర్.పి నిర్మాతలు. ఇందులో శివరాజ్‌కుమార్ అత్యంత శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, హై బడ్జెట్‌తో తెరకెక్కనున్న యాక్షన్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: ఎ.జె.శెట్టి, సంగీతం: సామ్ సిఎస్, సమర్పణ: పద్మజ ఫిల్మ్స్ ఇండియా ప్రై.లిమిటెడ్, నిర్మాణం: భువనేశ్వరి పిక్చర్స్.



సినిమా చూసి రివ్యూ రాస్తా!

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకుడు. డా|| మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మాతలు. ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. శుక్రవారం అగ్ర నిర్మాత దిల్ రాజు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన..సినిమా కాన్సెప్ట్ బాగుందని, జర్నలిస్ట్ మిత్రులైన ప్రభు, రాంబాబు నిర్మాణ పర్యవేక్షణలో సినిమా తెరకెక్కడం ఆనందంగా ఉందని, ఈ సినిమా చూసి తాను రివ్యూ రాస్తానని అన్నారు. సెన్సార్ వాళ్లు కూడా చిత్రాన్ని మెచ్చుకున్నారని జర్నలిస్ట్ ప్రభు తెలిపారు.

సుకుమార్ మాటలు ధైర్యాన్నిచ్చాయి!



రావు రమేష్ టైటిల్ రోల్ పోషించిన 'మారుతినగర్ సుబ్రమణ్యం' ఈ నెల 23న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు లక్ష్మణ్ కార్య శనివారం పాత్రికేయులతో మాట్లాడుతూ 'ఈ కథ చెప్పగానే రావుగారు రమేష్ నవ్వుతూ ఓకే చేశారు. ఇక ఈ కథ విషయానికొస్తే ..ఓ రోజు నా భార్య అకౌంట్‌లో 80 వేలు క్రెడిట్ అయ్యాయి. ఎవరు వేశారో తెలియదు. రెండు రోజుల తర్వాత ఫారిన్‌లో వున్న మా అత్తగారే డబ్బులేశారని తెలిసింది. ఆ రెండు రోజులు ఇంట్లో జరిగిన విషయాలన్నీ సరదాగా అనిపించాయి. వాటి స్ఫూర్తితో ఈ కథ రాసుకున్నా. ఇందులో రావు రమేష్ మిడిల్ ఏజ్డ్ ఫాదర్‌గా కనిపిస్తారు' అని తెలిపారు. ఈ సినిమాకు దర్శకులు సుకుమార్‌గారి భార్య తబిత సమర్పకురాలిగా వ్యవహరిస్తున్నదని, ఈ సినిమా చూశాక సుకుమార్‌గారు ఫోన్ అద్భుతంగా ఉందని మెచ్చుకున్నారని, ఆయన మాటలు తనలో కాన్ఫిడెన్స్‌ను పెంచాయని లక్ష్మణ్ కార్య ఆనందం వ్యక్తం చేశారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.